సోమవారం
14•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 200
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE





సీఎం కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో మకరసంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.



PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఏకగ్రీవాల వెల్లువ

పంచాయతీ ధూంధాం



ఆదివారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గ్రామపంచాయతీలో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి.

తొలి విడుతలో 753 గ్రామాల్లో ఏకగ్రీవం!

- కొన్నిచోట్ల మొదలైన ప్రమాణస్వీకారాలు
- ఎన్నికలు జరిగే గ్రామాల్లో అభ్యర్థుల జాబితా విడుదల
- గుర్తుల కేటాయింపు పూర్తి.. 21న తొలి విడుత ఎన్నికలు
- రెండో విడుతలో ముగిసిన నామినేషన్ల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ పల్లెల్లో ఏకతారాగం ప్రతిధ్వనిస్తున్నది. రాజకీయాలకు అతీతంగా గ్రామస్వరాజ్య సాధన దిశగా గ్రామాలు కదులుతున్నాయి. పంచాయతీ ఎన్నికల తొలివిడుతలో అత్యధిక గ్రామాల్లో ఏకగ్రీవాలు జరుగటం ఇందుకు తార్కాణం. ఆయా జిల్లాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో తొలివిడుతలోని 4,479 గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. ఆయా అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు కూడా పూర్తయింది. తొలివిడుత ఎన్నికల్లో దాదాపు 753 గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు సమాచారం. పలు గ్రామాల్లో ప్రముఖుల బంధువులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. తొలి విడుతలో ఎన్నికలు జరుగనున్న గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. తొలివిడుతకు జనవరి 21న పోలింగ్ నిర్వహించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆమ్రాబాద్ మండలంలో లక్ష్మాపురం, వంగూరోనిపల్లి, కల్మలోనిపల్లి, కుమ్మరిపల్లి గ్రామాల్లో ఎస్టీ అభ్యర్థులు లేకపోవడంతో ఎన్నికలు జరుగటంలేదు. వరంగల్ గ్రామీణ జిల్లాలో 45 గ్రామాలు ఏకగ్రీవం కాగా.. అవన్నీ టీఆర్ఎస్ ఖాతాలో జమయ్యాయి. కాగా, రెండో విడుత పంచాయతీ ఎన్నికలకు

మిగతా 8వ పేజీలో



వేలం వేస్తే ఎన్నిక రద్దు

- నిర్వహించిన వ్యక్తులకు ఏడాది జైలుశిక్ష
- పండుగదినాల్లోనూ సిబ్బంది పనిచేయడం అభినందనీయం
- తొలివిడుతకు ఏర్పాట్లు పూర్తి: ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

9



పరేడ్‌గ్రౌండ్‌లో తెలంగాణ నాలుగో అంతర్జాతీయ పతంగులు, మిఠాయిల పండుగను ప్రారంభించిన అనంతరం వివిధ దేశాల నుంచి ఉత్సవానికి వచ్చిన ప్రతినిధులతో కరచాలనం చేస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో హోం మంత్రి మహమూద్ అలీ ఉన్నారు.

వైవిధ్య భారత్‌కు ప్రతీకగా
పతంగుల పండుగ



పరేడ్ గ్రౌండ్‌లో నోరూరిస్తున్న స్వీట్లు

- దేశ, విదేశీ ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడం హర్షణీయం
- మన సంస్కృతిని కాపాడుతున్న సీఎం కేసీఆర్‌కు అభినందనలు
- కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ప్రారంభసభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- పరేడ్‌గ్రౌండ్‌లో నేడు, రేపు కొనసాగనున్న వేడుకలు

2



సిపాయి సోమ్‌వీర్





అనికా చోప్రా

పాక్ వలపు వల!

ఐఎస్ఐ ఉచ్చులో 50 మంది భారత జవాన్లు

- భారత సైనిక రహస్యాల్ని కొల్లగొట్టేందుకు కుట్ర
- అనికా చోప్రా పేరుతో ఫేస్‌బుక్‌లో చాటింగ్
- ఎరగా చిక్కుకుని రక్షణ వివరాల్ని అందజేసిన సిపాయి సోమ్‌వీర్
- అరెస్టు చేసిన నిఘాసంస్థలు

న్యూఢిల్లీ, జనవరి 13:

హాయ్.. హలో.. బాగున్నారా! అంటూ ఫేస్‌బుక్‌లో ఓ అందమైన మహిళ చాటింగ్ చేస్తూ భారత సైనిక రహస్యాల్ని కాజేసింది. తన అందమైన నవ్వుతో, కవ్వింపు మాటలతో ఒకరిని కాదు ఇద్దరిని కాదు ఏకంగా 50 మంది సైనికుల్ని బురిడీ కొట్టించింది. ఫేస్‌బుక్‌లో ఎప్పటికప్పుడు తన ఫొటోలను పోస్టు చేస్తూ, సందేశాలు పంపుతూ జవాన్లను ఆకర్షిస్తూ వారి నుంచి రక్షణ సమాచారాన్ని కొల్లగొట్టింది. ఈ వగలాడి మాటలకు బోల్తాపడిన ఓ సైనికుడు భారత సైనిక రహస్యాల్ని ఒక్కొక్కటిగా చెప్పుకొంటూ పోయాడు. హనీ ట్రాపింగ్ (వలపు వల)గా పిలిచే ఈ ప్రక్రియలో తీగలాగితే డొంకంతా కదిలిన చందంగా గుట్టు రట్టయింది. ఇదంతా పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కుట్ర అని, అనికా చోప్రా పేరుతో నకిలీ ఖాతాను సృష్టించి జవాన్లను ఉచ్చులోకి

మిగతా 5వ పేజీలో

అందుబాటులోకి ధరణి



ధరణి వెబ్‌సైట్

- ఇక ఇంటర్నెట్‌లో భూముల వివరాలు
- 1(బీ) పట్టా, పహణీలను కూడా చూసుకోవచ్చు
- సర్వేనంబర్లవారీగా స్కెచ్‌లు
- తప్పులుంటే ఫిర్యాదుకు అవకాశం
- కోర్‌బ్యాంకింగ్ విధానం అమలుకు మరికొంత సమయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం రాష్ట్రంలో భూమికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు తెలిసేలా రూపొందించిన 'ధరణి' వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. ఇకనుంచి రైతులు, ప్రజలు తమ భూములకు సంబంధించిన వివరాలన్నింటినీ ప్రపంచంలో ఎక్కడినుంచైనా ఇంటర్నెట్‌లో చూసుకోవచ్చు. ఎలాంటి వివాదాలులేకుండా క్లియర్‌గా ఉన్న (పార్ట్-ఏ) వ్యవసాయభూముల వివరాలన్నీ 'ధరణి'లో పొందుపరిచారు. ఇంటర్నెట్‌లో dharani.telangana.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్తే ఈ వివరాలన్నీ లభిస్తాయి. రికార్డ్స్ ఆఫ్ రైట్ (ఆర్వోఆర్) చట్టం ప్రకారం భూమి యాజమాన్య హక్కులను ధ్రువీకరించే 1(బీ) పట్టాతోపాటు భూమి వివరాలను, స్వభావం, అనుభవదారుల వివరాలు తెలియజేసే పహాణీలను కూడా ఈ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చు. భూమి సర్వేనంబర్లకు సంబంధించిన స్కెచ్‌లను కూడా ధరణిలో అందుబాటులో ఉంచారు. పార్ట్-బీ లోని వివాదాలు పరిష్కారమైన భూముల వివరాలు కూడా ధరణిలో పొందుపరుచనున్నారు.

బాలారిష్టాలను అధిగమించి..

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలమేరకు రెవెన్యూ బృందాలు రికార్డు స్థాయిలో కేవలం వందరోజుల్లో భూ రికార్డుల ప్రక్షాళన చేశాయి. దాదాపు 97 శాతం భూములకు సంబంధించిన వివరాలను హేతుబద్ధంచేసి ప్రజలకు 1(బి) పట్టా కాగితాలను రైతుల ఇండ్లకు వెళ్లి అప్పగించారు. ఈ రికార్డులు ఆన్‌లైన్‌ద్వారా

మిగతా 8వ పేజీలో

ప్రస్తుతం అందిస్తున్న సేవలు

- 'ధరణి' వెబ్‌సైట్ హోం పేజీ ఓపెన్ చేయగానే రైతులు వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న చిత్రాలతో, ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. హోం పేజీలో సర్వీసెస్, జీఐఎస్, ల్యాండ్ స్టేటస్, మీ-సేవ, సజెషన్స్, గ్రీవెన్సెస్ విభాగాలను ఏర్పాటుచేశారు. ఇందులో ల్యాండ్ స్టేటస్ ఓపెన్ చేస్తే.. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, గ్రామం, ఖాతానంబర్, సర్వేనంబర్ల వివరాలను కోరుతుంది. ఈ మేరకు వివరాలు నమోదుచేసి.. ఖాతా నంబర్‌పైగానీ, సర్వే నంబర్‌పైగానీ క్లిక్‌చేస్తే పూర్తివివరాలు వస్తాయి. ఇందులో ఆర్వోఆర్ 1(బీ) పట్టా, పహాణీలు ఉంటాయి. సర్వేనంబర్ స్కెచ్ కూడా మ్యాప్‌లో ఉంటుంది. వివరాలను స్కాన్ కాపీ కింద డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- జీఐఎస్ విభాగంలోకి వెళ్తే జిల్లా, డివిజన్, మండలం, గ్రామం ఎంపికచేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత సర్వేనంబర్లవారీగా గ్రామం మ్యాప్ వస్తుంది. దీంట్లో సర్వేనంబర్ల స్కెచ్ ఏవిధంగా ఉందో చూసుకోవచ్చు. దీనికింద లేయర్స్ వస్తుంది. దీనిని క్లిక్‌చేస్తే

మిగతా 8వ పేజీలో



జుల్ఫీకరుద్దీన్

ఫుట్‌బాల్ దిగ్గజం జుల్ఫీకరుద్దీన్ ఇకలేరు

ఆటలో



ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద బారులు తీరిన వాహనాలు

టోల్ ఫ్రీ రాష్ట్ర రహదారులపైనే

- ఎన్‌హెచ్‌ఏఐనుంచి రాని అధికారిక ఉత్తర్వులు
- జాతీయ రహదారుల్లో ఆగని టోల్ వసూళ్లు
- హైవేలపై టోల్‌గేట్ల వద్ద ఉద్రిక్తత

3

భగ్గుమన్న పెట్రో ధరలు

- ఆదివారం పెట్రోల్, డీజిల్‌పై భారీగా వడ్డన
- హైదరాబాద్‌లో 53 పైసలు పెరిగి రూ.74కు చేరిన పెట్రోల్
- 64 పైసలు ఎగిసి రూ.69.24 వద్దకు డీజిల్



11

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామివారి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 12 వేల మంది భక్తులకుపైగా ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, పట్నం, మరికొందరు తాము బస చేసిన గదుల వద్ద, మహా మండపంలో పట్నాలు వేయించి మొక్కులు చెల్లించుకున్నారు.
- చేర్యాల, నమస్తే తెలంగాణ



సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మూడురోజుల పాటు కొనసాగే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ ఆదివారం కన్నుల పండువగా ప్రారంభమైంది. 20 దేశాల నుంచి 42 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, 60 మంది దేశవాళీ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా వేడుకలోపాల్గొని వివిధ రకాల పతంగులను ఎగురవేశారు. విభిన్న రకాల పతంగులను తిలకించేందుకు నగరవాసులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



నేటినుంచి గిరిజన విద్యార్థుల క్రీడాపోటీలు

- ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ మీట్-2019కి హైదరాబాద్ వేదిక
- జాతీయస్థాయి పోటీలకు హాజరుకానున్న 1,777 మంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) విద్యార్థుల జాతీయస్థాయి మొదటి స్పోర్ట్స్ మీట్-2019కి హైదరాబాద్ గచ్చిబౌలి మైదానం వేదిక కానున్నది. 20 రాష్ట్రాలకు చెందిన 1,777 మంది గిరిజన విద్యార్థులు పాల్గొననున్న ఈ క్రీడాపోటీలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి క్రీడాపోటీలను జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఓరమ్, రాష్ట్ర సీఎస్ ఎస్కే జోషి, తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొననున్నారు. పోటీల కోసం గిరిజన సంక్షేమశాఖ, గిరిజన గురుకుల విద్యాలయాల సొసైటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హాకీ, ఫుట్‌బాల్, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ, కోకో, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, కరాటేతో పాటు అథ్లెటిక్స్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన 273 మంది, ఏపీ నుంచి 86 మంది, మహారాష్ట్ర నుంచి 204 మంది, ఇతర రాష్ట్రాల నుంచి పలువురు గిరిజన విద్యార్థులు పాల్గొననున్నారు.

18న పీజీటీ బయాలజీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టుల భర్తీకి చేపట్టిన అర్హతపరీక్షలో ఎంపికైన బయాలజీ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 18న పరిశీలించనున్నారు. అర్హులైన అభ్యర్థులకు టీఆర్ఈఐ-ఆర్బీ ఫోన్ సందేశాన్ని పంపింది.

ముహూర్తం

సూర్యోదయం: 6.53 గంటలకు

సూర్యాస్తమయం: 5.57 గంటలకు

సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం అష్టమి, నక్షత్రం: రేవతి మధ్యాహ్నం 12.53 వరకు, తదుపరి అశ్విని, అమృతఘడియలు: ఉదయం 10.18 నుంచి 11.54 వరకు, రాహుకాలం ఉదయం 8.16 నుంచి 9.39 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.03 నుంచి 12.47 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.00 నుంచి 3.44 వరకు, వర్జ్యం: లేదు.

లోకం పోకడ



ఈ సంక్రాంతికి మా కోడళ్లు వేసే ముగ్గు చూశావా వదినా!

దేశ వైవిధ్యానికి ప్రతిబింబంగా కైట్ ఫెస్టివల్

- దేశ, విదేశీ ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడం హర్షణీయం
- మన సంస్కృతిని కాపాడుతున్న సీఎం కేసీఆర్‌కు అభినందనలు
- పాశ్చాత్య సంస్కృతిని వదిలి మన జీవన పద్ధతులను ఆచరిద్దాం
- కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ప్రారంభసభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- పరేడ్‌గ్రౌండ్‌లో నేడు, రేపు వేడుకలు



సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు



ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివలో స్వీట్ స్టాళ్లను పరిశీలిస్తున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ, విదేశీ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హైదరాబాద్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం సంతోషంగా ఉన్నదని, ఈ వేడుక మన దేశ వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలిచిందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సంప్రదాయ పండుగలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని అభినందించారు. మన పండుగలు ఐకమత్యానికి ప్రతీకలని, సామాజిక సంబంధాలను మెరుగుపరుస్తాయని చెప్పారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మూడురోజులపాటు కొనసాగే ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో కొత్త కాంతులు నిండాలని ఆకాంక్షించారు. కైట్ ఫెస్టివల్ నాలుగో వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మూలం నేలమీదే ఉందని పతంగులు గుర్తుచేస్తాయన్నారు. భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగకు ఒక అర్థం ఉంటుందని, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఒకేచోటుకు చేరుకొని సంతోషంగా గడుపుతారని చెప్పారు. భారతీయ సంస్కృతిని, జీవన పద్ధతులను, మన ఆహార అలవాట్లను నేటి తరం అవగాహన చేసుకోవాలని, వాటి పునర్జీవానికి కృషిచేయాలని కోరారు. పాశ్చాత్య సంస్కృతిని వీడి మన మూలాలకు తరలివెళ్దామని పిలుపునిచ్చారు. అందరూ ఆరోగ్యంగా జీవించాలని, చేదు, తీపి.. ఇలా అన్ని రుచులను అనుభవించాలని సూచించారు. క్రీడలు మన ఆరోగ్యాన్ని, సహనాన్ని పెంచుతాయని చెప్పారు. పతంగులు ఎగురవేయడం ద్వారా మానసిక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. ఐకమత్యానికి నిదర్శనంగా నిలిచే ఇలాంటి వేడుకలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని సూచించారు. నలుడు, భీముడు మొదలుకొని భారతీయుల్లో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారని, మన దేశంలో ఎన్నో ప్రామాణిక శాస్త్రాలు పుట్టాయని గుర్తుచేశారు. అన్ని రకాల వంటల గురించి, అవి తినడం వల్ల కలిగే లాభాల గురించి సుకేశ ముని రచించిన సూప శాస్త్రం గురించి ప్రస్తావించారు. మన ఆహార అలవాట్లను, సంప్రదాయాలను వదిలి పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగులెత్తడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. అంతర్జాతీయంగా వివిధ దేశాల వారికి మన తీపి రుచులను పరిచయం చేస్తూ అంతర్జాతీయ స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించడం అద్భుతమని ప్రశంసించారు. ఓవైపు కైట్స్, మరోవైపు స్వీట్స్.. ఇదో అరుదైన కాంబినేషన్ అని చెప్పారు.

నోరూరిస్తున్న 1200 రకాల స్వీట్లు

కైట్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌లో ఘుమఘుమలాడే తీపి పదార్థాలు సందర్శకుల మనసును దోచేశాయి. పలు దేశాలు, రాష్ట్రాలకు చెందిన స్వీట్లతో స్వీట్ లవర్స్ పండుగ చేసుకున్నారు. దాదాపు 1200 రకాల స్వీట్లు ఒకే వేదికపైకి చేరడంతో ఆస్వాదించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు స్వయంగా స్వీట్లను తయారుచేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా వారి సంప్రదాయ వస్త్రధారణ మరో ఆకర్షణగా నిలిచింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సాయంత్రం వరకే పలు స్వీట్ స్టాళ్లు ఖాళీ అయ్యాయి.

హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతి: స్వామిగౌడ్

పతంగుల పండుగతో హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ చెప్పారు. స్వీట్స్ ఫెస్టివల్‌లో వివిధ ప్రాంతాల రుచులు కొలువుదీరడం సంతోషకరమన్నారు. ఇది ప్రతిఒక్కరూ వీక్షించాల్సిన కార్యక్రమమని చెప్పారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ మూడురోజుల పతంగుల పండుగ అందరిలోనూ ఉత్సాహం నింపుతుందన్నారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, టూరిజంశాఖ ఇంచార్జి కమిషనర్ దినకర్ బాబు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వరల్డ్ కౌన్సిల్ టూరిజం ప్రెసిడెంట్ జంగ్, మేజర్ జనరల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరేడ్‌గ్రౌండ్స్‌కు పోటెత్తిన ప్రజలు

కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను తొలిరోజు తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు. ఓవైపు ఆకాశంలో రంగురంగుల పతంగులు, మరోవైపు నోరూరించే తీపి పదార్థాలను ఆస్వాదించేందుకు ఉదయం నుంచే పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నైట్ కైట్ ఫెస్టివల్‌ను ఆదివారం సాయంత్రం పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రారంభించారు. ప్రధాన వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించేలా నిర్వహించిన నృత్య కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. 20 దేశాల నుంచి 42 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, 60 మంది దేశవాళీ క్లబ్ సభ్యులు, పెద్ద సంఖ్యలో సందర్శకులు పాల్గొన్నారు. ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ ఫెస్టివల్ సోమ, మంగళవారాల్లోనూ కొనసాగనున్నది.

రైల్వే టెర్మినళ్ల కోసం స్థలాన్వేషణ

- చర్లపల్లి, నాగులపల్లిలో ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- చర్లపల్లి రైల్వేస్థలాల్లో రూ.80 కోట్లతో ప్రారంభమైన పనులు
- మరో 150 ఎకరాల సేకరణకు రాష్ట్రప్రభుత్వం కసరత్తు
- నాగులపల్లిలో 300 ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు
- సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ టెర్మినళ్లపై తగ్గనున్న ఒత్తిడి
- టెర్మినళ్ల ఏర్పాటుపై కేంద్రాన్ని ఒప్పించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్ శివారులోని నాగులపల్లి రైల్వేస్టేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ శివారులోని చర్లపల్లి, నాగులపల్లిలో ఏర్పాటుచేయనున్న రైల్వే టెర్మినళ్ల కోసం స్థల సేకరణ పనులను రాష్ట్రప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ రెండు టెర్మినళ్ల ఏర్పాటుకు కేంద్రం గతంలోనే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందుకు అవసరమైన స్థలాలను సొంతంగా సేకరించి రైల్వేశాఖకు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. చర్లపల్లిలో ఉన్న ప్రభుత్వ స్థలాలపై ఇప్పటికే సర్వే చేయించింది. ఇక్కడ ఉన్న కేంద్రప్రభుత్వ సంస్థలైన ఎఫ్‌సీఐ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, పీఎస్‌యూకు చెందిన స్థలాలను సేకరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. చర్లపల్లిలో టెర్మినల్ కోసం గత బడ్జెట్‌లోనే కేంద్రం రూ. 80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం చర్లపల్లిలో రైల్వేకు చెందిన 40 ఎకరాల్లో టెర్మినల్ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఆరు ప్లాట్‌ఫారాలను నిర్మించేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. రాష్ట్రప్రభుత్వం మిగిలిన 150 ఎకరాల స్థలాన్ని అప్పగిస్తే పనులను వేగవంతం చేసేందుకు రైల్వే అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ టెర్మినల్‌ను ముందుగా మౌలాలిలో ఏర్పాటుచేయాలని భావించినా.. చర్లపల్లిలో ఉన్న అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇక్కడకు మార్చారు. నాగులపల్లి టెర్మినల్ కోసం రైల్వేశాఖ ప్రతిపాదించిన 300 ఎకరాలను సేకరించే బాధ్యతను ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అప్పగించింది.

కేంద్రాన్ని ఒప్పించిన సీఎం కేసీఆర్

ప్రస్తుతం ఉన్న సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ టెర్మినళ్లలో స్థలాభావం సమస్య అధికంగా ఉన్నది. ఇవి నగరం నడిబొడ్డున ఉండటంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ విషయాలన్నిటిపై కేంద్ర ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చించారు. హైదరాబాద్‌కు అదనపు టెర్మినళ్ల ఏర్పాటు అవసరాన్ని వివరించి ఆ మేరకు కేంద్రాన్ని ఒప్పించారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.80 కోట్లు కేటాయించేలా చేశారు. త్వరగా స్థలాన్ని సేకరించి రైల్వేకు అప్పగించాలని సీఎం కేసీఆర్ పలుమార్లు అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

సమస్యల చట్రంలో మూడు టెర్మినళ్లు

ప్రస్తుతం ఉన్న సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ టెర్మినళ్లలో స్థలాభావంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం రెండున్నర లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే దాదాపు 250 రైళ్లు ఈ స్టేషన్లకు రాకపోకలు సాగిస్తుంటాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు ఈ టెర్మినళ్లలో మైనర్ రిపేర్లు, వాటర్, టాయిలెట్స్ శుభ్రం చేయడం వంటి పనులు చేస్తారు. అయితే, రైలు నిలిపేందుకు అదనపు లైన్లు లేకపోవడంతో వాటిని ఇతర స్టేషన్లకు తరలించాల్సి వస్తున్నది. అలాగే నగర శివారు ప్రాంతాల ప్రయాణికులు రైలు ప్రయాణం కోసం సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లకు వెళ్లాలంటే రెండు గంటలకు పైగా సమయం పడుతున్నది. ఒక్కోసారి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి ప్రయాణాన్ని వాయిదా వేసుకున్న సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు నూతన టెర్మినళ్లు అవసరమని భావించిన రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రెండింటిని సాధించింది.

ఔటర్‌కు నూతన టెర్మినళ్ల అనుసంధానం

కొత్తగా నిర్మించబోయే రెండు రైల్వే టెర్మినళ్ల నుంచి ప్రయాణికుల రాకపోకలను ఔటర్ రింగ్‌రోడ్డుకు అనుసంధానం చేయనున్నారు. చర్లపల్లి టెర్మినల్ తిరుపతి, చెన్నై, ఢిల్లీ నుంచి రాకపోకలు సాగించే రైళ్లకు అనుకూలంగా ఉంటుంది. అలాగే నాగులపల్లి టెర్మినల్ ముంబై రూట్ నుంచి వచ్చే రైళ్లకు అనుకూలంగా ఉంటుంది. ఔటర్ రింగ్‌రోడ్డు నగరం చుట్టూ ఉన్న నేపథ్యంలో రైలు ప్రయాణం సులభతరమ్యే అవకాశాలున్నాయి. నగరంలో ట్రాఫిక్ సమస్య కూడా తొలగిపోనున్నది.



చైనా మాంజాలతో పోలీసులకు చిక్కిన నిందితులు


భారీగా చైనా మాంజా పట్టివేత

- హైదరాబాద్‌లో పలువురు అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నిషేధిత చైనా మాంజా అమ్ముతున్న పలువురిని హైదరాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం సెంట్రల్, నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళ్‌హాట్‌లోని అప్పర్ ధూల్‌పేటలో నివాసముండే రాజ్‌కుమార్‌సింగ్ నుంచి రూ.25 వేల విలువైన, సికింద్రాబాద్ బోయినపల్లి మదానికాలనీలోని బుక్స్ అండ్ కైట్స్ సేల్స్ నిర్వాహకుడు బడె శ్రీనావాస్ వద్ద రూ.75 వేల విలువైన నిషేధిత మాంజాలను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు చెప్పారు. వారాసిగూడలో సారంగపాణి, చేతి ధర్మయ్య, సైదాబాద్ జాకీర్‌హుస్సేన్ కాలనీలో మహ్మద్ అబ్దుల్ రహీం, జయనగర్‌లో పీ శంకరన్, చింతల్‌బస్తీకి చెందిన సోమరాజు, ఏసీగార్డ్స్‌కు చెందిన అహ్మద్‌బిన్ సలీం, ఖైరతాబాద్ మార్కెట్ ప్రాంతంలో శోభన్ చైనా మాంజా విక్రయిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణకు వేదిక

- బయోఏషియా సదస్సును అవకాశంగా మలుచుకోనున్న రాష్ట్రం
- రాష్ట్ర అనుకూలతలను ప్రతినిధులకు వివరించనున్న ప్రభుత్వం
- ఫిబ్రవరి 25 నుంచి సదస్సు.. 55 దేశాల ప్రతినిధుల హాజరు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో నిర్వహించే బయో ఏషియా సదస్సును పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. జీవ సాంకేతిక, జీవశాస్త్ర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, ఎదురవుతున్న సవాళ్లపై చర్చించేందుకు ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు హెచ్‌ఐసీసీలో 16వ బయో ఏషియా సదస్సును నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఈ వేదిక ద్వారా బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. వనరులు, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం, టీఎస్ఐపాస్, ఈవోడీబీలో ప్రభుత్వ ముందడుగు తదితర అంశాలను వెల్లడించనున్నారు.

1500 మంది ప్రతినిధులు

రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే బయో ఏషియా సదస్సుకు ఈసారి 55 దేశాల నుంచి దాదాపు 1,500 మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా. లైఫ్ సైన్సెస్ 4.0, జెనరిక్స్ ఇండస్ట్రీ, మేకింగ్ పర్సనలైజ్డ్ మెడిసన్ ఏ రియాల్టీ, రీఇన్వెంటింగ్ ఫార్మా సేల్స్ అండ్ మార్కెటింగ్, ఫార్మా అండ్ టెక్ కంపెనీస్ అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. 100 మంది ప్రముఖ వక్తలు ప్రసంగిస్తారు. ఇప్పటికే ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో ప్రముఖ శాస్త్రవేత్తలు, సంస్థల నిర్వాహకులను ప్రసంగించడానికి ఆహ్వానించారు. 800 పైగా కార్పొరేట్ సంస్థలు ఇందులో భాగస్వామ్యం అవుతున్నాయి. వెయ్యికిపైగా బిజినెస్ టు బిజినెస్ (బీటూబీ) సమావేశాలు జరుగనున్నాయి. ఫార్మా, ఇతర అనుబంధ రంగాలకు చెందిన సంస్థలు 100 స్టాళ్ల ద్వారా ఉత్పత్తులు, యంత్ర పరికరాలను ప్రదర్శించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ సదస్సులో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఫాబా), టీఎస్ఐఐసీ, రిచ్, ఇన్వెస్ట్ ఇండియా తదితర సంస్థలు కీలక భాగస్వాములుగా ఉన్నాయి. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ మంత్రిత్వ శాఖలు సహకారం అందిస్తున్నాయి. సదస్సులో ఈసారి కూడా జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును బయో ఏషియా కమిటీ ఎంపికచేసిన అంతర్జాతీయ శాస్త్రవేత్తకు బహూకరిస్తారు. దీంతోపాటు ఫాబా ఇన్నోవేషన్ అవార్డు, బయో ఏషియా ఇన్నోవేషన్ అవార్డును అందించనున్నారు.

కార్యక్రమ షెడ్యూల్

తొలిరోజు ఫిబ్రవరి 25న ప్రతినిధులు శామీర్‌పేటలోని జీనోమ్ వ్యాలీని సందర్శిస్తారు. బయోటెక్నాలజీ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, ఇప్పటికే ఉన్న సంస్థల వివరాలను అధికారులు వివరిస్తారు. సాయంత్రం హెచ్ఐసీసీలో ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తారు. జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును అందిస్తారు. రెండో రోజైన ఫిబ్రవరి 26న సాయంత్రం సీఈవో కాంక్లేవ్ ఉంటుంది. ఇందులో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల సీఈవోలు పాల్గొంటారు. ఫిబ్రవరి 27న ముగింపు కార్యక్రమం ఉంటుంది.

ముగిసిన 'అమ్మానాన్నల హల్‌చల్'


- పాల్గొన్న 1200 మంది విద్యార్థుల తల్లిదండ్రులు
- హాజరైన ఎమ్మెల్యే అంజయ్య, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్



కమ్మదనం గురుకుల పాఠశాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

షాద్‌నగర్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రాధాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపేందుకు ఆ శాఖ అధికారులు నిర్వహించిన రాష్ట్రస్థాయి 'అమ్మనాన్నల హల్‌చల్' కార్యక్రమం ఆదివారం ముగిసింది. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల మైదానంలో రెండురోజులపాటు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 1200 మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో సత్తాచాటారు. ముగింపు వేడుకలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్, తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ కరుణాకర్, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి హాజరై మాట్లాడారు. పేద విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నడుస్తున్నాయని, నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా క్రీడలు, సాంస్కృతికరంగాల్లో శిక్షణ ఇస్తున్నాయని పేర్కొన్నారు. క్రమశిక్షణతోపాటు ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కబడ్డీ, వాలీబాల్, చదరంగం, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, వ్యాసరచన, క్విజ్ వంటి అంశాల్లో పోటీలను నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలల ఆర్సీవో కే శారద, ఆర్ శారదా వెంకటేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ కే విద్యాలత, పీఈటీ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

హైటెక్ వెలవెల



హైదరాబాద్‌లో నివసిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందినవారు సంక్రాంతి సెలవుల్లో పల్లెలకు వెళ్లడంతో ఆదివారం నిర్మానుష్యంగా కనిపించిన హైటెక్ సిటీ ప్రాంతం

ఐనవోలుకు ఉత్సవ కళ

వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలులో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆదివారం ధ్వజారోహణం నిర్వహించారు. తొలిరోజే మల్లన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి దర్శనానికి తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో.. ఆర్టీసీ హన్మకొండ, వరంగల్, హైదరాబాద్, కొమురవెల్లి బస్టాండ్ల నుంచి 100 ప్రత్యేక బస్సులను నడుపుతున్నది.

- ఐనవోలు



టోల్ ఫ్రీ రాష్ట్ర రహదారులపైనే



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో నేరుగా వెళ్తున్న వాహనాలు

- ఎన్‌హెచ్‌ఏఐనుంచి రాని అధికారిక ఉత్తర్వులు
- జాతీయ రహదారుల్లో ఆగని టోల్ వసూళ్లు
- హైవేలపై టోల్‌గేట్ల వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/చౌటుప్పల్ రూరల్/మాడ్గులపల్లి: సంక్రాంతి పండుగ నేపథ్యంలో వాహనదారులనుంచి టోల్‌గేట్ల వద్ద రుసుము వసూలు చేయొద్దంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు కేవలం రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌గేట్లల్లో మాత్రమే పాటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటుచేసిన టోల్‌గేట్లలో చెల్లవని అక్కడి సిబ్బంది తెగేసి చెప్తూ ఉచిత ప్రయాణానికి నిరాకరించారు. ఆదివారం యథావిధిగా టోల్ వసూళ్లు చేపట్టారు. దీంతో టోల్‌గేట్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పండుగపూట 13, 16 తేదీల్లో టోల్ వసూళ్లు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ ఆదివారం రాష్ట్ర హైవేలపై ఉన్న టోల్‌గేట్లలో మాత్రమే వాహనాలను ఉచితంగా వదిలేశారు. విజయవాడ జాతీయ రహదారిలోని పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌గేట్ల వద్ద రుసుము యథావిధిగా వసూలుచేశారు. బెంగళూరు హైవేపై ఏర్పాటు చేసిన షాద్‌నగర్, అడ్డాకుల, అలంపూర్ టోల్‌గేట్లల్లోనూ వాహనదారులు రుసుము చెల్లించి వెళ్లారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున అర కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీనికితోడు పొగమంచు కూడా కమ్మేసింది. టోల్ చెల్లించడానికి ఒక్కో వాహనానికి సుమారు 20 నిమిషాల సమయం పట్టింది. సాధారణ రోజుల్లో 18 వేల వాహనాలు వెళ్తుంటాయి. ఆదివారం మాత్రం రెట్టింపుస్థాయిలో వెళ్లినట్టు సమాచారం. ప్రభుత్వం టోల్ వసూళ్లను రద్దుచేసినా టోల్‌ప్లాజా సిబ్బంది ఉదయం 11 గంటల వరకు టోల్ వసూలుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా టోల్ వసూలు చేయడంపై ప్రయాణికులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సర్దిచెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్డీవో సూరజ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని టోల్‌వసూళ్లను నిలిపివేయించారు. ఈ విషయమై రాష్ట్ర ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ చందూలాల్ స్పందిస్తూ రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌గేట్లలో ఆదివారం వాహనాలను ఉచితంగా అనుమతించాలని మౌఖికంగా చెప్పినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచిగానీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నుంచిగానీ తమకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదని పేర్కొన్నారు. ఆదివారం మాత్రం వాహనాలను ఉచితంగా వదిలివేయాలని చెప్పామన్నారు. 14, 15 తేదీల్లో ఉచితంగా వాహనాలు పంపించే విషయమై ఎలాంటి ఆదేశాలు అందలేదని, దీంతో యథావిధిగా టోల్ వసూళ్లు చేపడుతారని చెప్పారు. 16వ తేదీ విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, రాష్ట్ర ప్రభు త్వం, ఎన్‌హెచ్‌ఏఐ నుంచి ఆదేశాలు వస్తే వాటికి అనుగుణంగా వెంటనే చర్యలు చేపడుతామని వివరించారు.

సంక్రాంతి రద్దీ, రైళ్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని రద్దీకి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే అదనంగా 204 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నది. ఆదివారం అన్ని రైల్వేస్టేషన్లలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఈ రద్దీని క్రమబద్ధీకరించడానికి ప్రత్యేక అధికారులు కూడా ఆయా రైల్వేస్టేషన్లలో పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు. బుకింగ్ కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మంచినీరు, క్యాటరింగ్ కేంద్రాల వద్ద ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నారు.

మరో రెండ్రోజులు పొగమంచు

కొన్నిచోట్ల శీతలగాలులు వీచే అవకాశం
మహారాష్ట్ర మీదుగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని కొన్నిప్రాంతాల్లో మరో రెండురోజులపాటు రాత్రి, ఉదయం సమయాల్లో పొగమంచు ఆవరిస్తుందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. కొన్ని జిల్లాల్లో పొగమంచుకుతోడు శీతలగాలులు వీచే అవకాశం ఉన్నదన్నారు. వాస్తవానికి పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగినా చలి ప్రభావం ఇంకా ఉన్నది. ప్రధానంగా తూర్పు ఆగ్నేయ దిశనుంచి వీస్తున్న గాలుల వల్ల ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతున్నది. రాగల మూడురోజులపాటు రాష్ట్రంలో పొడివాతావరణం ఉంటుందని అధికారులు వివరించారు. ఉత్తర కర్ణాటక నుంచి మధ్య మహారాష్ట్ర వరకు 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నది. దీని ప్రభావం తెలంగాణపై నామమాత్రమేనని అధికారులు వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి దగ్గరగా నమోదవుతుండటంతో చలి ప్రభావం నామమాత్రంగానే ఉన్నది. మరో రెండు మూడు రోజులపాటు ఉష్ణోగ్రతల్లో స్వల్ప హెచ్చుతగ్గులు ఉంటాయని అధికారులు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 17.5 డిగ్రీలుగా నమోదైంది.



ఆదివారం ఉదయం జనగామ జిల్లా పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద లైట్లు వేసుకుని వస్తున్న వాహనాలు



ఆదివారం ఉదయం 9 గంటలకు పొగమంచు కారణంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో వరంగల్ జాతీయ రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్తున్న దృశ్యం

ఇబ్బందిపడుతున్న వాహనదారులు

కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ఘట్‌కేసర్/జనగామ: రెండురోజులుగా కురుస్తున్న పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం పొగమంచు కారణంగా రంగారెడ్డి జిల్లాలో పలు వాహనాలు ఢీకొట్టుకున్న విషయం తెలిసిందే. ఆదివారం పలు ప్రాంతాలను పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఉదయం 9 గంటలవరకు కూడా లైట్లువేసుకొని ప్రయాణించారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా లైట్లు వేసుకొని ప్రయాణించాయి. పొగమంచుతోపాటు వాతావరణం చలిగా ఉండటంతో ప్రజలు ఇండ్లల్లోనుంచి బయటకు రాలేకపోయారు. జనగామ జిల్లాను పొగమంచు కమ్మేసింది. ఉదయం 8.30 గంటల వరకు వరంగల్– హైదరాబాద్ హైవేపై పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద వాహనాలు కనిపించలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కొన్ని రోజుల నుంచి మంచు ఇబ్బంది పెడుతున్నది. ఉదయం పది గంటల వరకూ పొగమంచు పల్లెలను, గిరిజన గూడేలను కప్పేస్తున్నది. కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై పొగమంచు కప్పేయడంతో వాహన డ్రైవర్లు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
జోగులాంబ గద్వాల	8.8	35.0
నాగర్‌కర్నూల్	11.2	34.6
మహబూబ్‌నగర్	11.6	34.6
వరంగల్ రూరల్	12.0	30.0
సూర్యాపేట	13.0	31.0
వికారాబాద్	13.3	29.0
సంగారెడ్డి	13.6	34.6
రాజన్న సిరిసిల్ల	14.0	29.0
నిర్మల్	14.0	31.0
వనపర్తి	14.7	35.5
యాదాద్రి	14.9	33.0
జనగామ	15.2	33.8
మెదక్	15.6	34.5
రంగారెడ్డి	16.0	29.0
కామారెడ్డి	16.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	16.0	31.0
జగిత్యాల	16.0	32.0
నల్లగొండ	16.4	30.0
మహబూబాబాద్	16.6	35.3
సిద్దిపేట	16.7	34.6
జయశంకర్	17.0	29.0
ఖమ్మం	17.0	31.0
పెద్దపల్లి	17.4	29.8
కరీంనగర్	17.4	35.5
హైదరాబాద్	17.5	28.9
మేడ్చల్ మల్కాజిగిరి	17.5	28.9
వరంగల్ అర్బన్	17.5	29.0
నిజామాబాద్	18.5	30.9
మంచిర్యాల	19.2	31.3
ఆసిఫాబాద్	19.2	31.3
ఆదిలాబాద్	19.2	31.3



ఇందిరాపార్కులోని మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి. చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

మర్రి చెన్నారెడ్డి గొప్ప రాజనీతిజ్ఞుడు

- శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రముఖుల నివాళులు

కవాడిగూడ: మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడని, రాజనీతిజ్ఞుడని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు నేటి యువత పాటుపడాలని కోరారు. ఆదివారం ఇందిరాపార్కులోని మర్రిచెన్నారెడ్డి రాక్ గార్డెన్‌లో మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ సీఎంలు రోశయ్య, నాదెండ్ల భాస్కర్‌రావు, మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు బండారు దత్తాత్రేయ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, సుబ్బిరామిరెడ్డి, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి, జస్టిస్ సుభాషణ్‌రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, చెన్నారెడ్డి కుమారుడు మర్రి శశిధర్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం తదితరులు చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు.

గల్ఫ్ బాధితుడికి చేయూత

- సొంతూరుకు పంపిన టీఆర్ఎస్ యూఏఈ విభాగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గల్ఫ్ బాధితుడికి టీఆర్ఎస్ యూఏఈ విభాగం చేదోడుగా నిలిచింది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలానికి చెందిన దాసరి రజనీకాంత్ బతుకుదెరువుకోసం దుబాయ్ వెళ్లాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సాయంచేయాలంటూ టీఆర్ఎస్ డెన్మార్క్ అధ్యక్షుడు శ్యాంబాబును వేడుకున్నాడు. శ్యాంబాబు సూచనతో సంఘం సభ్యుడు ఏ నరేశ్, భరద్వాజవాలా, పరమేశ్వర్‌గౌడ్, ఎం నరేశ్, షేక్ అహ్మద్, బీ అరవింద్, సురేందర్, వంశీ, నరేందర్ కలిసి రజనీకాంత్ ఉద్యోగంచేస్తున్న కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి, పాస్‌పోర్ట్ తిరిగి ఇప్పించే ఏర్పాట్లుచేశారు. విమాన టికెట్ కూడా ఇప్పించి ఆదివారం భారత్‌కు పంపించారు. తెలంగాణ ఎన్నారై విభాగం సెక్షన్ ఆఫీసర్ చిట్టిబాబు తదితరులు రజనీకాంత్‌ను విమానాశ్రయంలో కలిసి ప్రయాణఖర్చులు అందజేసి సొంతూరుకు పంపారు. టీఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల, సలహాదారు ఎంపీ కవితకు రజనీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి గుర్రం.. ఎగిరిపోయింది!



లండన్: 'ఏమో.. గుర్రం ఎగురావచ్చు!' అని ఎవరన్నారో గానీ ఇంగ్లాండ్‌లో నిజంగానే గుర్రం ఎగిరిపోయింది. అది కూడా మామూలు గుర్రం కాదు.. మాహా పరిమాణం, అంతకంటే దిట్టమైన బరువుతో మిసమిసలాడే భారీ నీటి గుర్రం. అయితే ఇది నిజమైన నీటి గుర్రం కాదు. కాంస్యంతో చేసిన నీటి గుర్రం విగ్రహం. 6.5 అడుగుల ఎత్తు, 1,500 పౌండ్ల బరువు ఉండే ఈ విగ్రహం శుక్రవారం చోరీకి గురైనట్టు కెంట్ పోలీసులు తెలిపారు. టన్‌బ్రిడ్జ్ వెల్స్‌లోని చిల్‌స్టోన్ గార్డెన్ ఆర్నమెంట్స్ ప్రాంగణంలోకి కొందరు బలవంతంగా చొచ్చుకెళ్లి ఈ విగ్రహాన్ని తస్కరించినట్టు భావిస్తున్నారు. 'మా ఉద్యానవనంలో ప్రదర్శిస్తున్న అందమైన కళాకృతుల్లో ఈ నీటి గుర్రం విగ్రహం ఒకటి. ఎంతో సుందరమైన ఈ విగ్రహం చోరీకి గురవడం తీవ్ర విచారం కలిగిస్తున్నది. ఎవరికైనా ఈ విగ్రహం ఆచూకీ తెలిస్తే కెంట్ పోలీసులను సంప్రదించాలని కోరుతున్నాం' అని 'బిజినెస్' వార్తా సంస్థ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. మరోవైపు ఈ విగ్రహ సమాచారం కోసం కెంట్ పోలీసులు కూడా ఫేస్‌బుక్ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇది ఎంతో బరువైన విగ్రహమని, గతంలో దీన్ని పైకి లేపేందుకు ఐదుగురు వ్యక్తుల సాయాన్ని తీసుకోవాల్సి వచ్చిందని నిక్ లింగ్హామ్ అనే పోలీస్ కానిస్టేబుల్ చెప్పారు. ఈ విగ్రహాన్ని తస్కరించినవారు ఎవరైనా దాన్ని పైకి లేపేందుకు పెద్ద యంత్రాన్ని, ఆ విగ్రహాన్ని తరలించేందుకు ఫ్లాట్‌బెడ్ ట్రక్ లాంటి భారీ వాహనాన్ని ఉపయోగించి ఉంటారని పేర్కొన్నారు. ఇది చాలా భారీ విగ్రహమైనందున దాన్ని తరలించేటప్పుడు ప్రజలు ఎవరైనా చూసి ఉండవచ్చని ఆశిస్తున్నామని తెలిపారు.



జమ్ములో లోహ్రి పర్వదినం సందర్భంగా బోగి మంటల చుట్టూ సంప్రదాయ వస్త్రధారణలో నృత్యం చేస్తున్న స్థానిక మహిళలు. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏ విధంగానైతే బోగి మంటలు వేస్తారో అదే విధంగా జమ్ముకశ్మీర్‌లోనూ సంప్రదాయ బోగి మంటలు వేయడం ఆనవాయితీగా వస్తున్నది.

'దృశ్యం' సినిమా చూసి..

హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించిన నిందితులు



ట్వింకిల్ డాగ్రే, జగదీశ్ కరోతియా

ఇండోర్: తెలుగులో వెంకటేశ్, హిందీలో అజయ్ దేవగన్ నటించినచిత్రం 'దృశ్యం' ట్వింకిల్ డాగ్రే అనే మహిళ (22) హత్యకు స్ఫూర్తినిచ్చింది. రెండేండ్ల క్రితం జరిగిన ఈ హత్య కేసులో జగదీశ్ కరోతియా అలియాస్ కల్లూ పహల్వాన్ (65) అనే బీజేపీ నేత,ఆయన ముగ్గురు కుమారులు అజయ్ (36), విజయ్ (38), వినయ్ (31), వారి సహచరుడు నీలేశ్ కశ్యప్ (28)ను శనివారం అరెస్టు చేసినట్టు ఇండోర్ డీఐజీ హరినారాయణ్‌చారి మిశ్రా మీడియాకు చెప్పారు. ఇండోర్‌లోని బన్‌గంగా ప్రాంత వాసి ట్వింకిల్.. జగదీశ్ కరోతియాతో సంబంధం పెట్టుకుని ఆయనతో కలిసి ఉండాలని భావించడంతో కరోతియా కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. దీంతో ట్వింకిల్ హత్యకు కరోతియా, ఆయన కుమారులు కుట్ర పన్నారు. 2016 అక్టోబర్ 16న ఆమెను గొంతు నులిమి హత్య చేసి, మృతదేహాన్ని దగ్ధం చేశారు. ఆ ప్రదేశంలో లభించిన బ్రాస్లెట్, ఇతర ఆభరణాల ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు. ఈ హత్యకు ముందు 'దృశ్యం' చిత్రంలోని ఓ సన్నివేశంచూసి స్ఫూర్తి పొందిన నిందితులు.. ఓ గుంతలో కుక్క మృతదేహాన్ని పూడ్చారు. ఆ గుంతను తవ్వి చూసిన పోలీసులకు కుక్క మృతదేహం కనిపించడంతో దర్యాప్తు పక్కదారి పట్టింది. ఈ కేసు పరిష్కారానికి పోలీసులు కరోతియా, ఆయన కుమారులిద్దరికి గుజరాత్ లేబొరేటరీలో బ్రెయిన్ ఎలక్ట్రికల్ ఆసిలేషన్ సిగ్నేచర్ పరీక్ష నిర్వహించడంతో గుట్టు రట్టయింది. ఒక కేసు దర్యాప్తు కోసం ఈ పరీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి.



బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ భేటీలో రాజ్‌నాథ్, అమిత్‌షా

'సంకల్ప్‌పాత్ర'పై సమావేశమైన బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ!

న్యూఢిల్లీ, జనవరి 13: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు ఇవ్వనున్న వాగ్దానాలపై 'సంకల్ప్ పాత్ర'ను రూపొందించేందుకు బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ ఆదివారం సమావేశమైంది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా కమిటీ సభ్యులంతా సమావేశానికి హాజరయ్యారు. సమావేశం తర్వాత రాజ్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ మేనిఫెస్టో రూపకల్పనపై పూర్తిగా అవగాహన కోసం 15 సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సబ్ కమిటీలు ప్రజలతో సంప్రదించిన తర్వాత మ్యానిఫెస్టో ఖరారవుతుందన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, నిర్మలా సీతారామన్, థావర్‌చంద్ గెహ్లాట్, రవిశంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, కేజే అల్ఫోన్స్, కిరణ్ రిజిజు, డిప్యూటీ సీఎంలు సుశీల్ కుమార్ మోదీ, కేశవ్ ప్రసాద్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ శామ్యూల్ కోసం తమిళనాడు పోలీసుల గాలింపు

జయలలిత ఎస్టేట్ దోపిడీలో పళనిస్వామి హస్తమున్నట్లు శామ్యూల్ సంచలన ఆరోపణలు



చెన్నై, జనవరి 13: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడ్ ఎస్టేట్‌లో దోపిడీ, వరుస హత్యల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి హస్తం ఉన్నట్లు సంచలన ఆరోపణలు చేసిన జర్నలిస్టు మాథ్యూస్ శామ్యూల్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. తమిళనాడుతో పాటు ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లో జల్లెడ పడుతున్నారు. జయలలిత వద్ద ఉన్న కీలక దస్త్రాల కోసమే ఆ దోపిడీ జరిగిందని, అందులో సీఎం పళనిస్వామి హస్తమున్నట్లు శామ్యూల్ ఆరోపించిన విషయం తెలిసిందే.

ఆ పదవికో దండం

- ప్రభుత్వ ఆఫర్‌ను తోసిపుచ్చిన జస్టిస్ సిక్రీ
- సీఎస్ఏటీ పదవి వద్దంటూ న్యాయశాఖకు లేఖ
- అలోక్ వర్మ పదవీచ్యుతిపై దుమారమే కారణమా?
- న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపారన్న రాహుల్



న్యూఢిల్లీ, జనవరి 13: పదవీ విరమణ తర్వాత తనను లండన్‌లోని కామన్వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ (సీఎస్ఏటీ)కు అధ్యక్షుడిగా లేదా సభ్యునిగా నామినేట్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ తిరస్కరించారు. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ పదవి నుంచి తొలగించడంలో నరేంద్రమోదీ సర్కారుకు తోడ్పడిన జస్టిస్ సిక్రీకి మూడు రోజులు తిరక్కుండానే కేంద్రం నుంచి ఈ ఆఫర్ రావడంపై దుమారం చెలరేగడంతో ఆయన ఆ ఆఫర్‌ను తోసిపుచ్చారు. కామన్వెల్త్ ట్రిబ్యునల్ పదవిని చేపట్టేందుకు గతంలో ప్రభుత్వానికి సమ్మతి తెలిపిన జస్టిస్ సిక్రీ.. ఆదివారం ఆ అనుమతిని ఉపసంహరించుకున్నారు. ఈ ఏడాది మార్చి 6న రిటైర్ కానున్న జస్టిస్ సిక్రీకి ఆ తర్వాత సీఎస్ఏటీలో పదవిని కట్టబెట్టాలని నిర్ణయం జరిగినట్టు తెలియడంతో మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అరాచక చర్యలతో మోదీ ప్రభుత్వం న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపిందని ట్వీట్ చేశారు. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ తర్వాత సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ సిక్రీని కామన్వెల్త్ ట్రిబ్యునల్‌కు నామినేట్ చేసేందుకు ప్రభుత్వం ఆయన నుంచి మౌఖికంగా అనుమతి తీసుకున్నదని, అయితే జస్టిస్ సిక్రీ ఆదివారం సాయంత్రం ఆ అనుమతిని ఉపసంహరించుకుంటూ కేంద్ర న్యాయశాఖకు లేఖ రాశారని, ఈ నిర్ణయానికి కారణాలేమిటో కూడా జస్టిస్ సిక్రీ తెలియజేయలేదని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ పదవి నుంచి తప్పించడంలో మోదీకి చేయూతనిచ్చినందుకు ప్రతిఫలంగానే ఆయనను కామన్వెల్త్ ట్రిబ్యునల్‌కు నామినేట్ చేయాలని కేంద్రం నిర్ణయించిందని నిందించడం సరికాదని ఆ వర్గాలు పీటీఐ వార్తా సంస్థకు తెలిపాయి. 'సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తన ప్రతినిధిగా జస్టిస్ సిక్రీని ఈ నెలలోనే నియమించారు. కానీ జస్టిస్ సిక్రీని సీఎస్ఏటీకి నామినేట్ చేసేందుకు ప్రభుత్వం గతేడాది డిసెంబర్ చివరి వారంలోనే ఆయన నుంచి మౌఖికంగా అనుమతి తీసుకున్నది. ఈ రెండు అంశాలకు ఏమాత్రం సంబంధం లేదు. అయినప్పటికీ ఈ రెంటినీ ముడిపెట్టి అనవసర వివాదాన్ని రేకెత్తిస్తున్నారు' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. జస్టిస్ సిక్రీకి కేంద్ర ప్రభుత్వం సీఎస్ఏటీలో ఆఫర్ చేసిన పదవి శాశ్వతమైనది కాదని, ఆ పదవిలో ఉన్నవారికి నెలవారీ వేతనం కూడా ఉండదని తెలిపాయి.

అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించిన త్రిసభ్య కమిటీలో ప్రధాని మోదీ, లోక్‌సభలో ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గేతోపాటు జస్టిస్ సిక్రీ కూడా ఉన్నారు. అలోక్ వర్మను తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ జస్టిస్ సిక్రీ అనుకూలంగా ఓటు వేయడంతో మోదీ తన పంతాన్ని నెగ్గించుకోగలిగిన విషయం తెలిసిందే. అయితే జస్టిస్ సిక్రీని సీఎస్ఏటీకి నామినేట్ చేయడంపై మోదీ సర్కారు ఇవ్వాల్సిన వివరణ చాలా ఉన్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్ పేర్కొన్నారు.

న్యాయస్థానాల్లో మహిళలకు అరకొర ప్రాతినిధ్యం

హైకోర్టు జడ్జీల్లో మహిళలు 11 శాతం లోపే

- పార్లమెంటరీ కమిటీకి ప్రభుత్వం నివేదిక



న్యూఢిల్లీ, జనవరి 13: మన న్యాయస్థానాల్లో, ప్రత్యేకించి ఉన్నత న్యాయస్థానాల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభించడంలేదు. దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో పనిచేస్తున్న మొత్తం 670 మంది న్యాయమూర్తుల్లో మహిళా జడ్జీలు కేవలం 73 మంది మాత్రమే ఉన్నారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీకి తెలియజేసింది. గతేడాది మార్చి 23వ తేదీ నాటికి దేశంలోని 24 హైకోర్టుల్లో 1,079 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా కేవలం 670 మంది మాత్రమే పనిచేస్తున్నారని, దీంతో 409 ఖాళీలు ఏర్పడ్డాయని ప్రభుత్వం పేర్కొన్నది. ప్రస్తుతం పనిచేస్తున్న 670 మంది న్యాయమూర్తుల్లో మహిళా జడ్జీల శాతం 10.89 శాతం మాత్రమేనని న్యాయ, సిబ్బంది వ్యవహారాలకు సంబంధించిన స్థాయీ సంఘానికి సమర్పించిన నివేదికలో న్యాయ మంత్రిత్వశాఖ తెలియజేసింది. న్యాయస్థానాల్లో మహిళలకు, వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం పట్ల పార్లమెంటరీ కమిటీ వెలిబుచ్చిన ఆందోళనలపై న్యాయశాఖ ప్రతిస్పందిస్తూ.. జడ్జీల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను పంపే సమయంలో మహిళలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వెనుకబడిన వర్గాల్లోని అర్హులైన అభ్యర్థులకు తగిన ప్రాధాన్యమివ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన న్యాయమూర్తులను కోరుతున్నదని, తద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు ఉన్నత న్యాయస్థానాల్లో సముచిత ప్రాతినిధ్యం లభిస్తుందని తెలిపింది. అయితే ఉన్నత న్యాయస్థానాల్లో రిజర్వేషన్లను అనుమతించేందుకు రాజ్యాంగంలోని 124, 217 ప్రకరణలను సవరించాలన్న ప్రతిపాదన ఏమీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. జడ్జీల నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు వీలుగా ముఖ్యమంత్రులు/గవర్నర్లకు ఇచ్చిన ఆరు వారాల గడువును కుదించాలని, అలాగే ఉన్నత న్యాయస్థానాల్లోని న్యాయమూర్తుల పదవీ విరమణ వయోపరిమితిని పెంచాలన్న ప్రతిపాదన లేనందున జడ్జీల నియామకాల్లో అనవసర జాప్యానికి ఎట్టిపరిస్థితుల్లోనూ తావులేకుండా చూడాలని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడినట్టు ప్రభుత్వం వెల్లడించింది. న్యాయమూర్తుల నియామకం కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి వచ్చే ప్రతిపాదనలను గవర్నర్లు లేదా ముఖ్యమంత్రులు సిఫారసు చేసేందుకు ప్రస్తుతం ఆరు వారాల గడువు ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ కమిటీ నివేదిక రూపొందించే నాటికి దేశంలో మొత్తం 24 హైకోర్టులు ఉన్నాయి. అయితే ఈ నెల 1వ తేదీ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు కావడంతో ప్రస్తుతం మొత్తం హైకోర్టుల సంఖ్య 25కు పెరిగింది.



యూఏఈ కోస్ట్‌గార్డ్‌కు బందీలుగా చిక్కిన భారతీయులు



భారతీయుల్ని బందీలుగా ఉంచిన గది

యూఏఈ కోస్ట్‌గార్డ్ చెరలో 8మంది భారతీయులు

వీరిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూఏఈ కోస్ట్ గార్డ్ చెరలో 8 మంది భారతీయులు దాదాపు మూడేండ్ల నుంచి బందీలుగా ఉన్నారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన రమేశ్ గాదెల, ఎల్లారావు వీరిలో ఉన్నట్లు తెలిసింది. తమ దుస్థితిపై ఓ మానవ హక్కుల కార్యకర్తకు వీరు సమాచారం అందించడంతో ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కెప్టెన్ అయ్యప్పన్ స్వామినాథన్, భారత్ హరిదాస్, గురునాధన్ గణేశ్ (తమిళనాడు), అలోక్‌పాల్ (ఉత్తరప్రదేశ్), నస్కర్ సౌరభ్ (బెంగాల్), రాజిబ్‌అలీ (అసోం) కూడా బందీల్లో ఉన్నారు. వీరు పనిచేస్తున్న నౌక వాణిజ్య కార్యకలాపాలపై యూఏఈకి చెందిన ఫెడరల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ నిషేధం విధించింది. 2016 ఏప్రిల్ 5న యుఏఈ కోస్ట్ గార్డ్ వీరి షిప్‌ను అదుపులోకి తీసుకుంది. సిబ్బంది పాస్‌పోర్టులను, సీమ్యాన్ బుక్కులను సైతం స్వాధీనం చేసుకుంది. 'వదిలేసిన బానిసల్లా మా పరిస్థితి ఉంది. దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నాం. యాజమాన్యం మమ్మల్ని పట్టించుకోవడం లేదు. కొన్ని నెలులగా జీతాలు కూడా ఇవ్వడం లేదు' అని కెప్టెన్ అయ్యప్పన్ స్వామినాథన్ వాపోయాడు. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న రసియా షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓత్ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణామృతం ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా వీరిని రిక్రూట్ చేసుకున్నారు.

రాజ్‌కుమార్ హిరానీపై 'మీటూ' ఆరోపణలు



- ఆరు నెలలు లైంగిక దాడికి పాల్పడ్డాడని సహ దర్శకురాలి ఆరోపణ
- తప్పనిసరి పరిస్థితుల్లో భరించానని వెల్లడి
- ధ్రువీకరించిన సినిమా సహ నిర్మాత భార్య
- ఆ ఆరోపణలను తిరస్కరించిన రాజ్‌కుమార్ హిరానీ
- తన పేరుప్రతిష్ఠలను దెబ్బ తీసేందుకేనని వ్యాఖ్య

ముంబై, జనవరి 13: ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఒక సహాయ దర్శకురాలు ఆరోపించారు. గతేడాది విడుదలైన 'సంజు' సినిమా నిర్మాణ సమయంలో ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన హిరానీ.. తనను లైంగికంగా వేధించాడని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆ చిత్ర సహ నిర్మాత విధువినోద్ చోప్రా భార్య అనుపమా చోప్రా కూడా ధ్రువీకరించారు. గతేడాది మార్చి నుంచి సెప్టెంబర్ వరకు ఒకటి కంటే ఎక్కువసార్లు తనపై రాజ్‌కుమార్ లైంగికదాడి చేశాడని ఆరోపిస్తూ హఫ్‌పోస్ట్ ఇండియా పత్రికలో బాధితురాలు ఒక వ్యాసం రాశారు. ఈ విషయమై విధూ వినోద్ చోప్రాకు గతేడాది డిసెంబర్ మూడో తేదీన ఈ-మెయిల్ పంపినట్లు ఆమె పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి కోసం తనకు ఈ ఉద్యోగం అవసరమైందని తెలిపారు. 'ఆయనకు లొంగిపోవడం తప్ప నాకు మరో మార్గం లేకపోయింది. ఆయన చర్యలను సహించలేకపోయినా.. భరించక తప్పలేదు. ఒకవేళ మధ్యలో ఉద్యోగం వదిలివెళితే.. నా గురించి ఆయన చెడుగా ప్రచారం చేస్తే .. నేను మరో ఉద్యోగం వెతుక్కోవడం కష్టమే. నా భవిష్యత్ ఇబ్బందుల్లో పడేది' అని తెలిపారు. సంజు సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పని చేస్తున్నప్పుడు 2018 ఏప్రిల్ తొమ్మిదో తేదీన తొలిసారి తనపై లైంగికపరమైన వ్యాఖ్యలు చేసి.. తర్వాత లైంగిక దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. రాజ్‌కుమార్ హిరానీని తన తండ్రి స్థానంలో చూశానని పేర్కొన్నారు. సదరు మహిళ తమకు ఈ-మెయిల్ చేసిన సంగతిని వినోద్ చోప్రా భార్య అనుపమా చోప్రా ధ్రువీకరించారు. దీనిపై విచారణకు కమిటీని నియమించామన్నారు. దీన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో సదరు మహిళకు తాను సలహా ఇచ్చినట్లు అనుపమా చోప్రా తెలిపారు. సంజు స్క్రిప్ట్ రైటర్ అభిజాత్ జోషి, విధూ వినోద్ సోదరి షెల్లీ చోప్రా కూడా తమకు మెయిల్స్ వచ్చాయన్నారు. 'సదరు మహిళ రాసిన వ్యాసం ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ ప్రతిస్పందించారు. ఈ ఆరోపణలను తిరస్కరించారు. తన పేరు ప్రతిష్ఠలను నాశనం చేసేందుకే హానికరమైన ఆరోపణలకు దిగారని రాజ్‌కుమార్ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో షెల్లీ చోప్రా దర్శకత్వం వహించిన 'ఏక్ లడ్కీ కో దేఖా తోహ్ ఐసా లగా' సినిమాకు సహ నిర్మాతగా రాజ్‌కుమార్ హిరానీని తొలిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై సహ నిర్మాత వినోద్ చోప్రా ఇంకా ప్రతిస్పందించలేదు. ఇంతకుముందు కేంద్ర మాజీ మంత్రి ఎంజే అక్బర్, నానా పటేకర్, వికాస్ బాహ్లా, సాజిద్ ఖాన్ కూడా 'మీ టూ (నేను బాధితురాలినే)' బారిన పడిన వారే కావడం గమనార్హం.



జీనత్ ఉల్ ఇస్లామ్ అంత్యక్రియల్లో తుపాకులు పేలుస్తున్న ఉగ్రవాదులు

అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థ అధిపతి జీనత్ హతం

- మరో ఉగ్రవాది కూడా; కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్
- జీనత్ అంత్యక్రియల్లో ఘర్షణ.. 12 మందికి గాయాలు

శ్రీనగర్/జమ్ము: జమ్ముకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. మృతుల్లో అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థ అధిపతి జీనత్ ఉల్ ఇస్లామ్ ఉన్నాడు. కుల్గాం జిల్లా కట్‌పూరా ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం సాయంత్రం భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. వీరి రాకను గుర్తించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో జీనత్ ఉల్ ఇస్లామ్, షకీల్ అహ్మద్ దార్ హతమయ్యారు.వీరు గతంలో పలు ఉగ్రవాద దాడులకు పాల్పడ్డారని అధికారులు చెప్పారు. 2006లో అరెస్టైన జీనత్ ఉల్ ఇస్లామ్ జైలు నుంచి విడుదలయ్యాక హిజ్‌బుల్ ముజాహిద్దీన్‌లో చేరాడని అధికార వర్గాలు తెలిపాయి. షోపియా జిల్లాలోని సుగాన్ గ్రామంలో జీనత్ ఉల్ ఇస్లామ్ అంత్యక్రియల సందర్భంగా ఉద్రిక్తత నెలకొన్నది. భద్రతా బలగాలకు, స్థానికులకు మధ్య జరిగిన ఘర్షణలో గాయపడ్డ 12 మందిని వెంటనే సమీప దవాఖానకు తరలించారు. మరోవైపు సరిహద్దులోని ఎల్వోసీ వెంట పాకిస్థాన్ కాల్పులకు తెగబడటంతో ఓ జవాన్ గాయపడ్డారు. దీంతో అప్రమత్తమైన భారత బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. గాయపడిన జవాన్‌ను దవాఖానకు తరలించాయి.

సరిహద్దుల్లో వ్యూహాత్మక రోడ్లు

- రూ.21 వేల కోట్ల అంచనాతో చైనా పరిధిలో 44 రోడ్ల నిర్మాణం
- రూ.5,400 కోట్లతో పాకిస్థాన్ పరిధిలో 2,178 కి.మీ. పొడవునా రోడ్ల నిర్మాణం
- భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం కోసం ఎదురుచూపులు



న్యూఢిల్లీ: ఇటు పాకిస్థాన్, అటు చైనాతో సరిహద్దుల వెంబడి 'వ్యూహాత్మకంగా ముఖ్యమైన రోడ్ల'ను కేంద్రం నిర్మించ తలపెట్టింది. చైనా సరిహద్దు పొడవునా 44 వ్యూహాత్మక రోడ్లు.. పాకిస్థాన్‌తో సరిహద్దు గల పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల పరిధిలో 2,179 కి.మీ పొడవునా రోడ్లను నిర్మించాలని నిర్ణయానికి వచ్చింది. ఘర్షణ సమయంలో భారత్- చైనా సరిహద్దు మధ్య త్వరితగతిన సైనిక బలగాలను తరలించేందుకు వీలుగా 44 వ్యూహాత్మక సరిహద్దు రోడ్లను నిర్మించాలని 2018-19 వార్షిక నివేదికలో కేంద్ర ప్రజాపనుల శాఖ (సీపీడబ్ల్యూడీ) పేర్కొంది. భారత్, చైనా మధ్య సరిహద్దుల్లో జమ్ము కశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు సుమారు 4,000 కి.మీ పొడవునా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) కలిగి ఉన్నది. 2017లో చైనా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత డోక్లాం పరిధిలో ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభన నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో ప్రాజెక్టులను నిర్మించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం భావిస్తున్నది. ఈ పరిధిలో జమ్ముకశ్మీర్‌తోపాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ ఉన్నాయి. చైనాతో సరిహద్దుల వెంబడి 44 వ్యూహాత్మక రోడ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఈ మేరకు ప్రజా పనుల మంత్రిత్వశాఖ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ (డీపీఆర్) ప్రస్తుతం ప్రధాని మోదీ సారథ్యంలోని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం కోసం వేచి చూస్తున్నాయి. మరోవైపు పాకిస్థాన్‌తో సరిహద్దు గల పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల పరిధిలో 2,179 కి.మీ. పొడవునా రోడ్ల నిర్మాణానికి రూ. 5,400 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

చైనాలో బొగ్గు గని కూలి 21 మంది దుర్మరణం

బీజింగ్: చైనాలో బొగ్గు గని కూలడంతో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన శనివారం మధ్యాహ్నం షాంగ్జి రాష్ట్రంలో చోటు చేసుకుంది. లిజియాగౌ బొగ్గు గనిలో 87 మంది కార్మికులు పనిచేస్తుండగా గని పై కప్పు కుప్పకూలింది. దీంతో మొదట 19 మృతదేహాలను వెలికితీసిన అధికారులు, ఆదివారం మరో రెండు మృతదేహాలను గుర్తించారు. మిగిలిన 66 మందిని సురక్షితంగా కాపాడారు. ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పీడదినాల్లోనూ జోరుగా 'రియల్' రిజిస్ట్రేషన్లు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల జోరు పీడదినాల్లోనూ విజయవంతంగా కొనసాగుతున్నది. సాధారణంగా జనవరి నెలారంభం నుంచి సంక్రాంతి పండుగ ముగిసేవరకు పీడదినాలుగా పరిగణిస్తారు. ఈ సమయంలో ఇండ్ల కొనుగోలు, ప్లాట్లు, ఫ్లాట్ల క్రయ, విక్రయాలు దాదాపుగా జరుగవు. ఈ సమయంలో రిజిస్ట్రేషన్లు సాధారణస్థాయిలో సగానికి సగం తగ్గిపోతాయి. కానీ, ఈసారి పరిస్థితి భిన్నంగా ఉన్నదని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ చిరంజీవులు తెలిపారు. ఈ నెలలో రోజుకు సగటున ఆరు వేలకుపైగా డాక్యుమెంట్లు రిజిస్టరవుతున్నాయని తెలిపారు. 12రోజుల్లో దాదాపు 85 నుంచి 90 వేల డాక్యుమెంట్లు రిజిస్టరయ్యాయని తెలిపారు.

వర్జిన్ గర్ల్ సీల్డ్ బాటిల్ లాంటిది!

- సీల్ ఊడిన బాటిల్‌ను ఎవరైనా కొంటారా?
- జాధవ్‌పూర్ వర్సిటీ ప్రొఫెసర్ వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 13: కోల్‌కతాలోని జాధవ్‌పూర్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కనక్ సర్కార్ అమ్మాయిలపై ఫేస్‌బుక్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'చాలా మంది అబ్బాయిలు మూర్ఖులు. కన్యత్వం కలిగిన అమ్మాయి భార్యగా వస్తే కలిగే ప్రయోజనాలు వారికి తెలియదు. వర్జిన్ గర్ల్ సీల్డ్ బాటిల్ లాంటిది. సీల్డ్ ఊడిన బాటిల్‌ను ఎవరైనా కొంటారా ? భార్య విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.' అంటూ ఆయన పోస్ట్ చేశారు. జపాన్‌లో 99 శాతం అమ్మాయిలు పెళ్లి ముందు వరకు కన్యగానే ఉంటారని, అందుకే ఆ దేశం అభివృద్ధిలో ముందుందని ఉదహరించారు. ప్రొఫెసర్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో ఆయన తన పోస్టులను డిలీట్ చేశారు.


పాశ్వాన్ క్షమాపణలు చెప్పాల్సిందే

ధర్నాకు దిగిన ఆయన కుమార్తె ఆశ



పాట్నా, జనవరి 13: బీహార్ మాజీ సీఎం రబ్రీదేవిని పరోక్షంగా వేలుముద్ర సీఎం అని తన తండ్రి, కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్ వ్యాఖ్యానించడాన్ని నిరసిస్తూ ఆయన కుమార్తె ఆశా పాశ్వాన్ ఆదివారం ధర్నాకు దిగారు. రబ్రీదేవికి క్షమాపణలు చెప్పాలని, లేకుంటే మీ పార్టీ లోక్‌జన్‌శక్తి కార్యాలయం ముందు ధర్నాకు దిగుతానని ఆమె శనివారం హెచ్చరించినప్పటికీ రాం విలాస్ పాశ్వాన్ స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం పాట్నాలోని ఎల్జేపీ కార్యాలయానికి కిలోమీటరు దూరంలో గర్దానిబాగ్ వద్ద ధర్నాకు దిగారు. ఆమె వెంట ఆర్జేడీ మహిళా కార్యకర్తలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ తన తండ్రి వెంటనే క్షమాపణలు చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచు దుప్పట్లో సిమ్లా



భారీగా హిమపాతం కురుస్తుండడంతో పర్యాటకుల సందడితో సిమ్లా కిటకిట లాడుతున్నది. ఈ సీజన్‌లో జోరుగా మంచు కురుస్తుండడంతో సందర్శకులు పెద్దసంఖ్యలో హిమాచల్‌కు పోటెత్తుతున్నారు. మంచును దోసిట పట్టుకుని మురిసిపోతున్నారు.

ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవి బరిలో

ఇవాంకా, నిక్కీ హేలీ

వచ్చేనెల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్న వరల్డ్ బ్యాంక్





వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్, ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా పనిచేసి ఇటీవల వైదొలిగిన ఇండో-అమెరికన్ నిక్కీ హేలీ పోటీ పడుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ పదవీకాలం ఇంకా మూడేండ్లు ఉన్నప్పటికీ త్వరలో పదవి నుంచి వైదొలగనున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం అమెరికా తన అభ్యర్థిని పోటీలో నిలుపడానికి కసరత్తు ప్రారంభించింది. ఇవాంకా, నిక్కీ హేలీతోపాటు అంతర్జాతీయ వ్యవహారాల ఆర్థిక శాఖ సహాయ మంత్రి డేవిడ్ మల్‌పాస్, ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధిపతి మార్క్ గ్రీన్ కూడా ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. అధ్యక్షుడి ఎంపిక కోసం వచ్చే నెల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని, కొత్త అధ్యక్షుడి ఎంపిక ఏప్రిల్‌లో పూర్తి అయ్యేలా చూస్తామని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

భం భం భోలే బోలేనాథ్



కుంభమేళా సందర్భంగా అలహాబాద్‌లోని త్రివేణి సంగమం వద్ద ఓ నాగా సాధువు రుద్రాక్ష మాలలను దండలుగా, కిరీటంలా ధరించి చూపరుల్ని విశేషంగా ఆకట్టుకున్నాడు.

గంగమ్మ సాక్షిగా.. మీ భద్రత మాది



ఈనెల 15న ప్రారంభంకానున్న కుంభమేళాకు యూపీ ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. సుమారు 15 కోట్ల మంది భక్తులు ఈ ఆధ్యాత్మిక వేడుకకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో అలహాబాద్‌లోని త్రివేణి సంగమం వద్ద గంగా జలాన్ని చేతిలోకి తీసుకుని తమ విధుల్ని నిజాయితీగా నిర్వర్తిస్తామని, భక్తులకు రక్షణ కల్పిస్తామని ప్రమాణం చేస్తున్న పోలీసు బలగాలు

ఆమె స్థానంలో పురుషుడున్నా

అలాగే మాట్లాడేవాడిని

- మహిళల పట్ల మీ వివక్షా దృక్పథాన్ని నాపై రుద్దవద్దు
- నిర్మలా సీతారామన్‌పై వ్యాఖ్యలను సమర్థించుకున్న రాహుల్
- రాఫెల్‌పై మోదీయే సమాధానం చెప్పాలని డిమాండ్



న్యూఢిల్లీ, జనవరి 13: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై విమర్శలు గుప్పిస్తూ మహిళలను కించపరిచేలా రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సమర్థించుకున్నారు. ఆమె స్థానంలో పురుషుడు ఉన్నా ఇదే విధమైన వ్యాఖ్యలు చేసేవాడినని స్పష్టం చేశారు. రాఫెల్ కుంభకోణంపై సీబీఐ చీఫ్ అలోక్ వర్మ దర్యాప్తు చేస్తున్నందునే ప్రధాని మోదీ ఆయనను పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. దుబాయ్‌లో రాహుల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాఫెల్ ఒప్పందంపై పార్లమెంట్‌లో వివరణ ఇవ్వాల్సింది నిర్మలా సీతారామన్ కాదని, ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని అన్నారు. 'పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ రూ.30 వేలకోట్ల ప్రజాధనాన్ని తస్కరించేందుకు మోదీ సహాయపడ్డారు. కనుక దీనిపై లోక్‌సభలో మోదీయే సమాధానమివ్వాలి. కానీ ఆయన అలా చేయకుండా ఈ వ్యవహారంపై సమాధానమిచ్చేందుకు మరో వ్యక్తిని పంపారు. ఆ వ్యక్తి ఓ మహిళ. ఆమె స్థానంలో పురుషుడు ఉన్నా నేను ఇదేవిధమైన వ్యాఖ్యలు చేసేవాడిని. మహిళల పట్ల మీ వివక్షా దృక్పథాన్ని నాపై రుద్దవద్దు. రాఫెల్ ఒప్పందంపై ప్రధాన మంత్రే సమాధానమివ్వాలని విస్పష్టంగా చెప్పా. కానీ ఆయనకు అంత దమ్ము లేదు' అని రాహుల్ పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను పదవి నుంచి తొలగించడం కేంద్ర మంత్రుల్లో చాలా మందికి ఇష్టం లేదని, ఆయను తొలగించాల్సిందిగా సుష్మ, గడ్కరీ, జైట్లీ తదితర మంత్రులెవరూ కోరకపోయినప్పటికీ మోదీ పంతానికి పోయి తప్పించారని ధ్వజమెత్తారు. అలోక్ వర్మను వెంటవెంటనే రెండుసార్లు పదవి నుంచి తొలగించాల్సినంత అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రవేశించకుండా మహిళలపై నిషేధాన్ని సమర్థిస్తున్న సంప్రదాయవాదుల వాదనలోనూ అర్థమున్నదని, సంప్రదాయాలను కాపాడాల్సిందేనని, అయితే ఇదే సమయంలో మహిళలకూ సమాన హక్కులు ఉండాలని రాహుల్ పేర్కొన్నారు. కాగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటిస్తున్న రాహుల్ ఆదివారం షార్జా పరిపాలకుడు సుల్తాన్ బిన్ ముహమ్మద్ అల్ కాసిమీతో భేటీ అయ్యారు.

ఒంటరిగానే బరిలోకి



ఆదివారం లక్నోలో మీడియా సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్, యూపీ పీసీసీ చీఫ్ రాజ్‌బబ్బర్

యూపీలో మొత్తం 80 స్థానాల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటన

- కలిసి వచ్చే పార్టీలతో ముందుకు వెళ్తామని సంకేతాలు
- రాష్ట్రంలో 2009 కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తామని ధీమా
- 13 బహిరంగ సభల్లో పాల్గొననున్న రాహుల్

ముఖ్య నేతలతో భేటీ అనంతరం భవిష్యత్ కార్యాచరణను వెల్లడించిన ఆజాద్

లక్నో/న్యూఢిల్లీ, జనవరి 13: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒంటరిగానే బరిలోకి దిగనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. యూపీలో ఎస్పీ-బీఎస్పీ పొత్తు కుదుర్చుకుని కాంగ్రెస్‌ను పక్కనపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం 80 సీట్లకు పోటీచేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత, యూపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి గులాం నబీ ఆజాద్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. యూపీ కాంగ్రెస్ చీఫ్ రాజ్‌బబ్బర్, ఇతర ముఖ్య నేతలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను చర్చించిన అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. బీజేపీని ఎదుర్కొనేందుకు కలిసి వచ్చే సెక్యులర్ శక్తులతో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తామని చెప్పారు. 'వచ్చే ఎన్నికలకు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం. 2009 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో 21 స్థానాలు సాధించాం. ఇప్పుడు ఒంటరిగా పోటీచేసి అంతకంటే రెట్టింపు స్థానాలు గెలుస్తాం' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకుంటారా? లేదంటే ఇతర పార్టీలతో కలిసి కూటమిని ఏర్పాటు చేసి ఎన్నికల రంగంలోకి దిగుతారా? అని మీడియా ప్రశ్నించగా.. 'యూపీలో బీజేపీని ఓడించేందుకు కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటాం. ఎస్పీ-బీఎస్పీ పొత్తును మేం ఉద్దేశపూర్వకంగా వదులుకోలేదు. మహాకూటమిలో ఉండాలని మేం బలంగా కోరుకున్నాం. కానీ, పొత్తుకు వారే ముగింపు పలికారు. మాతో కలిసి రావాలని ఎవరినీ ఒత్తిడి చేయం. మేం మా సొంత శక్తిని నమ్ముకుని బీజేపీని ఓడించేందుకు శాయశక్తులా కృషిచేస్తాం' అని ఆజాద్ బదులిచ్చారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం జాతీయ స్థాయిలో ఎస్పీ-బీఎస్పీ కూటమి సహా, ఇతర ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకునే అంశాన్ని ఆజాద్ కొట్టిపారేయలేదు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏ పార్టీతోనైనా పొత్తుకు తాము సిద్ధమేనని చెప్పారు. యూపీలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని చెప్పారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 25 స్థానాల్లో పోటీచేస్తే ప్రస్తుతం 80 స్థానాల్లో తాము బరిలోకి దిగుతున్నామని, కాబట్టి అందరికి అవకాశాలు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ యూపీలో 13 బహిరంగ సభల్లో పాల్గొననున్నట్లు ఆజాద్ వెల్లడించారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పోటీచేసే స్థానాల్లో కాంగ్రెస్ తన అభ్యర్థుల్ని ప్రకటిస్తుందా? అని మీడియా ప్రశ్నించగా.. ఆజాద్ ఎలాంటి సమాధానం చెప్పలేదు. సోనియాగాంధీ, రాహుల్ పోటీచేసే స్థానాల్లో తమ అభ్యర్థుల్ని నిలబెట్టబోమని ఎస్పీ-బీఎస్పీ కూటమి ప్రకటించిన సంగతి తెలిసిందే. అనంతరం ప్రధాని మోదీపై ఆజాద్ విమర్శలు ఎక్కుపెట్టారు. దేశ ప్రయోజనాల కంటే తన కుర్చీని కాపాడుకునేందుకే మోదీ ఎక్కువ పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో రాఫెల్ సహా భారీ కుంభకోణాలు బీజేపీ హయాంలోనే జరిగాయని ఆరోపించారు. మరోవైపు ఎస్పీ-బీఎస్పీ కూటమి నుంచి కాంగ్రెస్‌ను తప్పించడం సరికాదని ఆర్జేడీ ఉపాధ్యక్షుడు రఘువంశ్‌ప్రసాద్ సింగ్ అన్నారు. జాతీయ స్థాయిలో భవిష్య పొత్తులకు ఇది సరైన సంకేతం కాదన్నారు. ఇప్పటికైనా ఎస్పీ-బీఎస్పీ కూటమి తన తప్పిదాన్ని సరిచేసుకుని కాంగ్రెస్‌ను కూటమిలోకి తీసుకోవాలని కోరారు.

ఎస్పీ-బీఎస్పీ కూటమిని చూస్తే బీజేపీకి భయం : అఖిలేష్



ఎస్పీ-బీఎస్పీని దుష్ట కూటమి అంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శల్ని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తిప్పికొట్టారు. కూటమిని చూసి బీజేపీ నేతలు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ఏర్పాటు అనంతరం బీజేపీ అధిష్ఠానం గతంలో ఎన్నడూలేనంత అసంతృప్తితో కనిపిస్తున్నదని విమర్శించారు. తమ కూటమిని చూసి అధికారంపై బీజేపీ నేతలు ఆశలు వదిలేసుకున్నారని అన్నారు. ప్రధాని మోదీ నినాదమైన 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ (నా పోలింగ్ బూత్ శ్రేష్ఠమైనది)' కాస్తా.. 'మేరా బూత్ హువా చక్నాచూర్ (నా పోలింగ్ బూత్ నాశనమైంది)' అని బీజేపీ కార్యకర్తలే స్వయంగా చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్న బీజేపీ నేతలు ఎస్పీ-బీఎస్పీ కూటమిలో చేరేందుకు అవిశ్రాంతంగా క్యూ కడుతున్నారని చెప్పారు.

వారణాసిలో కేజ్రీవాల్ పోటీ చేయడంలేదు: ఆప్



వచ్చే ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ఆప్ అధ్యక్షుడు, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేయడం లేదని ఆ పార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ ప్రకటించారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గోవా, తూర్పు-పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లలో తమ పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక, ప్రచార బాధ్యతల నేపథ్యంలో కేజ్రీవాల్ వారణాసి నుంచి బరిలోకి దిగడం లేదని పేర్కొన్నారు. ఈ స్థానంలో ఆప్ నేత ఒకరు పోటీచేస్తారని తెలిపారు.

విపక్షాలది అవకాశవాద కూటమి

- సొంత సామ్రాజ్యం నిర్మాణమే వాటి లక్ష్యం
- జాతి ప్రగతి, ప్రజలకు సాధికారత కల్పనే మా ధ్యేయం
- తమిళనాడులోని ఐదు లోక్‌సభా స్థానాల పరిధిలో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో ప్రధాని మోదీ



గురు గోవింద్‌సింగ్ స్మారకార్థం వెండి నాణాలను ఆవిష్కరిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ. చిత్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

చెన్నై/ న్యూఢిల్లీ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అధికార బీజేపీకి వ్యతిరేకంగా మహా కూటమి ఏర్పాటు కోసం విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలన్నీ అవకాశవాదానికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అపహాస్యం చేశారు. వారసత్వ పార్టీలు తమ సొంత సామ్రాజ్య నిర్మాణం కోరుకుంటున్నాయన్నారు. కానీ తాము ప్రజలకు సాధికారత కల్పించాలని కోరుకుంటున్నామని మోదీ తెలిపారు. తమిళనాడులోని ఐదు లోక్‌సభ స్థానాల పరిధిలోని బూత్‌స్థాయి బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ఆదివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'ఇతర పార్టీల మాదిరిగా మేం విభజించి-పాలించు, ఓటుబ్యాంకులను నిర్మించుకోవడం కోసం రాజకీయాలు చేయడం లేదు. జాతికి సేవ చేయడానికే మేం అధికారంలో ఉన్నాం. ఒకవైపు దేశాభివృద్ధి ఎజెండా ఉంది. మరోవైపు అవకాశవాద కూటమి, వారసత్వ పార్టీలు ఉన్నాయి. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్ కింద మా వద్ద అభివృద్ధి ఎజెండా ఉంది' అని మోదీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో కూటమిగా పోటీ చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రకటించిన మరుసటి రోజే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వచ్చే ఎన్నికల్లో మరోసారి విజయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 'బీజేపీ కష్టపడే తత్వం కలది. కోట్ల రూపాయల నిధులు లేవు. ఉన్నత వర్గంలో జన్మించిన వారు, ఒక కుటుంబానికి విధేయులు లేరు. ఇద్దరు ఎంపీలతో ప్రస్థానం ప్రారంభించిన బీజేపీ అత్యధిక రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ అధికారం చేపట్టే స్థాయికి చేరుకున్నందుకు మేం గర్విస్తున్నాం. విపక్షాల దుష్ప్రచారం వల్లే కొంతమంది ప్రజల్లో సహజంగానే ఆగ్రహం పెల్లుబుకుతున్నది' అని తెలిపారు. 'మోదీ మంచి వాడు కాదని, ప్రభుత్వం పని చేయడం లేదని, బీజేపీని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పేందుకు ఏ ఒక్క అవకాశాన్ని వారు (విపక్షాలు) వదులుకోవడం లేదు' అని మోదీ ఆరోపించారు. ఒకవేళ మోదీ మంచి వాడు కాకుంటే వారెందుకు తమ పార్టీకి వ్యతిరేకంగా కూటములు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. 'తొలి దఫా ఓటర్లకు బీజేపీ మాత్రమే సహజమైన చాయిస్' అని మోదీ అన్నారు.

భారత్‌లోకి కర్తార్‌పూర్‌ను తేవడంలో కాంగ్రెస్ అశక్తత

దేశ విభజన సమయంలో కర్తార్‌పూర్ సాహిబ్‌ను భారత్‌లోకి తీసుకురావడంలో పాత కాంగ్రెస్ ప్రభుత్వం అశక్తత ప్రదర్శించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆదివారం మోదీ తన అధికార నివాసంలో గురు గోవింద్‌సింగ్ 350వ జయంతిని పురస్కరించుకుని ఆయన స్మారకార్థం 350 వెండి నాణాలను విడుదల చేశారు. '1947 ఆగస్టులో ఒక పొరపాటు జరిగింది. దానికి ప్రాయశ్చితంగానే ఇది (కారిడార్) నిర్మిస్తున్నాం. మన గురువు ముఖ్యమైన స్థలం కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉంది. కానీ అప్పటి పాలకులు (దేశ విభజన సమయంలో) దాన్ని భారత్‌లో అంతర్భాగం చేయలేకపోయారు. దీనివల్ల జరిగే నష్టాన్ని పూడ్చేందుకే కారిడార్ నిర్మాణం చేపట్టాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ దారుణ హత్య తర్వాత 1984లో దాడులకు కాంగ్రెస్ పార్టీ కారణమని మండిపడ్డారు. ఈ క్రమంలోనే 1984 సిక్కు వ్యతిరేక దాడుల్లో బాధితులకు న్యాయం చేకూర్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. మోదీ మాట్లాడుతున్నప్పుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ తదితరులు ఆయన పక్కనే ఉన్నారు.

పాక్ వలపు వల!

మొదటిపేజీ తరువాయి...

దించారని గుర్తించారు. సైనిక రహస్యాల్ని చేరవేసిన సిపాయి సోమ్‌వీర్‌సింగ్‌ను శనివారం రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు.

సంప్రదాయ కట్టుతో ఆకట్టుకొని..

తన పేరు అనికా చోప్రా అని, సైన్యంలోని నర్సింగ్ కార్ప్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నానంటూ ఓ మహిళ పేరుతో 2016 లో హర్యానాకు చెందిన సిపాయి సోమ్‌వీర్‌సింగ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్ స్థావరంలో సిపాయిగా సోమ్‌వీర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. సంప్రదాయ చీర కట్టులో, నవ్వులు రువ్వుతున్న అనికా చోప్రా ఫొటోను చూసి సోమ్‌వీర్ ఫిదా అయిపోయాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య ఫేస్‌బుక్ సాక్షిగా స్నేహం మొగ్గ తొడిగింది. తొలుత కుశల ప్రశ్నలు, ముచ్చట్లతో మొదలై నెమ్మదిగా ఈ వ్యవహారం శృంగారపరమైన చర్చల వరకు వెళ్లింది. ఇక ఇక్కడి నుంచి అనికా చోప్రా క్రమంగా తన ప్లాన్‌ను ఆచరణలో పెట్టింది. ప్రస్తుతం మీరు ఎక్కడ పనిచేస్తున్నారు? మీ ఆర్మీ యూనిట్‌కు సంబంధించిన మ్యాప్, వాహనాలు, ఆయుధాలకు సంబంధించిన చిత్రాలు ఉంటే పంపించు.. మీ యుద్ధ ట్యాంకులకు సంబంధించిన ఫొటోలు ఉంటే పంపిస్తావా? ఫీల్డ్ ఫైరింగ్‌ను ఎప్పుడు నిర్వహిస్తారు? సైనిక విన్యాసాల చిత్రాలు పంపించు.. అంటూ సోమ్‌వీర్‌కు వరుసగా సందేశాలు పంపింది. అప్పటికే పూర్తిగా అనికా చోప్రా ఆధీనంలోకి వెళ్లిపోయిన సోమ్‌వీర్ ఆర్మీ రహస్యాల్ని ఒక్కొక్కటిగా చేరవేశాడు. ఇతర స్థావరాల వివరాలు, ఫొటోలు కావాలని కూడా ఆమె అడిగింది. అలాగే భార్యను వదిలిపెట్టి తనను పెండ్లి చేసుకోవాలంటూ సోమ్‌వీర్‌పై ఒత్తిడి పెంచింది. పలు సందర్భాల్లో అతడిని బెదిరించే ప్రయత్నం చేసింది. కొంతకాలంగా సోమ్‌వీర్ ప్రవర్తన తేడాగా ఉండడం, ఎక్కువ సేపు సోషల్‌మీడియాలో చాటింగ్ చేస్తుండడంతో అనుమానం వచ్చిన తోటి జవాన్లు పై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిఘా వర్గాలు, రాజస్థాన్‌కు చెందిన ఉగ్రవాద వ్యతిరేక దళం సోమ్‌వీర్‌పై ఐదు నెలలుగా నిఘా పెట్టింది. అతడి ఫేస్‌బుక్ ఖాతాలను పరిశీలించి నిర్ఘాంతపోయింది. అనికా చోప్రా పేరుతో ఆర్మీలో ఏ అధికారిణి లేరని, ఇది పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ పని అని తేలింది. పాక్‌లోని కరాచీ నుంచి ఐఎస్ఐ ఈ రాకెట్‌ను ఆపరేట్ చేసిందని గుర్తించారు. ఆర్మీ రహస్యాల్ని చేరవేసినందుకు ఐఎస్ఐ సోమ్‌వీర్‌కు రూ.5వేలు అందజేసిందని, కానీ, ఆ నగదును ఎవరికీ అనుమానం రాకుండా సోమ్‌వీర్ తన సోదరుడి ఖాతాలో వేయించినట్లు తేలింది. అనంతరం నిఘావర్గాలు, ఏటీఎస్ పోలీసులు సోమ్‌వీర్‌ను అరెస్టు చేశారు. అయితే, తాను ఆర్మీకి సంబంధించిన ఎలాంటి సమాచారం అందజేయలేదని సోమ్‌వీర్ వాపోయాడు. మరోవైపు మరో 50 మంది జవాన్లకు కూడా ఐఎస్ఐ అనికా చోప్రా పేరుతో వల వేసిందని తేలడంతో ఆర్మీ నిర్ఘాంతపోయింది. అనికా చోప్రా పంపిన సందేశాలు, ఫొటోలకు 50 మంది జవాన్లు లైక్ చేసినట్లు, కొందరు కామెంట్లు చేసినట్లు గుర్తించారు. వీరిని కూడాత్వరలో ప్రశ్నించనున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. శనివారం సోమ్‌వీర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జనవరి 18 వరకు అతడికి కస్టడీ విధించినట్లు పోలీసులు చెప్పారు. మరోవైపు హనీ ట్రాపింగ్ వివాదం నేపథ్యంలో బలగాలకు సైన్యం గట్టి హెచ్చరికలు చేసింది. సోషల్ మీడియాలో తమ ర్యాంకు, పనిచేస్తున్న ప్రదేశం, తమ గుర్తింపునకు సంబంధించిన చిత్రాలను, సమాచారాన్ని సైనికులు, అధికారులు ఎవరూ పోస్టు చేయరాదని ఆదేశించింది.

శివసేనను ఓడించేవారు ఇంకా పుట్టలేదు

పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్య



ముంబై, జనవరి 13: శివసేనను ఓడించేవారు ఇంకా పుట్టలేదని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పొత్తు సాకారమైతే భాగస్వామ్య పక్షాల విజయంలో భాగమైతామని, లేకపోతే చిత్తుగా ఓడిస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఠాక్రే పై విధంగా స్పందించారు. హనుమంతుడి కులంపై వ్యాఖ్యలు చేస్తున్న వారిపైనా ఠాక్రే తీవ్రంగా మండిపడ్డారు. మరో మతంలో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరైనా చేస్తే, ప్రజలు అతడి పళ్లు పీకేసి ఉండేవారని చెప్పారు. ముంబైలోని వర్లీ ప్రాంతంలో ఆదివారం ఓ బహిరంగ సభలో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు మూడో పానిపట్ యుద్ధంలాంటివని షా వ్యాఖ్యానించడంపైనా ఆయన స్పందించారు. ప్రజలు మీపై విశ్వాసం కోల్పోతే ఏ యుద్ధంలోనైనా ఓటమి తప్పదు అంటూ స్పష్టం చేశారు. రామ మందిరాన్ని వ్యతిరేకిస్తున్న నితీశ్‌కుమార్(జేడీయూ), రాంవిలాస్ పాశ్వాన్(ఎల్‌జేపీ)లతో పొత్తు పెట్టుకుని బీజేపీ ఏ విధంగా రామ మందిరం నిర్మిస్తుందో చెప్పాలని ఠాక్రే నిలదీశారు.

ఎస్పీ, బీఎస్పీలను తుడిచిపెట్టేస్తాం

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



లక్నో, జనవరి 13: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఏర్పాటైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)- బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూటమి ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ఏమాత్రం ఉండదని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఆ పార్టీలను బీజేపీ తుడిచిపెట్టేస్తుందని ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ చెప్పారు. ఎస్పీ-బీఎస్పీ కూటమి అంటేనే కుల మనస్తత్వం, అరాచక శక్తులని చెబుతారన్నారు. ప్రధాని అభ్యర్థి ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవా, బీఎస్పీ అధినేత్రి మాయావతినా అన్న అంశంపై ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ వివరణ ఇవ్వాలన్నారు. నాయకుడు లేని కూటమిని ప్రజలు తిరస్కరిస్తారని వ్యాఖ్యానించారు. ఆ పార్టీలు రెండూ వేర్వేరుగా ఉండటానికి బదులు ఎందుకు విలీనం కాకూడదని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిధిలోనే రామ మందిర నిర్మాణం అంశం ఆధారపడి ఉన్నదని, ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నదన్నారు.

జమ్ములో మరో 'కథువా'

- పశువులు మేపే బాలిక అపహరణ.. ఆపై దుండగుల లైంగికదాడి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

జమ్ము, జనవరి 13: దేశాన్ని కుదిపేసిన 'కథువా' అత్యాచార ఘటనను మరువక ముందే జమ్ముకశ్మీర్‌లో బకర్వాల్ తెగకు చెందిన మరో మైనర్ బాలికపై లైంగికదాడి జరిగింది. భయంతో మొదట ఈ దారుణాన్ని దాచిపెట్టిన ఆ బాలిక.. తాను మూడు నెలల గర్భవతి అని తెలియడంతో విషయం తల్లిదండ్రులకు వెల్లడించింది. బాలిక ప్రాణాలకు ప్రమాదమున్న నేపథ్యంలో వైద్యులు ఆ చిన్నారికి అబార్షన్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో రామ్‌షూ ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. లైంగికదాడి ఘటనపై రామ్‌షూలో నిరసనలు వెల్లువెత్తాయి. పోలీసులు దర్యాప్తులో జాప్యం చేస్తున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. జమ్ము నుంచి ముస్లింలను తరిమివేయడంలో ఇది మరో ప్రయత్నమని మండిపడుతున్నారు. బాలిక పశువులను మేపుతుండగా, నాలుగైదుగురు ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్లారని బాధితురాలి తండ్రి చెప్పారు. వేడుకున్నా విడిచిపెట్టలేదని, దారుణంగా కొట్టి నిందితుల్లో ఒకడు తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని, అనంతరం తాను స్పృహ కోల్పోయినట్లు బాలిక చెప్పిందని ఆమె తండ్రి తెలిపారు.



విషయం బయటకు చెబితే చంపేస్తామని నిందితులు బెదిరించినట్లు తెలిపిందన్నారు. తాను గర్భవతిని అని తెలియడంతో బాలిక నిందితుల్లో ఒకరిని సంప్రదించిందని, అతడు ఆమెకు మందులు తెచ్చిచ్చినట్లు బాలిక బంధువు ఒకరు తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు జనవరి 4న ఎఫ్ఐఆర్ నమోదు చేశామని రాంబన్ ఎస్పీ అనితా శర్మ తెలిపారు. నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. బాలికపై లైంగికదాడి జరిగిందని, అయితే అది సామూహిక లైంగికదాడా అనేది చెప్పలేమని, బాలిక తల్లి కూడా ఒకరినే నిందితుడిగా పేర్కొందని చెప్పారు. ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గతేడాది జరిగిన కథువా హత్యాచార ఘటనను మరువక ముందే మరో ఘటన జరగడంతో బకర్వాల్ తెగ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 'మేము ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలనుకుంటున్నాం. వారు దీన్ని నరకంగా మార్చారు. వారు మమ్మల్ని చంపేసి ఉన్నా బాగేండేది. మా కూతురిపై ఎందుకు ఇంతటి దారుణానికి పాల్పడ్డారు?' అని బాధితురాలి తండ్రి వాపోయారు. లైంగికదాడి ఘటనపై జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ విచారం వ్యక్తం చేశారు. ఇక నిందితులను కాపాడేందుకు నాయకులు బయటకు వస్తారంటూ మండిపడ్డారు. దారుణానికి బదులు బాధితురాలి కులం, మతంపై ప్రశ్నలు లేవనెత్తుతారన్నారు.

లైంగికదాడి బాధితురాలితో

విషం తాగించారు

ఢిల్లీలో దారుణం




న్యూఢిల్లీ, జనవరి 13: ఢిల్లీలో దారుణం చోటుచేసుకుంది. నిందితుడికి వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్తే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరిస్తూ లైంగికదాడి బాధితురాలితో ఇద్దరు దుండగులు బలవంతంగా విషం తాగించారు. బాధితురాలు ట్యూషన్ నుంచి ఇంటికి వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పొద్దని బెదిరించారు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో బలవంతంగా విషం తాగించి అక్కడి నుంచి పరారయ్యారు. బాలిక వెంటనే ఆటోలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ దవాఖానకు వెళ్లింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాలికపై అత్యాచార కేసులో నిందితుడు ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఘటనలో అతడి ప్రమేయంపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో నక్సల్ కాల్చివేత

ఎస్పీ అమర్‌జిత్‌ను హత్య చేసిన ఘటనలో అతడు ప్రధాన నిందితుడు

దుమ్కా(జార్ఖండ్), జనవరి 13: జార్ఖండ్‌లోని పకూర్ జిల్లా ఎస్పీ అమర్‌జిత్ బలిహార్‌ను హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడైన నక్సలైట్ షాడియో రాయ్ అలియాస్ తలాడాను పోలీసులు ఆదివారం కాల్చిచంపారు. దుమ్కా జిల్లాలోని ఛతుపరా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న జిల్లా పోలీసులు.. సశస్త్ర సీమా బల్ బలగాలతో కలిసి శనివారం రాత్రి గాలింపు ప్రారంభించారు. వీరి రాకను గుర్తించిన నక్సలైట్లు ఆదివారం ఉదయం కాల్పులకు తెగబడటంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో నక్సలైట్ తలాడా మరణించాడు. అతని తలపై రూ. 10లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ఈ భూగోళాన్ని మోస్తున్నది అట్లాస్ కాదు, మహిళ.
ఒక్కోసారి ఆమె దానిని బంతిలాగ ఆడుకుంటుంది.

హెన్రిక్ సైయెన్‌కీవిక్జ్

నిర్మాత ఎవ్వరో..?

నా బాధ ఎవళ్లతో చెప్పుకోవాలి
వినగల్గిన వాళ్లుంటే వినండి
మొదటి నుంచీ నామీద
పరాయి వారిదే హుకూమత్
నా పిల్లలు దక్కనీలు కాగా..
అరేబియా నుంచో, ఇరాన్ నుంచో
పొట్టచేత పట్టుకొని వచ్చిన
అఫాకీలూ, సఫావీలు నన్ను
కొల్లగొట్టి, నా పిల్లలపై
నిరంకుశాధికారం చెలాయించినారు

దేవ సభకు సరితూగే
నమూనా–ఎ–దర్బార్ ఇలాహీలలో
పేదలకే కాదు, మనుషులకే
అసలైన మనుషులకే దూరమైన
సుల్తాన్‌లు, రాజ్యమేలినారు
మస్నద్‌లు, రత్న కంబళాలు
పరచినారని మురవనా.., లేక
అపాషీ చెప్పులతో
వాటిపై నయగారంగా నడిచారని
గర్విస్తూ, పరవశించి పోనా..
లేక తిండిలేక బట్టలేక
గూడులేక నన్ను నిర్మించిన
స్వేదజీవి బక్క చిక్కి
చచ్చినాడని వగవనా..?

నన్నెవ్వడు కట్టించితేనేమి?
కూలీలయిన నేమి? కుతుబ్‌షా
అయిన నేమి? అబద్ధాలలోంచి
అసలు నిర్మాత ఎవరో పరిశోధించండి
నా బాధకు కారణం నా రాతల్లో
జాగ్రత్తగా వెదకి పట్టుకోండి..

దాద్‌మహలూ, అమన్ మహలూ
గోలకొండలో న్యాయం చేసినవా?
దారుల్ జఫర్, దారుల్ జిహాద్
ఎవనివిజయానికి గుర్తులు బాబూ?
జమాలూ బాజుబందులైతేనేమి
కూర్పాసమూ, రత్నఖచిత భుజకీర్తులైతేనేమి
సుల్తానైనా, షాహన్‌షాహ్ అయినా
రాజయినా, చక్రవర్తి అయినా
బాబూ, నన్నుద్ధరించిందేమీ లేదు
తరఫ్‌దార్, మీర్ జుమ్లీ
ఐనుల్ ముల్క్, అమిల్
మజుందార్– అందరూ
సుల్తాన్‌లో, మహారాజులో
సర్ ఖెయిల్‌లే, (అంగరక్షకులే)
నన్నుద్ధరించిన వాడు ఒక్కడంటే
ఒక్కడైనా లేడు.

షా మంజిళ్లతో, ఆ జన్మ ఖైదీల
జననాలతో, భూగర్భ మురికి కాల్వలతో
కాదు, నే నేర్పడేది
ఇప్పుడు,అప్పుడు నేననాథనే!

భాగ్యనగరమైన నా కడుపులో
ఏమున్నదని, ఏ జీవం ఉన్నదని
పిచ్చి ప్రజలారా! నాలోకి వస్తున్నరు?
రాకండి–నిజం– ఉన్న చోటన్నే ఉండండి
మీ చెరువులు నిండుతున్నవి
మీ ఇళ్లల్లోకే నల్లాలొస్తున్నవి
కోటి ఎకరాల మాగాణంలో
ధాన్య స్వర్ణం పండించుకోండి
కల ఫలించి తీరుతుంది.
హైదరా'బాధ' పోతుందని
నిజంగా నమ్మండి–
ఎప్పుడూ, ఎవరో ఒకరి చేత దోచబడిన
దీన నగరాన్ని నేను–నా మాట నమ్మండి
వృత్తులు వదలి చెడిపోకండి
నాలుగు సౌధాలు, రాజ వీధులు
ఇవే నేనని నమ్మించిన వారివేళ
నన్ను తానే నిర్మించానని ప్రగల్భాలు
పలుకుతున్నాడు!

తెలంగాణ మంతా మీ
సర్ఫేఖాస్ అయినప్పుడే ఈ
హైదరాబాద్ నిర్మాణమయినట్లు
నా బాధ తీరినట్లు.. నమ్మండి...

– ముదిగొండ వీరభద్రయ్య, 9246276573

ఒక దీర్ఘ 'తపస్సు'లోంచి..

'Lack of good translations is one of the reasons for low visibility of Indian literature in general and Telugu in particular'

– కె.పురుషోత్తం


దేశంలోని బెంగాలి, మళయాలం, తమిళం, కన్నడ భాషల సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదమైనంతగా తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం కావడం లేదు. ఇదే సమయంలో ఇతర భాషల సాహిత్యం విరివిగా తెలుగులోకి అనువాదమవుతున్నది. అనువాద విషయంలో ఆదానం, ప్రదానం రెండూ ముఖ్యమైనవే. కేవలం ఆదానమే ఎక్కువగా జరుగుతుండటం వలన తెలుగు ప్రజల సాహిత్య విశాలత్వం, సంస్కృతి ఇతర భాషల ప్రజలకు చేరవలసినంత చేరడం లేదు. దీని వల్ల అసలు సాహిత్యమే అంతంత మాత్రమనే తప్పుడు సంకేతాలు వెళ్తుంటాయి. అయితే దీన్ని బద్దలు కొడుతూ అప్పుడప్పుడు మైలు రాళ్ల లాంటి కొన్ని తెలుగు గ్రంథాలు, కావ్యాలు ఇతర భాషల్లోకి అనువాదం కావడం చూస్తూనే ఉన్నాం. అయితే ఒకే పుస్తకంలో ఒక వైపు తెలుగు మరో వైపు దాని ఇంగ్లీష్ అనువాదం అంటే ద్విభాషా కవిత్వం వేయడం కూడా ఒక కొంత పుంత. అలా వచ్చినవి కూడా తెలుగుతో తక్కువే. ఇటీవల డాక్టర్ రాధేయ రాసిన 'మగ్గం బతుకు' తరువాత తాజాగా ప్రొఫెసర్ రామా చంద్రమౌళి రాసిన **'తపస్సు'** కవిత్వం కనిపిస్తాయి. ఔను! కవిత్వమంటే ఒక జీవిత తపస్సు. ఒక దీర్ఘ ధ్యానం. ఒక ఏక్‌తార రసనాదం. దాని అంచులు తాకాలంటే మనమూ 'తపస్సు'లో మునగాల్సిందే. ఈ 'తపస్సు' మనిషి జీవిత సంక్షోభాన్ని లోతుల నుంచి కుప్పలు కుప్పలుగా తవ్విపోస్తుంది. వ్యష్టి స్వార్థమే కేంద్రమై రోత పుట్టించే సామాజిక చర్యలు మన చుట్టూ విస్తృతమవుతున్న తరుణంలో ఈ 'తపస్సు' మన దళసరి శరీరాలపై ఒక చర్నాకోల దెబ్బ.

'ప్రత్యక్ష విదేశీ పెట్టుబడిదారుల్లారా.. బాజాప్తా చొరబాటుదారుల్లారా
సుస్వాగతం మా ఎదపై పరిచిన ఎర్ర తివాచీ పైకి
రక్షణ రంగమైనా.. ఔషధ రంగమైనా.. ఆహార రంగమైనా
మా అత్యంత వ్యక్తిగత రహస్య రతిరంగమైనా
మీ నిరభ్యంతర ప్రవేశానికి సాదర స్వాగతం
రండి మీ సౌఖ్యాల కోసం, మా సుఖాల కోసం
మీ క్షణిక 'లగ్జరీ'ల కోసం ఈ దేశాన్ని
మా అస్తిత్వాన్నీ, మా ఉనికినీ, మా ఆత్మగౌరవాన్నీ
మీ పాదాల ముందు తాకట్టుపెట్టి
రాజ్యాంగ సాక్షిగా బానిసత్వాన్ని స్వీకరిస్తాం..'

ప్రపంచీకరణ ఇనుప పాదం మన జీవితాల్లోకి ఎప్పుడైతే అడుగు పెట్టిందో అప్పటి నుంచి దేశ ప్రజల వీపులన్నీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఎర్ర తివాచీలుగానే మారిపోయాయి. అందుకే ఇప్పుడేదీ రహస్యం కాదు. వాడు మెల్లమెల్లగా మన జీవితాల్లోని అన్ని అరలకూ వచ్చి కూర్చున్నాడు. ఇన్నాళ్లూ విదేశీ వస్తువులను, పెట్టుబడులను బొంత పురుగులుగా చూసిన మనం ఇప్పుడవి సీతాకోకచిలుకలుగా మారి మన దేహాల మీద ఎగురుతూ మన వీపుల మీద వాతలు పెడుతుంటే మనం హావ్స్ అండ్ హావ్ నాట్స్‌గా మారి ఒక కుట్రబాజితనంతో వర్గీకరింపబడ్డాం. ఇక ఇప్పుడంతా 'మాతా భిక్షాందేహీ' అని చిప్పలు పట్టుకునుడే. అందుకే గత కొన్ని దశాబ్దాల కాలంగా జీవితమంటే వ్యాపారం, వ్యాపారమంటే జీవితంగా మారిపోయింది.

'నిజానికి బతకాలన్న ఆశే ఒక ఆయుధం
అంతిమంగా మరణాన్ని జయిస్తూ బ్రతకడమే విజయం
బ్రతుకును అర్థవంతంగా నిర్మించుకుంటున్న క్రమంలో
నువ్వు పదే పదే కూలిపోతావు.. శిథిలమవుతావు... పతనమవుతావు
రక్తాలోడ్తున్న పాదాలతో కత్తుల వంతెనపై పరుగెత్తీ పరుగెత్తీ
ఒక ఒంటరి దు:ఖ సముద్రంలో నిట్టనిలువుగా నిలబడ్తావు..'

అందుకే జీవితం 'తపస్సు' అనేది. ఇక్కడ ఆకాశంలో మాదిరిగానే ఎక్కడా దారులుండవు. మనమే కొత్తదారులు వేసుకుంటూ వెళ్లాలి. ఒకరు నడిచిపోయిన దారిలోనే మన జీవితం నడవదు. ఇప్పుడు మనం ఒక కొత్తదారిని నిర్మించుకోవాలి. కృషి అంటే పాతాళగరిగె. సముద్రాంతర గుప్తలోకాలను గాలించాలి. అయినా జీవితం చిక్కినట్టే చిక్కి చేజారిపోతుంటుంది. వేయిసార్లు ఓడిపోతే ఒక్క విజయం వశమవుతుంది. ఇంతా చేసి జీవితం రాలి తీరవలసిన శిశిర పత్రమే. 'చివరికి నీ ఆనవాలు ఇక్కడ ఏమి మిగులుస్తున్నావన్నదే ప్రధాన ప్రశ్న. నీ చిటికెన వేలును ఎవరో పట్టుకున్నప్పుడే తెలుస్తుంది. నీ చేయి విలువ. నీ వేలు విలువ. నీ నడక విలువ..'



'తపస్సు' నుంచి బయటకు వచ్చిన తరువాత మానవ సంబంధాలు ఎంత ఛిద్రమవుతున్నాయో, మనుషులు ఎంత విచ్ఛిన్న దశకు చేరుకున్నారో, మానవ విలువలు ఎంత భగ్నమైపోయాయో అవగతమై హృదయమంతా ఒక మధ్యాహ్నపు ఎండను తాగినంత కఠినమైన అనుభూతి మిగులుతుంది.

'సుప్రీం కోర్టు అతని నెత్తిపై చెత్తను
కుమ్మరిస్తూనే ఉంటుంది
అయినా చెత్తను గుర్తించరు
'మన్ కీ బాత్'లో రోడ్లను ఊడ్వ డం.. చీపుర్లను కొనడం గురించి
దేశ ప్రజలు చెవులు రిక్కించి 'స్వచ్ఛ భారత్' ప్రసంగం వింటారు
'మానవ చెత్త'ను ఊడ్చేయగల 'చీపుళ్ల' గురించి 'ఆం ఆద్మీ' చెప్పడు
అయిదు వందల రూపాయల అప్పు కట్టని
రహీం పండ్ల బండిని జప్తు చేసే బ్యాంక్ మగాళ్లు
సినిమా హీరోలకూ, మాల్యాలకూ, నీరవ్ మోడీలకు
దొంగ పారిశ్రామిక వేత్తలకు వాళ్ల ఇండ్లకే వెళ్లి
వేల కోట్లు అప్పిచ్చి.. లబోదిబోమని ఎందుకు
'రుడాలి' ఏడ్పులేడుస్తారో తెలియదు
చాలా వరకు చెత్త కోట్ల రూపాయల కరెన్సీ రూపంలో
రెపరెపలాడ్తూంటుంది లాకర్లలో..'

చెత్త పదార్థ రూపంలోనే కాదు మనుషుల రూపంలో కూడా ఉంటుందని ఈ కవి దృష్టికోణం. చెత్త ఎప్పుడూ చెడు వాసనే వేయదు. అప్పుడప్పుడూ డియోటరెంట్ వాసనల్తో మన పక్కనే మనుషుల రూపంలో తిరుగుతూ ఉంటుందంటాడు కవి. ప్రశ్నించాల్సిన ప్రజలు 24×7 తలలు వంచుకొని వాట్సప్‌ల్లో, ఫేస్‌బుక్‌ల్లో బిజీగా ఉన్నారు. ఇదీ ఇప్పుడు దేశం నిండా నిండుకున్న చెత్త యవ్వారం.

ఈ 'తపస్సు' నిండా ఎంతో తాత్వికత నిండి ఉంది. జీవితం.. పాకురు మెట్ల దిగుడు బావి అయిన సన్నివేశంలో జీవితం మరింత దుర్భరంగా మారిపోతుంది. ప్రతి క్షణం చస్తూ, పుడుతూ ఏవో ఇరుకు దారుల గుండా ప్రయాణించాల్సే వస్తున్నది. మొండిగా అడుగు వేస్తామా ఏవో గాజు ముక్కలు కాలికి గుచ్చి జీవితం సాంతం రక్తాలోడుతున్న ఒంటరి పయనమవుతుంది.

మూల భాషలో ఉన్న విషయాన్ని ఉన్నదున్నట్టు లక్ష్య భాషలోకి తీసుకుపోవడం అంత సులభం కాదు. దీనికి రెండు భాషల వినియోగపు మర్యాదలు తెల్సి ఉండాలి. అంతేగాక మూల రచయిత భావాన్ని సరిగ్గా పట్టుకోగలగాలి. లేదంటే అనువాదమంతా పెచ్చులు ఊడిపోయిన సౌధంలా కనిపించి దాని వికారం మనసును తాకి వాక్యాన్ని దాటి ముందుకు పోనీయదు. కాని ఈ 'తపస్సు'ను అనువాదం చేయడానికి అనువాదకులందరూ నిజంగానే తపస్సు చేశారని చెప్పాలి. కారణం రచయిత ఏడు దశాబ్దాల జీవితానుభవం నుంచి అనేక జీవిత తాత్విక విషయాలను చాలా లోతుగా చెప్పాడు ఇందులో. వాటిని అంతే గాఢంగా ఇంగ్లీష్‌లోకి తీసుకుపోవడం కత్తి మీద సామే. మచ్చుకు ఒకటి.


'Every thing is not visible, as air
can be sensed with touch, feeling, vibrations
no reasons for bondage of relationship....'

'పిడికిట్లో గాలి ఉందా?' అనే మూల కవితలోని కొన్ని అనువాద వాక్యాలివి. పోయెం అంతా చదువుతుంటే రవీంద్రుని 'గీతాంజలి' గుర్తుకు వస్తుంది అక్కడక్కడ. అనువాదం అంత బాగా కుదిరింది. సాధారణంగా జాతీయాలు, సామెతలు, నుడికారాలు, పోలికలు చెప్పేటపుడు ఒక భాషలోనివి మరో భాషలో సరిగా లొంగవు. కాని వీరు అలాంటి ఇబ్బందిని కూడా చాలా సునాయాసంగా దాటిపోయారని చెప్పాలి.

'తపస్సు' నుంచి బయటకు వచ్చిన తరువాత మానవ సంబంధాలు ఎంత ఛిద్రమవుతున్నాయో, మనుషులు ఎంత విచ్ఛిన్న దశకు చేరుకున్నారో, మానవ విలువలు ఎంత భగ్నమైపోయాయో అవగతమై హృదయమంతా ఒక మధ్యాహ్నపు ఎండను తాగినంత కఠినమైన అనుభూతి మిగులుతుంది. నైతిక విలువలు ఎంత దిగజారిపోయాయో, మాట్లాడవలసిన మేధావులు, రచయితలు మౌనం వహిస్తూ ఎంత నష్టానికి గురిచేస్తున్నారో తెలిసి గుండెనిండా మంటలు రేగుతాయి. కవిత్వం ఏం చేస్తుందని ప్రశ్నించుకుంటే గుప్పెడు సంస్కారాన్ని మన మనసులకు పూస్తుందని, పిడికెడు గాయాల్ని మన రక్తానికి కూడా రుచి చూపి కాస్త కదలిక తెస్తుందని ఈ 'తపస్సు' చదివిన తరువాత అర్థం అవుతుంది.జీవిత తాత్వికతను ప్రతి అక్షరం నిండా నింపుకున్న ఈ **'తపస్సు'** ధ్వన్యనుకరణ సామ్రాట్ పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్‌కు అంకితమీయడం గమనార్హం.

– డాక్టర్ వెల్దండి శ్రీధర్, 9866977741

ప్రపంచ కవిత



అలన్ సీగర్

(1888, జూన్ 22-1916, జూలై 4)

దేశభక్తిని, స్వీయ వ్యక్తిత్వాన్ని, సౌందర్యాత్మక భావజాలాన్ని, యుద్ధాన్ని, కవిత్వాన్ని సమానంగా ప్రేమించిన అరుదైన సైనిక కవి అలన్ సీగర్! న్యూయార్క్ నగరంలోని ఓ కులీన కుటుంబంలో జన్మించిన సీగర్, హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుతున్న సమయంలో భావవాద కాల్పనిక కవిత్వానికి ఆకర్షితుడై, T.S.Eliot రచనల చేత ప్రభావితమై, బాధ్యతలేవీ లేకుండా ప్రాకృతిక సౌందర్యారాధనలోనే జీవించాలని నిర్ణయించుకున్నాడు. తన స్నేహితుడు, కమ్యూనిస్ట్ విప్లవకారుడు John Reedతో కలిసి ఒకే ఇంట్లో కొంతకాలం నివసించినప్పటికీ, వాస్తవికత కన్నా, కాల్పనికత వల్లే జీవితం మీద ప్రేమకు కారణమని నమ్మాడు. తన ఆలోచనలకు, భావాలకు న్యూయార్క్ కన్నా, పారిస్ నగరం అనుకూలంగా ఉంటుందని భావించి, పారిస్‌కు వెళ్లి అక్కడ స్థిరపడి, అక్కడి జీవనశైలితో ఎంతో మమేకమయ్యాడు. 1914లో మొదటి ప్రపంచయుద్ధం మొదలైనప్పుడు, తాను ఎంతగానో ప్రేమించిన ఫ్రెంచ్ దేశం తరుపున సైన్యంలో చేరాడు. ఆయన రాసిన I Have a Rendezvous with Death కవిత ప్రపంచ సాహిత్యంలోని యుద్ధ కవితల్లోనే మహోన్నతమైన కవితగా ప్రశంసలు పొందడమే గాక, అమెరికన్ ప్రెసిడెంట్ జాన్ కెన్నడీకి అత్యంత ఇష్టమైన కవితగా కూడా ప్రత్యేకతను సాధించింది. అయితే యుద్ధం మీద ఇంత చక్కటి కవిత రాసిన సీగర్, యుద్ధ క్షేత్రంలోనే ప్రాణాలు కోల్పోవడం ఒక విషాదం! తనకు నచ్చిన దేశంతో ప్రేమలో పడి, ఆ దేశం కోసం తన ఆఖరి ఊపిరిని కూడా అర్పించిన సీగర్‌ను ఫ్రెంచ్ ప్రభుత్వం Croix De Guerre, Medallie Militaire అవార్డులతో సత్కరించడమే కాక, Biarritz నగరంలోని ఒక వీధికి ఆయన పేరును పెట్టి, నీరాజనాలు అర్పించింది!

మృత్యువుతో ములాఖాత్!

ఒకానొక వివాదాస్పద సరిహద్దుల కంచె వద్ద
మృత్యువుతో నాకు ముఖాముఖి జరిగింది
గలగల సవ్వడుల నీడలతో
వసంతం తిరిగొచ్చిన సమయాన
యాపిల్ తోటల పరిమళాలు గాలినంతా నింపిన క్షణాన
గతించిన దుఃఖ దినాలను, విషాద సన్నివేశాలను
వసంతం తిరిగి తీసుకొచ్చిన క్షణాన
నాకు మృత్యువుతో సమావేశం జరిగింది!

బహుశా అతనేననుకుంటా..
నా చేతిని తన చేతిలోకి తీసుకొని
తన చీకటి దేశం వైపు నన్ను తీసుకెళ్ళింది..
నా కళ్ళని మూసేసి నా ఊపిరిని లాగేసింది
నేనింకా అతనిని దాటి వెళ్లినట్టు లేను
చరియలు విరిగిపడ్డ కొండచివరి అంచుల మీద
వసంతం మళ్లీ తిరిగొచ్చిన సంవత్సరాన
గడ్డి పూవులు తొలిగా వికసించిన కాలాన
నాకు మృత్యువుతో ముచ్చట మొదలైంది..

దేవుడికి ఎప్పుడో తెలుసు
ఎక్కడైతే పట్టు బట్టల్లో దాగిన మెత్తలు
దిగువ దాకా వ్యాపించిన సుగంధాలు
ప్రశాంత నిద్రని దోచేసిన ప్రేమలు ఉంటాయో..
ఎక్కడైతే గుండెకు చేరువగా మరో గుండె చప్పుడు
ఊపిరితో ఏకమైన మరో ఊపిరి
విరామ మెలుకువలు అరుదుగా ఉంటాయో
అక్కడ లోతుల్లోకి విస్తరించడమే మేలని!

కానీ నేనింకా మృత్యువుతో చర్చలు జరుపాల్సి ఉంది
ఒకానొక దగ్ధ నగరంలో అర్ధరాత్రి సమయాన
వసంతం మళ్లీ ఉత్తరాది దిశగా సంచరించే కాలాన
నేను ప్రతిజ్ఞ చేసిన వాక్యాలంత నిజంగా..
నా సంప్రదింపులలో నేను
మృత్యువుతో రాజీ పడలేను...!
ఆ ములాఖాత్లో నేను విఫలం కాలేను..!!

మూలం: అలన్ సీగర్

స్వేచ్ఛానువాదం: మామిడి హరికృష్ణ, 8008005231

ప్రకటనలు

'బల్దేర్ బండి' ఆవిష్కరణ సభ

రమేష్ కార్తీక్ నాయక్ రచించిన కవితా సంపుటి 'బల్దేర్ బండి' ఆవిష్కరణ సభ 2019 జనవరి 20న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. కవి యాకూబ్ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా మామిడి హరికృష్ణ, ఆచార్య సూర్యధనంజయ్, మెర్సీ మార్గరెట్ హాజరవుతారు. ప్రధాన వక్తగా జీ.లక్ష్మీనరసయ్య హాజరవుతారు. సౌభాగ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

- భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం

మహిళా సాహిత్య సదస్సు

తెలంగాణ సాహిత్య అకాడమి, పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 9,10 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ మహిళా సాహిత్య సదస్సు నిర్వహించబడుతున్నది. ఈ సందర్భంగా సమకాలీన సమస్యలపై కవులు 20 లైన్లకు మించకుండా కవితను టైప్ చేసి 9032844017కు పంపాలి. వివరాలకు: రావూరి వనజ–9491486275, జి.శాంతారెడ్డి–8008177325, పులి జమున–8500169682, టి అంబుజ–9493710142.

-పాలమూరు సాహితీ మహిళా విభాగం, పాలమూరు

రచనలకు ఆహ్వానం

దోరవేటిగా ప్రసిద్ధులైన వి.చెన్నయ్య గారి సాహిత్య కృషిని తెలుపుతూ ప్రత్యేక సంచిక తేవాలని మేడ్చల్ జిల్లా సాహిత్య వేదిక నిర్ణయించింది. రచయితలు వివిధ పార్శ్వాల్లో వ్యాసాలు, కవితలు, పద్యాలను ఆహ్వానిస్తున్నాం. రచనలు suryaprakashrao2014@gmail.com కు ఈ నెల 24వ తేదీ లోపు అందేట్లు పంపాలి.

- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839
- డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి

తెలంగాణ జీవితాల కథాఘాటు

ఈ కథకులు పరాయోన్ని నిందించలేదు, ఇడ్లీ సాంబర్‌ను గో బ్యాక్ అనలేదు. వీళ్ల ఇల్లు వీళ్లే అలుక్కున్నారు. వీళ్ల ఇంట్లో వీళ్లే దీపం పెట్టుకున్నారు. వీళ్ల బువ్వ వీళ్లే వండుకున్నారు. అందుకే 'దావత్' ఇచ్చింద్రు.

తెలంగాణ 'దావత్' అంటే గొడ్డు కారంలాంటి పచ్చి నిజాలు.. చింతకాయ తొక్కులాంటి సంస్కృతి సంప్రదాయాలు, మక్కగట్క లాంటి మానవ సంబంధాలు, ఎన్నెన్నో కథరుచులు మనకు దొరుకుతాయి.



ఈ దావత్ అరేంజ్ చేసిన సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ వెల్దండి శ్రీధర్‌ను అభినందించక ఉండలేం. ఈ 'దావత్'కు సరుకులు అందించిన డాక్టర్ ముదిగంటి సుజాతరెడ్డి, రామా చంద్రమౌళిని మరువలేం.

ఈ సంచికలో అంతా కొత్తవాళ్లే.. పాతతరం తెలంగాణ కథా రచయితలు ఎక్కడైతే ఆగిపోయారో... వీల్లు అక్కడ్నుంచే ప్రారంభం కావటం శుభసూచకం. అదే ఈ కథల్లో కన్పించే గొప్ప స్పార్క్. రేపటి సాహిత్య వారసత్వ సరుకు ఈ కథలే నిదర్శనం.

అవయవ దానంలో వున్న గొప్ప మానవ సంబంధాల్ని, మానవత్వాన్ని చూపిన మన్‌ప్రీతమ్ కథ 'దానం'తో మొదలై.. స్త్రీల జీవితాల్ని భిన్నమైన కోణంలో చూపిన నస్రిన్‌ఖాన్ 'పంఛీ ఔర్ పింజ్రా' కథతో ముగిసే ఈ సంకలనంలో 13 కథలున్నాయి. ఎలక్షన్లో గెలిచాక కూడా స్త్రీని మగాడు ఎలా చూస్తున్నాడో తెలిపే వాస్తవిక కథ సమ్మెట ఉమాదేవి 'ద్వాలి'. ఈ కథ చదివాక ముగ్గురు పిల్లలుంటే పదవికి అనర్హులు అని ప్రభుత్వం ప్రకటించినప్పుడు మండలాధ్యక్షురాలైన భార్యకు బలవంతంగా గర్భం తీసేయించిన అప్పటి ఆదిలాబాద్ జిల్లా 'నెన్నల' మండలాధ్యక్షురాలి వార్త నాకు గుర్తొచ్చింది. స్త్రీ సింహాసనం మీద కూర్చున్నప్పటికీ.. ఆకాశంలో సగం అంటూనే పురుష హయాంలో కవేలం 'సంతకం'గానే మిగులుతున్నారు అనడానికి ఈ కథే నిదర్శనం.

'మద్యం' మీద ఎవరెంత రాసిన 'పెగ్గ గ్లాస్'తో సముద్రాన్ని తోడినట్టే.. మా స్కైబాబ 'ఊరి మీద ఉరితాడు' కథతో.. రూప్‌కుమార్ 'లచ్చుబాయ్' కథతో ఆ 'మద్య'ధరా సముద్రాన్ని తోడే ప్రయత్నం చేశారు.

2016 భారత ఆర్థిక చరిత్రలో చీకటి సంవత్సరం.. పెద్దనోటు ప్రభావంతో ఇంకా సామాన్య జనాలు తన్లాడమన్లాడమవుతున్నారు. దీన్ని కొత్త కోణంలో చెప్పిన గొప్ప కథ మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'పెద్దనోటు' ఈ కథపై చాలా చర్చ జరుగాల్సి ఉన్నది. ఆంధ్ర రచయితలు ఇలాంటి కథ రాస్తే.. దానికి ఎంత ప్రాచుర్యం కల్పించేవాళ్లో..

రియల్ ఎస్టేట్‌లపై పాతి ఎర్రచీర.. హుమాయిన్ సంఘీర్ రాసిన 'పచ్చశీర' కథ చాలా మంచి కథ. రంగుల బ్రోచర్లతో మన కళ్లను కుమ్మేస్తున్న 'బచ్చాగాల్ల'పై తెల్ల బట్ట కప్పాలని తెలియజెప్పే కథ.

మరో సున్నితమైన కథ చందు తులసి 'తల్లి గారిల్లు' తల్లిదండ్రి లేని ఆడపిల్లను 'బతుకమ్మ' పండుగ ఎంత బాధ పెడుతుందో ఆ సంఘర్షణ చెప్తూనే.. మంచి ముగింపునిచ్చారు. రచయిత. కానీ పూలమ్మ లాంటి అందరి జీవితాల్లోను అలాంటి ముగింపులాంటివుంటాయా అన్నదే ప్రశ్న.

'మద్యం' మీద ఎవరెంత రాసిన 'పెగ్గ గ్లాస్'తో సముద్రాన్ని తోడినట్టే.. మా స్కైబాబ 'ఊరి మీద ఉరి తాడు' కథతో.. రూప్‌కుమార్ 'లచ్చుబాయ్' కథతో ఆ 'మద్య'ధరా సముద్రాన్ని తోడే ప్రయత్నం చేశారు. సంప్రదాయ కళాకారుల్ని జీవితాలు నిలబడాలంటే ఏం చేయాలో చెప్పిన కథ వజ్జీర్ ప్రదీప్ 'రంగుల గూడు' తన రచనల్లో తెలంగాణ మధ్య తరగతి భాషా సౌందర్యాన్ని చాటిచెప్పే పూడూరి రాజిరెడ్డి 'బోర్లించిన చెప్పు' ఒక హైలెట్. ఈ సంపుటికి పైలెట్ కూడా. కిరణ్ చర్ల 'సముద్రం నిద్ర పోదు', ధీరజ్ కశ్యప్ 'నాలుగేండ్ల చదువు', లాంటి మంచి కథలు కూడా ఈ సంకలనంలో ఉన్నాయి. పి.యస్.చారి గీసిన కవర్ బొమ్మ అద్భుతంగా ఉన్నది.

ఏదైనా తెలంగాణ 'దావత్'ను ఆస్వాదిస్తే... నశం నసాలనికంటినట్లే...

– కె.వి.నరేందర్, 98492 20321

కొత్త పుస్తకాలు

సూఫీ కథలు



ఇద్రీస్ షా అనే పరిశోధకుడు ఏండ్ల పాటు శ్రమకోర్చి మూడు ఖండాల్లో తిరిగి సేకరించిన కథలివి. ఎక్కువ భాగం మౌఖికంగానే దొరికిన ఈ కథలను అక్షర బద్ధం చేసి ప్రపంచానికి అందించాడు. ఇవి పిల్లల కథలు కావు. ఆలోచించగల వారికోసం గురువులు ఆలోచించి చెప్పిన కథలు.

కథనం: కె.బి.గోపాలం, వెల: రూ. 100, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ జీఎస్ఐ పోస్ట్, హైదరాబాద్-68. ఫోన్:040 29884454

బందీ



ఇది కేవలం బందిఖానాలో బతుకు కథ కాదు. దేశమే పెద్ద జైలయినప్పుడు ఆ జైలులోంచి చిన్న జైలులోకి వెళ్లిన మేధావి తన దేశం కోసం, ప్రజల కోసం, సంస్కృతి కోసం తపన పడి కన్న స్వప్నాలివి. నెత్తుటిలో గడిసిన అక్షరాలివి. గుగి వా థియాంగో జైలులో రాసిన తన అనుభవాలను జైలులో ఉండి వరవరరావు తెలుగులోకి అనువాదం చేసిన పుస్తకం ఇది.

రచన: గుగి వా థియాంగో, తెలుగు: వరవరరావు, వెల: రూ. 200, ప్రతులకు: స్వేచ్ఛా సాహితి, జి-1, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం:3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29

వడిచర్ల మణిపూసలు



వడిచర్ల సత్యం చెప్పిన ఈకొత్త 'మణిపూసలు' సమకాలీనమైన అంశాలను, జీవిత సత్యాలను, ప్రాసంగికత ఉన్న విషయాలనే గాక, తాత్విక పరిధిని కూడా స్పృశించటం అభినందనీయం. ప్రజల జీవన చిత్రాన్ని ప్రతిబింబిస్తూ వడిచర్ల వడివడిగా సృష్టిస్తున్న 'మణిపూసలు' సాహిత్య ప్రక్రియలో నిజంగానే మణిపూసలు.

రచన: వడిచర్ల సత్యం, వెల: రూ. 75, ప్రతులకు:వడిచర్ల సత్యం, ఇంటి నెం:2-2-87/29, సాయినగర్, సాయిపూర్, తాండూర్, వికారాబాద్ జిల్లా-501141


స్త్రీల మనోభావాలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో ప్రత్యేకమైనది బతుకమ్మ. ఈ బతుకమ్మ పండుగలో ఒక ఆట, ఒక పాట కళాత్మకత వ్యాయామం, వంటల వినిమయం, కుటుంబ సంబంధాల సమన్వయం ఉంటది. బతుకమ్మ తెలంగాణ సహజ సౌందర్యానికి ప్రతీక.

రచన: తిరునగరి దేవకీదేవి, వెల: రూ.300, ప్రతులకు: తిరునగరి దేవకీ దేవి, ఎంఐజీ-2, ఏపీహెచ్‌పీ కాలనీ, ఆలంపల్లి రోడ్, వికారాబాద్-501101, ఫోన్: 9949636515

ఏకధార



సమాజంలోని వెనుకబాటుతనానికి, అసమానతలకు, అమానవీయతలకు దుఃఖితుడైన కందాళై రాఘవాచార్య తనదైన సామాజిక బాధ్యత నుంచి రాసినవే ఈ కవితలు. అయన అనుభవాలు, అనుభూతుల శకాలాలే, ఆ దుఃఖ ప్రవాహమే 'ఏకధార'..

రచన:కందాళై రఘవాచార్య, వెల: రూ.150, ప్రతులకు: సాయి రెసిడెన్సీ, ఫ్లాట్ నెం:503, వినాయకనగర్, నిజామాబాద్, సెల్: 9908612037

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు రంగులహరివిల్లును తలపించాయి. సుమారు 150 మంది ఈ పోటీల్లో పాల్గొని ముగ్గులు వేయగా.. నాగలక్ష్మి, రజిని, రేవతి బహుమతులు గెలుచుకున్నారు. నగర మేయర్ ఆకుల సుజాత వీరికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. -నిజామాబాద్ స్పోర్ట్స్



ఆలయ అర్చకులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి

ఆలయాభివృద్ధికి విరాళంగా ఎమ్మెల్యే సింగిరెడ్డి తొలిజీతం

వనపర్తి అర్బన్: వనపర్తిలోని గాంధీచౌక్ సమీపంలో ఉన్న పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి తన తొలి వేతనాన్ని విరాళంగా అందించారు. ఆదివారం పాండురంగ విఠలేశ్వర స్వామి, గోదాదేవిల కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే ఈ మేరకు రూ. 1,00,116 చెక్కును ఆలయ నిర్వాహకులకు అందజేశారు.



దుగ్గొండి మండలం వెంకటాపురంలో పసుపు పంటను పరిశీలిస్తున్న కెనడా దేశస్థులు

సేంద్రియ సాగు భేష్: కెనడా దేశస్థుల కితాబు

దుగ్గొండి: తెలంగాణలో రైతులు చేస్తున్న సేంద్రియ సాగు అద్భుతంగా ఉన్నదని కెనడా ప్రతినిధుల బృందం కితాబిచ్చింది. ఆదర్శ గ్రామ నిర్మాణంలో భాగంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురంలో రైతులు సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయాన్ని ఆదివారం వారు పరిశీలించారు. రైతులను సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఏకగ్రీవాల జాతర..

ప్రోత్సాహక నిధులు..
అభివృద్ధి కోసం ఏకతాటిపైకి

- రోజురోజుకూ పెరుగుతున్న ఏకగ్రీవ తీర్మానాలు
- పలుచోట్ల సంబురాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏకగ్రీవాల జాతర కొనసాగుతున్నది. మొదటి విడతలో భారీగా ఏకగ్రీవ పంచాయతీలను ఎన్నుకోగా అదే ఉత్సాహంతో రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లోనూ పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకొంటున్నారు. ప్రభుత్వమిచ్చే రూ.10 లక్షల ప్రోత్సాహానికి తోడు స్థానిక ఎమ్మెల్యేలిచ్చే అదనపు నజరానాలను దక్కించుకునేందుకు గ్రామస్థులంతా ఏకమై తీర్మానాలు చేస్తున్నారు. ఆ దిశగా ఆదివారం చాలాచోట్ల సింగిల్ నామినేషన్లు దాఖలు చేశారు. కామారెడ్డి జిల్లాలో ఏకగ్రీవాల జోరు కొనసాగుతున్నది. నిజాంసాగర్ మండలంలోని మహమ్మద్‌నగర్ సర్పంచ్‌గా దఫేదార్ బాలమణి, లింగంపేట్ మండలం నల్లమడుగు పెద్ద తండా సర్పంచ్‌గా ధనావత్ రవీందర్, ఉప సర్పంచ్‌గా కేతావత్ సురేందర్‌తోపాటు వార్డు సభ్యులను కూడా ఎన్నుకున్నారు. అనంతరం కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై టపాసులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఖమ్మం జిల్లా తెల్దారుపల్లి సర్పంచ్‌గా సిద్దినేని కోటయ్య, నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం సర్పంచ్‌గా బ్రహ్మయ్య, వనపర్తి మండలం చిట్యాల తూర్పుతండా సర్పంచ్‌గా పుల్జీన్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలోనూ పలు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. సంగారెడ్డి మండలం గుడితండా సర్పంచ్‌గా మెగావత్ లక్ష్మీబాయితోపాటు ఎనిమిది వార్డులను, కంది మండలం బ్యాతోల్‌లో సర్పంచ్‌గా శిరీషకొండల్‌రెడ్డితోపాటు రెండు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామంలో పోటీలో ఉన్న ఆరుగురు అభ్యర్థుల్లో ఐదుగురు తమ అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకోవడంతో వై పోచయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిట్కుల్‌లో బరిలో ఉన్న ఇద్దరిలో ఒకరు పోటీనుంచి తప్పుకోవడంతో నీలం మధు ఏకగ్రీవం కాగా వీరిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అభినందించారు. హత్నూర మండలంలో మాధుర సర్పంచ్‌గా మాధవి, తెల్లరాళ్లతండా సర్పంచ్‌గా రవీందర్‌నాయక్, దేవుని గుట్టతండా సర్పంచ్‌గా అరుణ, చీక్‌మద్దూర్ సర్పంచ్‌గా శ్రీనివాస్‌రెడ్డి, మంగాపూర్ సర్పంచ్‌గా చిప్పల్‌తుర్తి యాదయ్య, కొత్తగూడెం సర్పంచ్‌గా లకావత్‌మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా టీఆర్‌ఎస్ మద్దతుదారులు కావడం గమనార్హం. వట్‌పల్లి మండలం గౌతాపూర్ సర్పంచ్‌గా ఖయ్యూంపాషా, ఉప సర్పంచ్‌గా నసీమాబీ, దరఖాస్తుపల్లి సర్పంచ్‌గా దూదేకుల మహ్మద్ ఉపసర్పంచ్‌గా మహేశ్‌తోపాటు 14 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అధికారులు వీరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



రంగారెడ్డి జిల్లా ఎక్లాస్‌ఖాన్‌పేటలో ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచ్ కవిత, ఉపసర్పంచ్ భారతీదేవితో ఎమ్మెల్యే తనయుడు, మాజీ సర్పంచ్ రవీందర్‌యాదవ్, తదితరులు



శామీర్‌పేట మండలం యాడారం పంచాయతీ ఏకగ్రీవం కావడంతో సర్పంచ్ యాంజాల సుజాత, వార్డు సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కొత్తతండా ఏకగ్రీవం..

శంషాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా పంచాయతీ సర్పంచ్‌గా కొర్ర దేవా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ చివరిసమయంలో ప్రత్యర్థిగా ఉన్న కొర్ర ఘోరి పోటీనుంచి తప్పుకొన్నారు. ఈ మేరకు సర్పంచ్‌గా ఎన్నికైనట్టు దేవాకు రిటర్నింగ్ అధికారి కమల్‌సింగ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సర్పంచ్‌గా దేవాతోపాటు మరో నలుగురు కొర్ర సునీత, నెనావత్ బుజ్జి, కొర్ర గాంగ్లీ, కొర్ర వినేష్ వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఇక్కడ మరో నాలుగు వార్డులకు ఈ నెల 21న ఎన్నికలు జరగనున్నాయి.

మెదక్ జిల్లాలోని 28 గ్రామాల్లో సింగిల్ నామినేషన్లు..

మెదక్ జిల్లాలో 28 గ్రామాల్లో ఒక్క నామినేషన్ చొప్పున దాఖలైనట్టు తెలిసింది. శివ్వంపేట మండలంలో 10, కౌడిపల్లి మండలంలో 8, నర్సాపూర్ మండలంలో 4, చిలిపిచెడ్ మండలంలో 3, వెల్దుర్తి మండలంలో 3పంచాయతీల్లో, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సెగ్మెంట్‌లో 30కిపైగా గ్రామాల్లో సర్పంచ్ స్థానానికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది.వికారాబాద్ జిల్లాలో రెండో దశలో భాగంగా ఇప్పటికే 6 గ్రామాలు ఏకగ్రీవం కాగా ఆదివారం మరో 5 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.

ఎక్లాస్‌ఖాన్‌పేటలో ప్రమాణం

కేశంపేట: రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఆదివారం వారంతా అధికారికంగా ప్రమాణం చేశారు. సర్పంచ్‌గా ఎల్లనమోని కవిత, ఉపసర్పంచ్‌గా ఎల్లనమోని భారతీదేవితోపాటు వార్డు సభ్యులతో రిటర్నింగ్ అధికారి శంకరయ్య ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వీరిని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తనయుడు, మాజీ సర్పంచ్ రవీందర్‌యాదవ్ సన్మానించారు.

కొత్త సర్పంచ్‌లకు ఎమ్మెల్యే మల్లారెడ్డి అభినందన..

మేడ్చల్ జిల్లా మూడుచింతల్‌పల్లితోపాటు నాగిశెట్టిపల్లి, యాడారం పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో సదరు పాలకవర్గ సభ్యులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, వైస్ ఎంపీపీ భవానీ పాల్గొన్నారు.

ఏకగ్రీవంలో మేడేపల్లి పంచాయతీ ఆదర్శం: ఎంపీ పొంగులేటి

ఖమ్మం, నమస్తే తెలంగాణ: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడేపల్లి పంచాయతీ అన్ని విధాలుగా ఆదర్శనీయమని ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తొలివిడతలో ముదిగొండ మండలంలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని, మేడేపల్లి గ్రామాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా నూతన పాలకవర్గాన్ని ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. తొలుత నూతన సర్పంచ్ సామినేని రమేశ్, ఉపసర్పంచ్ బయ్యం రమేశ్‌తోపాటు వార్డు సభ్యులకు స్వీట్లు తినిపించి సన్మానించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. మేడేపల్లిని ఆదర్శంగా తీసుకుని మిగతా గ్రామాల వారు కూడా తమ పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.



ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడేపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్ సామినేని రమేశ్, బయ్యం రమేశ్‌లను సన్మానిస్తున్న ఎంపీ పొంగులేటి

మోటకొండూర్‌లో..


మోటకొండూర్: మోటకొండూర్ గ్రామ స్వతంత్ర అభ్యర్థి వడ్డెబోయిన శ్రీలత పేర్కొన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో స్వతంత్ర అభ్యర్థిగా వడ్డెబోయిన శ్రీలత ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానికంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తననను సర్పంచ్‌గా గెలిపిస్తే మోటకొండూర్ మండల కేంద్రాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద మాట్లాడుతున్న సర్పంచ్ అభ్యర్థి వడ్డెబోయిన శ్రీలత

చెరువులో పడి ఇద్దరు మృతి

మృతుల్లో ఒకరు నమస్తే తెలంగాణ కొత్తగూడెం సీవో

నరసింహారావు, నీరజ్‌కుమార్ (ఫైల్)

మోతె: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా మోతె మండలం నామవరంలో చోటు చేసుకున్నది. మృతి చెందిన వారిలో నమస్తే తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్క్యులేషన్ ఆఫీసర్ (సీవో) పులిరాజుల నరసింహారావు(42) కాగా మరొకరు తన దగ్గరి బంధువు పులిరాజుల నీరజ్‌కుమార్(21). నరసింహారావు బాబాయి వీరభద్రం ఇటీవల మృతిచెందడంతో ఆదివారం నామవరంలో దశదినకర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లాకు చెందిన నరసింహారావు, నీరజ్‌కుమార్ వెళ్లారు. దశదినకర్మ చెరువులోకి కాళ్లు కడుక్కొనేందుకు వెళ్లగా మొదట నీరజ్‌కుమార్ చెరువులో దిగి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడ్డాడు. అతడిని కాపాడోయిన నరసింహారావు కూడా చెరువు నీటిలో మునిగి ఇద్దరూ మృత్యువాత పడ్డారు.

పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపు

హుజూరాబాద్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడాలనీ, ఇందుకోసం టీఆర్‌ఎస్ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఏకగ్రీవ ఎన్నికలకు కృషిచేయాలని సూచించారు. ఏకగ్రీవ గ్రామాలకు ప్రభుత్వ ప్రోత్సాహక నిధులతోపాటు తన కోటాలో రూ. 10లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని తన నివాసంలో ఆదివారం నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన టీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచ్, వార్డుసభ్యుల ఔత్సాహికులతో ఈటల వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా కులవృత్తులకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయుతనిచ్చిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలకు పెద్దఎత్తున నిధులు కేటాయించడంతో పాటు నిధులు, విధులు అప్పగించారని తెలిపారు.



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాదాడి భారతిని అభినందిస్తున్న ఎంపీ వినోద్‌కుమార్

పంచాయతీల ఏకగ్రీవాలకు కృషిచేయండి

టీఆర్‌ఎస్ కార్యకర్తలకు కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ సూచన

తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు టీఆర్‌ఎస్ కార్యకర్తలు కృషిచేయాలని.. కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ టీఆర్‌ఎస్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మాదాడి రమేశ్‌రెడ్డి తల్లి మాదాడి భారతి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఎంపీ ఆమెను అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘనవిజయం సాధించిందని చెప్పారు. ట్రక్కు గుర్తువల్ల ప్రజలు అయోమయానికి గురి కావడంతో టీఆర్‌ఎస్‌కు చెందిన ఏడుగురు అభ్యర్థులు ఓడిపోయారని పేర్కొన్నారు.



కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నాగ్లూర్ తండాలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

పెంబి మండలంలో కలప పట్టివేత

నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో అటవీ అధికారుల తనిఖీలు

రూ.2 లక్షల విలువ చేసే కలప, కోత యంత్రాలు స్వాధీనం

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి అటవీ రేంజ్ పరిధిలోని ఇటిక్యాల్, లోతోర్యతండా, తులసీపేట్ గ్రామాల్లో ఆదివారం నిర్మల్ డీఎఫ్‌వో దామోదర్‌రెడ్డి అటవీ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి సుమారు రూ. రెండు లక్షల విలువచేసే కలపను పట్టుకున్నారు. ఇండ్లు, ఇంటి ఆవరణలల్లో అక్రమంగా నిల్వ చేసిన కలప, కోత మిషన్లను స్వాధీనం చేసుకొని పెంబి రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఇటీవల పుల్గంపాండ్రి అడవుల్లో పెద్దపులి, నీలుగాయి వధతో అటవీ అధికారుల అప్రమత్తమయ్యారు. వన్య ప్రాణులను వేటాడినా, చెట్లను నరికినా, ఇసుక అక్రమరవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో దామోదర్‌రెడ్డి హెచ్చరించారు.

టేకు దుంగలు పట్టివేత

గాంధారి: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని నాగ్లూర్ తండాలో ఆదివారం అక్రమంగా నిలువ ఉంచిన 56 టేకు దుంగలను పట్టుకున్నట్టు గాంధారి అటవీశాఖ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. దాడిలో 56 టేకు దుంగలను పట్టుకున్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.12000 ఉంటుందని, వీటిని అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. కలపను అక్రమంగా నిల్వ ఉంచిన నిందితులు పరారీలో ఉన్నట్టు ఎఫ్‌ఆర్వో తెలిపారు.

జనశక్తి దళ సభ్యుడి ఇంట్లో పోలీసుల సోదాలు

రెండు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం

సిద్దిపేట టౌన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లోని జనశక్తి దళసభ్యుడు సంతోష్ నివాసంలో ఆదివారం పోలీసులు సోదాలు జరిపారు. ఈ నెల 5న ఓ ఉద్యోగిని సంతోష్ బెదిరించడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఇందులో భాగంగా తొగుట సీఐ నిరంజన్ నేతృత్వంలో బేగంపేట పోలీసులు సోదాలు జరిపారు. సోదాల్లో విప్లవసాహిత్యం మాత్రమే దొరికిందని పోలీసులు చెప్పారు.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్ కాంగ్రెస్ నాయకుడు మధుసూదన్‌కు కండువాకప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఈటల



టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు భారీసంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన పలువురు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో, సూర్యాపేట జిల్లాలో వివిధ మండలాలకు చెందిన 430 మంది మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, కామారెడ్డి జిల్లా పిట్లం మండలానికి 35 మంది జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో, భిక్కనూరు మండలం రామేశ్వరపల్లికి చెందిన పలువురు కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో, కరీంగనర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన 20 మంది చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో, మా నకొండూర్ మండలం ముంజంపల్లికి చెందిన 30 మంది సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు సమక్షంలో, జగిత్యాల జిల్లా మేడిపల్లిలో 200 మంది వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సమక్షంలో, గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పలువురు ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ సమక్షంలో, ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని పెద్ద మునగాలలో వివిధపార్టీలకు చెందిన 30 కుటుంబాలు, కూసుమంచి మండలం పోచారంలో 30 కుటుంబాలు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంటకు చెందిన 50 మంది ఎమ్మెల్యే ఆల సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు చెందిన 50 మంది అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం సర్వాపురంలో ఎమ్మెల్యే పెద్ది సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న టీడీపీ నాయకులు



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్



యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాక గ్రామంలో చేనేత కార్మికుడు రావిరాల సత్తయ్య నుంచి వివరాలు సేకరిస్తున్న న్యాయవాదులు

కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అండగా ఉంటాం

తెలంగాణ బార్‌కౌన్సిల్ సభ్యుడు బూరం రమేశ్ భరోసా

సంస్థాన్‌నారాయణపురం: కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అండగా ఉంటామని తెలంగాణ న్యాయవాదుల బార్ కౌన్సిల్ సభ్యుడు బూరం రమేశ్ భరోసా ఇచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో పుట్టపాక వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్, పద్మశాలి అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని బృందం కిడ్నీ వ్యాధిగ్రస్థులను పరామర్శించింది. కార్యక్రమంలో పద్మశాలి అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, రంగయ్య, గోరక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట వద్ద ఘటన

శామీర్‌పేట: మేడ్చల్ జిల్లా శామీర్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం వాగునూతికి చెందిన పాలవ్యాపారి గూడురు నరసింహారెడ్డి (60), రియల్ ఎస్టేట్ వ్యాపారి మల్లారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ఓంప్రకాశ్ బహదూర్(53)తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. తుర్కపల్లి వద్ద కారు పంక్చర్ అయ్యింది. అదే సమయంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న గుర్తు తెలియని కంటేనర్ వాహనం కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహారెడ్డి, ఓంప్రకాశ్ బహదూర్ అక్కడికక్కడే మృతి చెందగా.. మల్లారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.



జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఆదివారం గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కొండగట్టులో తెల్లవారు జామున నాలుగు గంటలకే స్వామివారికి ఆరాధన, జలాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ముస్తాబుచేసి మేళ తాళాలతో కల్యాణవేదికపైకి తీసుకొచ్చి వైభవంగా కల్యాణం జరిపారు. ఆలయ ఈవో అమరేందర్ దంపతులు స్వామివారికి వస్త్రాలను అందజేశారు. ధర్మపురి క్షేత్రంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవికి ప్రత్యేక అలంకరణ చేయడంతోపాటు పాశురాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గోదారంగనాథులవారి కల్యాణంతో ధనుర్మాస ఉత్సవాలు ముగిశాయి.

\- మల్యాల/ధర్మపురి





చీరెలు అడ్డుగా కట్టి మహిళకు ప్రసవం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఎంజీబీఎస్‌లో మహిళ ప్రసవం

మానవత్వం చాటిన ఆర్టీసీ సిబ్బంది

అబిడ్స్, నమస్తే తెలంగాణ: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఓ మహిళ పండంటి బిడ్డకు జన్మనించింది. ఆర్టీసీ సిబ్బంది అందుకు సహకరించి మానవత్వం చాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన చెంచు మణెమ్మ(33) నిండు గర్భిణి. ప్రసవం కోసం ఆమె తల్లి నగరంలోని ఓ ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చింది. చెకప్‌కు సంబంధించిన కార్డులు లేకపోవడంతో వైద్యులు చేర్చుకోలేదు. ఇంటికి తిరిగివెళ్లేందుకు ఆదివారం సాయంత్రం ఎంజీబీఎస్‌కు చేరుకొన్నారు. బస్సుకోసం నిరీక్షిస్తుండగానే మణెమ్మకు పురిటి నొప్పులు వచ్చాయి. గమనించిన ఆర్టీసీ సిబ్బంది చుట్టూ చీరెలు కట్టి ప్రసవ ఏర్పాట్లుచేశారు. ఆమె మగ శిశువును ప్రసవించింది. 108 సిబ్బంది ఆమెను పేట్లబుర్జు దవాఖానాకు తరలించారు. కల్వకుర్తి ఏడీసీ జీఆర్ రెడ్డి, ఎంజీబీఎస్ కంట్రోలర్లు, సిబ్బంది కొంత నగదు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

జూన్ నుంచి పెన్‌కల్చర్

- అధునాతన పద్ధతిలో చేపల పెంపకానికి మత్స్యశాఖ శ్రీకారం
- ఆరు ప్రాంతాలను ఎంపికచేసిన అధికారులు
- కోల్‌కతా శాస్త్రవేత్తలతో ప్రత్యేక శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమీకృత మత్స్య అభివృద్ధి పథకం(ఐఎఫ్‌డీఎస్)లో భాగంగా తెలంగాణలో పెన్‌కల్చర్‌ను అమలు చేసేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా చేపపిల్లల పంపిణీ, ఆధునిక వసతుల కల్పనతో రాష్ట్రంలో మత్స్యసంపద పెంచుతున్నది. తాజాగా జూన్ నుంచి పెన్‌కల్చర్ పద్ధతిలో చేపలు పెంచాలని నిర్ణయించింది. ఈ విధానంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు కోల్‌కతా నుంచి శాస్త్రవేత్తలను రప్పించారు. పెన్‌కల్చర్‌కు అనుకూల వాతావరణం ఎక్కడ ఉన్నదో గుర్తించేందుకు ఉన్నతాధికారులు, నిపుణులు విస్తృతంగా పరిశోధిస్తున్నారు. ఇప్పటికే 15 రిజర్వాయర్లను పరిశీలించారు. వీటిలో ఆరింటిని ఎంపికచేసి ప్రయోగాత్మకంగా చేపలు పెంచాలని భావిస్తున్నారు. ఇందుకోసం రూ.కోటి ఖర్చుచేయనున్నట్టు అధికారులు తెలిపారు.



తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి

పెన్‌కల్చర్‌లో పెట్టుబడి తక్కువగా ఉండి దిగుబడి ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా చెరువుల్లో పెంచే చేపలకు రోజూ ఆహారం అందించాల్సి ఉంటుంది. కానీ పెన్‌కల్చర్‌లో చేపలు జలాశయాల్లోనే ఆహారాన్ని సమకూర్చుకుంటాయి. అవసరమైన సందర్భాల్లోనే బయటి నుంచి అందిస్తారు. చేపలను బాగా పెంచడంతోపాటు చేపపిల్లల ఉత్పత్తికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. సాధారణ పెంపకానికి నాలుగు నుంచి పది రెట్లు ఎక్కువగా చేపల ఉత్పత్తి ఉంటుందన్నారు. దాదాపు 250 ఎకరాల్లో పెన్‌కల్చర్‌ను అమలులోకి తేవచ్చని, హెక్లారుకు నాలుగు టన్నుల వరకు ఉత్పత్తి ఉంటుందని వివరించారు. ఈ విధానంలో చేపల పెంపకానికి ముందుకొచ్చేవారికి 90 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

పెన్‌కల్చర్ అంటే..?

రిజర్వాయర్లు, పెద్ద చెరువుల్లో ప్రత్యేకంగా కొంత ప్రాంతాన్ని ఎంపికచేస్తారు. వెదురు, చెక్కలు, ఇతర సామగ్రి సాయంతో నీటి అడుగు నుంచి ఉపరితలం వరకు కంచె ఏర్పాటు చేస్తారు. దీనినే పెన్ అంటారు. ఆ పరిధిలో చేపలు పెంచుతారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఈ విధానం అమలులో ఉన్నది.

పెన్‌కల్చర్‌కు తెలంగాణ అనుకూలం: సువర్ణ, మత్స్యశాఖ కమిషనర్



పెన్‌కల్చర్‌ను జూన్‌లో ప్రారంభించి, క్రమంగా విస్తరిస్తాం. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పైలట్ ప్రాజెక్టును చేపడుతాం. జార్ఖండ్, అసోం రాష్ట్రాల్లో మంచి ఫలితాలు రావడంతో తెలంగాణలోనూ మొదలుపెట్టాలని నిర్ణయించాం. కొన్నిదేశాల్లో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోనే పది టన్నుల వరకు చేపలు ఉత్పత్తి చేస్తున్నారు. ఆ విధానాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నాం.

అందుబాటులోకి ధరణి

మొదటిపేజీ తరువాయి...

అందరికీ అందుబాటులోకి తేవడంకోసం సీఎం కేసీఆర్ నిర్దేశంతో 'ధరణి' ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను, వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్‌లో వచ్చిన సమస్యల కారణంగా భూరికార్డులను అప్‌లోడ్ చేయడం రెవెన్యూ అధికారులు బాలారిష్టాలను ఎదుర్కొన్నారు. ప్రతి భూమి రికార్డును అప్‌లోడ్‌చేసే సమయంలో తహసీల్దారు డిజిటల్ సంతకంచేయాల్సి ఉంటుంది. ఒక దశలో తహసీల్దార్లు డిజిటల్ సంతకాలుచేయడానికి 24 గంటలు కార్యాలయంలోనే ఉండి పనిచేయాల్సి వచ్చింది. దీనికితోడు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి వెయ్యికిపైగా క్లిక్స్ వస్తే వెబ్‌సైట్ పనిచేయలేని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ అధికారులు ఒక్కో సమస్యను అధిగమిస్తూ అన్ని భూ రికార్డులను అప్‌లోడ్‌చేసి 'ధరణి'ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

కోర్ బ్యాంకింగ్ విధానానికి మరికొంతకాలం

'ధరణి' వెబ్‌సైట్‌ను అందుబాటులోకి వచ్చినప్పటికీ, కోర్ బ్యాంకింగ్ తరహాలో భూ లావాదేవీలు నిర్వహించేస్థాయికి ఈ సాఫ్ట్‌వేర్ ఇంకా అప్‌డేట్ కాలేదు. ఈ విధానం అమల్లోకి రావడానికి ఇంకొంతకాలం పట్టవచ్చు. ప్రస్తుతానికి కోర్ బ్యాంకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిగి, నకిరేకల్, వికారాబాద్‌లలో చేపట్టారు. రెండురోజులనుంచి పరిగిలో పూర్తిస్థాయిలో క్రయవిక్రయాలు కోర్‌బ్యాంకింగ్ ద్వారా సాగుతున్నాయి. ఈ విధానం ఇక్కడ సక్సెస్ కాగానే రాష్ట్రమంతా అమలుచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అమలులోకి వస్తే ఎవరికీ లంచాలు ఇచ్చేపని లేకుండా పూర్తిస్థాయిలో పారదర్శకంగా భూ క్రయవిక్రయాలకు చెందిన మ్యుటేషన్లు జరుగుతాయి.

ప్రస్తుతం అందిస్తున్న సేవలు

మొదటిపేజీ తరువాయి...

విలేజీ మ్యాప్, సెలక్ట్ లేయర్‌లోకి వెళ్లి సర్వే నంబర్‌పై క్లిక్‌చేస్తే, ఆ సర్వేనంబర్‌లో ఉన్న భూమి విస్తీర్ణం అంతా తెలుస్తుంది. ఈ సర్వేనంబర్‌కు ఉన్న బై నంబర్లను కూడా తెలుసుకోవచ్చు. భువన్ ఎల్‌యూఎల్సీ (50కె) 2011-12 లో క్లిక్‌చేస్తే విలేజ్ మ్యాప్‌పై రంగులు వస్తాయి. కంప్యూటర్‌లో మరోపక్క ఆ రంగులు దేనిని చూపిస్తాయో సూచనలుంటాయి. దీని ద్వారా సదరు భూమి అర్బన్‌లో ఉందా? రూరల్‌లో ఉందా? మూనింగ్‌లో ఉందా? వ్యవసాయ పంటలు పండిస్తున్నారా? పంట ఏమైనా ఉందా? ఫారెస్ట్ ప్లాంటేషన్ ఉందా? ఇలా 28 రకాల వర్గీకరణలు కనిపిస్తాయి.

- 'ధరణి' వెబ్‌సైట్ ద్వారా ఇకనుంచి భూమి యజమానులు తమ భూములకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలను మీ- సేవ నుంచి పొందే అవకాశాన్ని కల్పించారు.
- భూమికి సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే గ్రీవెన్సెస్ ఆప్షన్ క్లిక్‌చేసి దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో దరఖాస్తుదారు పేరు, తండ్రిపేరు, జెండర్, ఈ మెయిల్ ఐడీ, అడ్రస్ ఫిలప్ చేయాలి, సమస్య ఏమిటో స్పష్టంగా భర్తీచేసి, ఎవరికి దరఖాస్తు చేస్తున్నామో ఆ కాలాన్ని కూడా సెలక్ట్ చేసి సబ్మిట్ చేయాల్సిఉంటుంది. ఇందులో సమస్యను రెండువేల క్యారక్టర్లకు మించకుండా అప్‌లోడ్ చేయాలి. అలాగే జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, గ్రామంపేర్లతోపాటు భూమి ఖాతానంబర్‌కానీ సర్వేనంబర్‌కానీ నమోదుచేయాలి. ధరణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, అవసరమైతే గ్రామ నక్షా, పాత భూమి రికార్డుల ఆధారంగా సమస్యను పరిష్కరిస్తారు. అలాగే ఈ వెబ్‌సైట్‌ను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్‌ను కూడా కోరుతున్నది. సలహాలను రెండు వందల క్యారెక్టర్లకు మించకుండా ఇవ్వవచ్చు.

నైపుణ్య గ్రామీణ భారతమే లక్ష్యం

- గ్రామీణ సంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు భేష్
- స్వర్ణభారత్‌ట్రస్ట్ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- అతిథులుగా హాజరైన కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ భారతాన్ని నైపుణ్య భారత్‌గా మార్చడమే స్వర్ణభారత్‌ట్రస్టు లక్ష్యమని, పేదలు, రైతులు, మహిళల అభివృద్ధే ట్రస్ట్ ప్రధా న ఆశయమని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సమాజసేవ కోసం ప్రతిఒక్కరూ సమయాన్ని కేటాయించాలని, సేవచేయడంలో ఉండే ఆనందం మరెందులోనూ లభించదన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో స్వర్ణభారత్‌ట్రస్టు హైదరాబాద్ చాప్టర్ రెండో వార్షికోత్సవం, సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఉపరాష్ట్రపతితో పాటు కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు సమిష్టి కృషి అవసరమని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా యువతకు పిలుపునిచ్చారు. గ్రామీణ సంప్రదాయాల పరిరక్షణకు సీఎం కేసీఆర్ చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాలు ఎంతో తోడ్పడుతున్నాయని ప్రశంసించారు. భాషా పరిరక్షణ, బతుకమ్మ వంటి పండుగలకు విశ్వవ్యాప్తంగా కీర్తి తీసుకురావడానికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. దేశ మూలభావన అయిన భిన్నత్వంలో ఏకత్వానికి స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రతీక అని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ద్వారా భవిష్యత్‌లో ఎంతో మంది లబ్ధిపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వినీదత్, మాజీ డీజీపీ దినేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో స్వర్ణభారత్‌ట్రస్టు హైదరాబాద్ చాప్టర్ వార్షికోత్సవం, సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్

ఏకగ్రీవాల వెల్లువ

మొదటిపేజీ తరువాయి...

నామినేషన్ల స్వీకరణ ఆదివారం ముగిసింది. ఆయా ప్రాంతాల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు బారులుతీరారు. దీంతో రాత్రి వరకు నామినేషన్లు స్వీకరించారు. సోమవారం ఈ నామినేషన్లను పరిశీలించి, అర్హత సాధించిన నామినేషన్ల జాబితాను సాయంత్రం విడుదల చేయనున్నారు. తొలివిడుతలో ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో.. సింగిల్ నామినేషన్లు దాఖలయిన గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎన్నికైనవారికి పలుచోట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ఏకగ్రీవాలైన పలుగ్రామాల్లో పాలకవర్గాల ప్రమాణస్వీకారాలు కూడా మొదలయ్యాయి.

ఉమ్మడి జిల్లాల్లో ఏకగ్రీవాలైన గ్రామాలు

కరీంనగర్

పెద్దపల్లి జిల్లాలో నాలుగు గ్రామాలు ఏకగ్రీవం కాగా అందులో అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి, ముత్తారం మండలంలోని ఓడేడు.. జగిత్యాల జిల్లాలో ఏకగ్రీవమైన పది గ్రామాల్లో సారంగాపూర్ మండలంలోని భీమిరెడ్డిగూడెం, ధర్మనాయక్‌తండా, వడ్డెరకాలనీ.. బీర్పూర్ మండలం కందెనకుంట.. వెల్గటూరు మండలం సూరారం, ధర్మపురి మండలం గోవింద్‌పల్లి, బూనుగుపల్లి, ఆకుసాయిపల్లి. ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో బోయినపల్లి మండలం కోరెం, నర్సింగాపూర్‌తోపాటు 13, కరీంనగర్ జిల్లాలో 4 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి..

వరంగల్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 33 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో భూపాలపల్లి మండలంలోని అముదాలపల్లి, వదినపల్లి, నేరేడుపల్లి.. చిట్యాల మండలంలోని కొత్తపేట, చైన్‌పాక, తాళ్లపల్లి, బావుసింగ్‌పల్లి, నావాపేట, వరికోల్‌పల్లి, తైలాపూర్, మొగుళ్లపల్లి మండలం పిరసిల్ల, పెద్ద కోమటిపల్లి.. రేగొండ మండలంలోని పెద్దపల్లి, దమ్మన్నపేట, చెన్నాపూర్, చెంచుపల్లి, పొనగల్లు, రేపాకపల్లి, దుంపిల్లపల్లి.. టేకుమట్ల మండలంలోని గుమ్మడిపల్లి, అసిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, మందలూరిపల్లి ఉన్నాయి. వరంగల్ గ్రామీణ జిల్లాలో ఏకగ్రీవమైన 45 గ్రామాల్లో దుగ్గొండి మండలంలో 9 గ్రామాలు, నర్సంపేట మండలంలో 6 గ్రామాలు, సంగెం మండలంలోని కాపుల కానిపర్తి, బిక్యానాయక్ తండా, ఎల్గూర్ స్టేషన్, కొత్తగూడెం, సోమలతండా, పెద్ద తండా, గాంధీనగర్, షాపూర్ గ్రామాలున్నాయి. మరోవైపు వరంగల్ అర్బన్‌లో 10 గ్రామాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. జనగామ జిల్లాలో 18 పంచాయతీలు ఏకగ్రీమవయ్యాయి. నర్మెట్ట మండలంలో 5, తరిగొప్పుల మండలంలో మూడు, బచ్చన్నపేట మండలంలో నాలుగు, లింగాల ఘనపురం మండలంలో నాలుగు, జనగామ పరిధిలో రెండు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో 31 గ్రామాలు ఏకగ్రీవం కాగా, గార్ల మండలం సినీరెడ్డిగూడెం, బుద్దారం, సత్యనారాయణపురం, గార్ల, బయ్యారం మండలం నామాలపాడు, కోటగడ్డ, మొట్ల తిమ్మాపురం, గంగారం మండలంలోని గంగారం, కొడిశలమిట్ట, బావురుగొండ, చింతగూడెం, జంగాలపల్లి, పూనుగొండ్ల, మడగూడెం, కామారం ఏకగ్రీవమయ్యాయి.

ఖమ్మం

ఖమ్మం జిల్లాలో 21, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. నేలకొండపల్లి మండలం ముజ్జిగూడెం, అప్పలనర్సింహాపురం, తిరుమలాపురంతండా, సుద్రేపల్లి.. తిరుమలాయపురం మండలంలోని సోలిపురం.. ముదిగొండ మండలంలోని మేడేపల్లి, గోకినపల్లి.. కూసుమంచి మండలంలోని గోరీల్లతండా, కొత్తూరు, దర్మతండా.. ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి ఏకగ్రీవాలయ్యాయి.

నిజామాబాద్

కామారెడ్డి జిల్లాలో రామారెడ్డి మండలంలోని గోకుల్‌తండాతోపాటు 30 గ్రామాలు, నిజామాబాద్‌లో 35 గ్రామాలు పోటీలేకుండా పాలక మండళ్లను ఎన్నుకొన్నాయి.

మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ జిల్లాలో 43 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. కృష్ణా మండలంలోని గురజాల, అలంపల్లి, మురహరిదొడ్డి, ఐనాపూర్.. మాగనూరు మండలంలోని ఉజ్జెల్లి, గురువావులింగంపల్లి.. మరికల్ మండలంలోని అయ్యవారిపల్లి, పలుగుతండా, నక్కానుకుంటతండా, మోడీపూర్, చిన్నాగాల్పేడు, నల్లవెల్లి, అచార్యాపూర్, శేరివెంకటాపూర్, అనంతాపూర్, గంగానాయక్ తండా, ఎల్లారెడ్డిపల్లి, హనుమాన్‌గడ్డతండా, కన్మనూర్, కోయిల్‌కొండ, అయ్యవారిపల్లి.. నారాయణపేట మండలంలోని సింగారం, వందర్‌గుట్ట తండా, బోయిన్‌పల్లి, దామరగిద్ద మండలం కొంసన్‌పల్లి, శుద్దబండతండా, దామరగిద్ద తండా.. ధన్వాడ మండలంలోని బుడ్డమర్రితండాలు.. నాగర్‌కర్నూలు జిల్లాలో 37 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. లింగాల మండలంలో 9, బల్మూర్ మండలంలో 5, ఆమ్రాబాద్ మండలంలో 2, పదర మండలంలో 2, అచ్చంపేట మండలంలో 10, వంగూరు మండలంలో 5, ఉప్పునుంతల మండలంలో 4 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. అచ్చంపేట మండలం అత్తారం, బత్తలింగాయపల్లి, మల్లెవారిపల్లి, జోగ్యతండా, చేదుబావితండా, పద్మారంతండా, ఎద్దుమిట్ట తండా.. లింగాల మండలంలో అప్పాపూర్, పద్మన్నపల్లి, చెన్నంపల్లి, మగ్దూంపూర్, బాకారం, మల్లోనిచెరువుతండా, కొత్తచెరువుతండా, షూరాపూర్, శ్రీరంగాపూర్ పంచాయతీలు.. ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి, మామిళ్లపల్లి, తిప్పాపూర్, తాడూరు.. వంగూరు మండలంలోని వెల్మలపల్లి, కోనేటిపూర్, సర్వారెడ్డిపల్లితండా, బైర్మాన్‌పల్లి. పెంజర్ల, తిప్పారెడ్డిపల్లి, సాకలిగుడిసెలు, బల్మూరు మండలంలోని నర్సాయిపల్లి, అంబగిరి, చెన్నారం, అనంతవరం ఏకగ్రీవమయ్యాయి. వనపర్తి జిల్లాలో 17 గ్రామాలు ఏకగ్రీవం కాగా, ఒక్క ఖిలా ఘనపురం మండలంలో 13 పంచాయతీలు ఏకతాటిపై నిలిచాయి. కర్జితండా, శాపూర్, సెల్కాపురం, ఈర్లతండా, అల్లమయిపల్లి, తిర్మలాయపల్లి, అంతాయిపల్లి, సురాయిపల్లితోపాటు మరిన్ని గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. అమరచింత మండలం చింతరెడ్డిపల్లి, మిట్టనందిమల్ల, ఈర్లదిన్నె, నందిమల్ల క్రాస్‌రోడ్, కిష్టంపల్లి, వనపర్తి మండలంలోని చిట్యాల తూర్పు తండా, పడమటతండా, గోపాల్‌పేట మండలం లక్ష్మీతండా పంచాయతీలు ఏకగ్రీవంగా నిలిచాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 30 గ్రామాలు పోటీలేకుండా ఎన్నికయ్యాయి. ధరూర్ మండలం బూరెడ్డిపల్లి, ఓబులేనిపల్లి, దేగదొడ్డి, మన్నాపురం, నీలాహళ్లి, మల్‌దొడ్డి, కోతులగిద్ద, నాగర్‌దొడ్డి, పర్చర్ల, గూడెందొడ్డి, తెల్గొనిపల్లి, పరమాల, గిన్నెడబండ.. కాలూరు తిమ్మన్‌దొడ్డి మండలం మల్లాపురం, సోంపురం, సుల్తానాపురం, పాగుంట, గంగన్‌పల్లి, ఉమిత్యాలతండా, తూర్పుతండా, పూజారితండా, గట్టు మండలం ఆరగిద్ద, పెంచికలపాడు, రాయపురం, తుమ్మల చెరువు, ముత్తోనిపల్లి, తారాపురం, చిన్నోనిపల్లి ఏకగ్రీవమయ్యాయి.

ఆదిలాబాద్

నిర్మల్ జిల్లాలో 57 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మామడ మండలంలో 13 పంచాయతీలు, లక్ష్మణచాంద మండలంలో నాలుగు, కడెం మండలంలో 9, ఖానాపూర్ మండలంలో 10, పెంబి మండలంలో 20 పంచాయతీలు, దస్తురాబాద్ మండలంలో రెండు పంచాయతీలు ఏకగ్రీవంగా నిలిచాయి. ఆదిలాబాద్ జిల్లాలో 50 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో భీంపూర్ మండలంలో 15 పంచాయతీలు, తాంసీ మండంలో 8, జైనథ్ మండలంలో ఆరు పంచాయతీలు ఉన్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 18 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కౌటాల మండలంలోని తలోడి.. పెంచికల్‌పేట మండలంలో ఆడేపల్లి.. సిర్పూర్ టీ మండలంలో నవేగాం.. దహెగాం మండలంలోని ఐనం, రాంపూర్, దిగిడ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మంచిర్యాల జిల్లాలో 5 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.

నల్లగొండ

నల్లగొండ జిల్లాలో 52, సూర్యాపేట జిల్లాలో 16, యాదాద్రి జిల్లాలో 20 ఏకగ్రీవమయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాల మండలం వెంకట్రామపురం, నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడు ఏకగ్రీవమయ్యాయి.

మెదక్

మెదక్ జిల్లాలో 32, సిద్దిపేటలో 21, సంగారెడ్డిలో 23 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.

రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి 4 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. షామీర్‌పేట మండలం బైర్‌కాన్‌పల్లి, పెంజర్ల, మూడు చింతలపల్లి గ్రామాలు వీటిలో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 20, వికారాబాద్ జిల్లాలో 33 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.

తొలి విడతలో ఏకగ్రీవాలు..

జిల్లా పేరు	ఏకగ్రీవాలు
మెదక్	32
సిద్దిపేట	21
సంగారెడ్డి	23
మేడ్చల్	4
రంగారెడ్డి	20
వికారాబాద్	33
ఆదిలాబాద్	50
నిర్మల్	57
కామారెడ్డి	30
నిజామాబాద్	35
ఖమ్మం	21
భద్రాద్రి కొత్తగూడెం	21
నల్లగొండ	52
సూర్యాపేట	16
యాదాద్రి భువనగిరి	20
మహబూబ్‌నగర్	43
నాగర్‌కర్నూల్	37
వనపర్తి	17
జోగుళాంబ గద్వాల	30
వరంగల్ అర్బన్	10
వరంగల్ రూరల్	45
జనగామ	18
మహబూబాబాద్	31
జయశంకర్	33
కరీంనగర్	4
జగిత్యాల	10
పెద్దపల్లి	4
సిరిసిల్ల	13
మంచిర్యాల	5
కుమ్రం భీం ఆసిఫాబాద్	18



కోరెం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చెన్నాడి రాజ్యలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నర్సింగాపూర్‌లో సర్పంచ్ ప్రేమ్ సాగర్‌రావును ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే రవిశంకర్

కోరెం సర్పంచ్‌గా ఎంపీ వినోద్ అత్త

- ఏకగ్రీవంగా ఎన్నికైన చెన్నాడి రాజ్యలక్ష్మి

బోయినపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామ సర్పంచ్‌గా కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ అత్త చెన్నాడి రాజ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెతోపాటు పదిమంది వార్డుసభ్యులను ఆదివారం గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోరెం సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో చెన్నాడి రాజ్యలక్ష్మితోపాటు మరో నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం రాజ్యలక్ష్మి మినహా మిగతావారు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో సర్పంచ్‌గా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఉమారాణి ప్రకటించి.. ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రాజ్యలక్ష్మికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

నర్సింగాపూర్ సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ప్రేమ్‌సాగర్‌రావు

బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ పంచాయతీ సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి ప్రేమ్‌సాగర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా నామినేషన్లు దాఖలుచేసిన నలుగురిలో ముగ్గురు ఉప సంహరించుకోవడంతో ప్రేమ్‌సాగర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ప్రేమ్‌సాగర్‌రావును అభినందించిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్.. నర్సింగాపూర్‌కు రూ.15 లక్షలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు.

గద్వాల ఎమ్మెల్యే భార్యకు సర్పంచ్ యోగం



జ్యోతి (ఫైల్)

ధరూర్: జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని బురెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే స్వగ్రామం బురెడ్డిపల్లి పంచాయతీని జనరల్ మహిళకు కేటాయించగా ఆరుగురు నామినేషన్లు దాఖలుచేశారు. వీరంతా ఎమ్మెల్యేకు సమీప బంధువులే. వారంతా గ్రామాభివృద్ధిని కాంక్షించి జ్యోతికి అవకాశం ఇచ్చి బరిలో నుంచి తప్పుకోవడంతో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది.

టీఈ-పోల్ యాప్‌తో ఓటరు స్లిప్పులు



తొలిసారిగా అమలుచేస్తున్న ఎన్నికల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొలిసారిగా ప్రవేశపెట్టిన టీఈ-పోల్ యాప్ ద్వారా ఓటరు స్లిప్పులు కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల ప్రక్రియను మొత్తం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో నిర్వహిస్తున్నామన్నారు. తొలిసారిగా మన రాష్ట్రంనుంచే నూతనంగా టీఈ-పోల్ సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు ఏ ఎన్నికల్లో ఇలాంటి ప్రయోగం చేయలేదు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా టీఈ-పోల్ సాఫ్ట్‌వేర్ పనిచేస్తుందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ప్రధానంగా ఓటర్లకు ఇబ్బందులు రాకుండా ఓటరు స్లిప్పులను పొందే ఏర్పాట్లుచేసింది. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్‌లోనుంచి TE-POLL APP ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అనంతరం జిల్లా, ఓటరు ఎపిక్ నంబర్‌ను ఎంటర్ చేసి ఓటరు స్లిప్పులు డౌన్‌లోడ్ చేసుకోవాలని అశోక్‌కుమార్ వివరించారు. టీఈ-పోల్ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రంనుంచే తొలిసారిగా వినియోగిస్తున్నారు. మాన్యువల్‌గా ఉండే పద్ధతి కాకుండా గ్రామ, మండల, జిల్లాస్థాయిలో ఓటర్ల జాబితా, సప్లిమెంటరీ జాబితా, ఓటుహక్కు ఎప్పుడు కల్పించారనే వివరాలను ఈ సాఫ్ట్‌వేర్‌లో అందుబాటులో ఉంచారు. ఈ యాప్‌ను https://play.google.com/store/apps/details?id=com.cgg.gov.in.te_polltelugu లో అందుబాటులో ఉన్నదని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ చెప్పారు.



గ్రామ స్వరాజ్యం



ఆత్మనగర్ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న ఇస్కాన్ శ్రీనివాస్

సర్పంచ్ బరిలో ఇస్కాన్ కృష్ణభక్తుడు

భగవంతుడి సేవ నుంచి ప్రజాసేవ మార్గంలోకి..

మెట్‌పల్లి రూరల్: ఉన్నత చదువు.. ఉన్నతోద్యోగం.. అయినా తెలియని అసంతృప్తి. ఆనందకర జీవనానికి భగవంతుడి సేవే మార్గమని భావించి ఇస్కాన్‌లో చేరి కృష్ణభక్తుడయ్యాడు. మానవసేవయే మాధవసేవగా నమ్మే ఈ గిరిజన యువకుడు.. ప్రజాసేవలో అంకితమవ్వాలని నిర్ణయించుకొని ప్రస్తుతం సర్పంచ్‌గా ఎన్నికల బరిలో నిలిచాడు. ఆయనే జగిత్యాల జిల్లా మెట్‌పలి మండలం ఆత్మనగర్‌కు చెందిన జరుపుల శ్రీనివాస్‌కుమార్. ఎంబీఏ ఫైనాన్స్ చదివి ఓ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా 2006లో ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. ఐదంకెల జీతం అందుతున్నా ఏదో తెలియని అసంతృప్తి ఆయనను ఇస్కాన్ వైపు నడిపించింది. 2012లో హరేకృష్ణ భక్తుడిగా మారాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రీనివాస్ స్వస్థలం ఆత్మనగర్ సర్పంచ్ పదవి ఎస్టీలకు రిజర్వ్ కావడంతో.. ప్రజాసేవలో పునీతమై యువతకు అండగా నిలువాలని నిర్ణయించుకొన్నాడు. గ్రామానికి చెందిన యువకులతో కలిసి సర్పంచ్ స్థానానికి నామినేషన్ సమర్పించాడు.

సోపానం

సర్పంచ్ నుంచి మండలి డిప్యూటీ చైర్మన్ దాకా

అంచెలంచెలుగా ఎదిగిన నేతి విద్యాసాగర్‌రావు



కేతేపల్లి: శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ సర్పంచ్‌గానే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చెర్కుపల్లి గ్రామానికి చెందిన నేతి విద్యాసాగర్ 1956 జూన్ 29న భిక్షమయ్య, రాధమ్మ దంపతులకు జన్మించారు. గ్యాడ్యుయేట్ విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యాసాగర్ 1982 నుంచి 1987 వరకు చెర్కుపల్లికి సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన తన హయాంలో గ్రామంలో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య నిర్మూలన తదితర పనులు చేశారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీలో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పలు కీలక పదవులు నిర్వహించారు. 2007లో తొలిసారి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొంది 2009వరకు పనిచేశారు. తిరిగి 2009లో రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికై 2011లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా నియామకమయ్యారు. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేతేపల్లి మండలానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరి రాష్ట్ర తొలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2015లో ఎమ్మెల్సీగా పదవీ కాలం పూర్తి కావడంతో.. తిరిగి 2015లో ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రస్తుతం డిప్యూటి చైర్మన్ పదవిలో కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం 2021లో ముగియనున్నది.

> గ్రామాల్లో వేలంపాటలు వేస్తున్నట్లు ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే ఆ ఎన్నికను రద్దుచేస్తాం.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకొంటాం..
>
> – రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

నిర్వహించిన వ్యక్తులకు ఏడాది జైలుశిక్ష

'వేలం' నిర్వహిస్తే ఎన్నిక రద్దు



పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీ నాగిరెడ్డి

- వేలం పాటలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేయాలి
- పంచాయతీ ఎన్నికల్లో ధనప్రవావం తగ్గిస్తాం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ:

ఏకగ్రీవాల పేరుతో గ్రామాల్లో వేలంపాటలు నిర్వహిస్తే ఆ ఎన్నికను రద్దుచేయడంతోపాటు వేలంపాట నిర్వహించిన వ్యక్తులపై న్యాయవిచారణ జరిపి ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీ నాగిరెడ్డి హెచ్చరించారు. సూర్యాపేట జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆదివారం జిల్లా కేంద్రంలో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడుత పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ప్రకటించారు. సంక్రాంతి సెలవు రోజుల్లో కూడా సిబ్బంది ఎన్నికల నిర్వహణ కోసం పనిచేయడం హర్షణీయమని పేర్కొన్నారు. గ్రామాల్లో వేలంపాటలు వేస్తున్నట్లు ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఆ ఎన్నికను రద్దుచేస్తామన్నారు. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని గణనీయంగా తగ్గిస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో ఎన్నికల ఖర్చుల సమాచారం ఎక్కువగా ఎంపీడీవోలకే ఉంటుందని, ఆ ఖర్చును నియంత్రించే బాధ్యతను ఎంపీడీఓలకే అప్పగించామని పేర్కొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీచేసే వారి ఖర్చుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేస్తే అభ్యర్థి ఎన్నికను రద్దుచేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినవారిపై కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో భారీగా పోలింగ్‌శాతం నమోదయ్యేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నాగిరెడ్డి తెలిపారు. వెలుతురు లేని పోలింగ్ బూత్‌లలో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలని సూర్యాపేట కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం చివ్వెంల మండల కేంద్రంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలుసూచనలు చేశారు. పంచాయతీ ఎన్నికలలో పీవోలు, ఏపీవోలదే కీలకపాత్ర అని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి చిరంజీవులు, కలెక్టర్ అమేయ్‌కుమార్, ఎస్పీ వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ సంజీవరెడ్డి, డీఆర్వో చంద్రయ్య, సూర్యాపేట, కోదాడ ఆర్డీవోలు మోహన్‌రావు, కిశోర్‌కుమార్, డీపీవో రామ్మోహన్‌రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

3.35 లక్షల నగదు స్వాధీనం

- రూ.16,735 విలువైన మద్యం పట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఒక్కరోజే రూ.3.35 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండగా ఈ నగదును పట్టుకున్నట్టు పేర్కొన్నది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రూ.85 వేలు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ.2.50 లక్షలు పట్టుబడింది. జగిత్యాల జిల్లాలో రూ.3,310 విలువైన మద్యం, కరీంనగర్‌లో రూ.13,425 విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసినట్టు తెలిపింది. ఈ కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేశామని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

ఎన్నికలెరుగని చింతలూరు

> పంచాయతీ ఆవిర్భావంనుంచి ఆరుసార్లూ ఏకగ్రీవమే
>
> ఇదీ జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని పల్లె ప్రత్యేకత

రాయికల్: పంచాయతీ ఆవిర్భావం నుంచి ఎన్నికలెరుగని పల్లెగా ఘనత సాధించింది జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని చింతలూరు గ్రామం. ఒకసారి కాదు.. రెండుసార్లు కాదు.. ఏకంగా ఆరుసార్లూ సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహక నిధులతో గ్రామాభివృద్ధికి బాటలువేస్తూ ప్రగతిపథంలో ముందుకుసాగుతున్నారు. గ్రామ పెద్దలు, యువత, కుల, యువజన సంఘాల ప్రతినిధులు చర్చించుకొని ఆమోదయోగ్యమైన నాయకులను ఎన్నుకొంటున్నారు. ఎన్నికైన వారు కూడా ప్రజలకు సేవచేస్తూ గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బోర్నపెల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న చింతలూరు 1981లో ప్రత్యేక గ్రామపంచాయతీగా ఆవిర్భవించింది. తొలిసారి సర్పంచ్ స్థానాన్ని జనరల్‌కు కేటాయించారు. సర్పంచ్‌గా బద్రీనాయక్‌ను, ఇతరు వార్డుసభ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1988, 1995లో రెండుసార్లు బీసీకి చెందిన అనుపురం లింబగౌడ్, 2001లో ఓరుగంటి మోహన్‌రావు, 2006లో లక్ష్మణ్‌నాయక్, 2013లో కదుర్ల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికై ఘనత సాధించారు. 31 ఏండ్లుగా గ్రామస్థులంతా కలిసి ఆరుసార్లు సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పంచాయతీ ఏర్పడ్డప్పటినుంచి గ్రామంలో సర్పంచ్, వార్డుసభ్యులను ఎన్నుకొనేందుకు ఓటింగే జరుగలేదు. తాజా మాజీ సర్పంచ్ లక్ష్మి.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా నగదు ప్రోత్సాహాన్ని అందుకున్నారు. చింతలూరు గ్రామానికి అనుబంధంగా ఉండే బషీర్‌పల్లెతో కలిపి 900 జనాభా ఉండగా, 650 మంది ఓటర్లు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.10 లక్షలు, స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇచ్చే మరో రూ.10 లక్షల నిధులతో గ్రామాన్ని అభివృద్ధిపర్చుకొనేందుకు ప్రస్తుతం కూడా చింతలూరును ఏకగ్రీవం చేసేందుకు గ్రామస్థులు ప్రయత్నిస్తున్నారు.



చింతలూరు



40% మొదటి విడతలో 40 శాతానికి పైగా యువకుల నామినేషన్లు

పలు గ్రామాల్లో సర్పంచ్‌లుగా ఏకగ్రీవమవుతున్న యువత

ఓవైపు ఉన్నతోద్యోగాలు..మరోవైపు సామాజికసేవతో ప్రేరణ

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

తొలివిడుతలో యువతదే ఆధిక్యం

యువత.. దేశ సంపద. తమ వినూత్న ఆలోచనలతో విభిన్న ఆవిష్కరణలు చేస్తున్నారు. ఒక వైపు ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తూనే.. సామాజికసేవ వైపు కూడా అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో రాణించాలనే కోరికతో ఉన్న యువతకు ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు సోపానాలుగా నిలిచాయి. ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో యువత ఎక్కువ సంఖ్యలో పోటీపడుతున్నది. గతంలో ఎన్నడూ లేనంతగా 40 శాతం యువకులు పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచారు. మొదటి విడుత ఎన్నికలు జరుగుతున్న 153 పంచాయతీల్లో.. 62 మంది యువకులు పోటీ పడుతున్నారు. తర్వాతి రెండు విడుతల్లో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. మొదటి విడుతలో 39 పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉండగా.. వీటిల్లో 23 మంది యువకులు ఉండటం విశేషం.

మొదటి విడుత ఎన్నికలు జరుగుతున్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని 34 పంచాయతీలకుగానూ హత్తిగుట్ట, చచిధరి, ఖండాల, లోహరా, ఆసోద, లింగుగూడ, అంకాపూర్, మలేబోర్గాం, చిట్యాలబోరి, చాంద, జందాపూర్, భీంసరి, రామాయి, లాండసాంగ్వి, అర్లి, పొచ్చరతోపాటు మావల మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో యువకులు సర్పంచ్ పదవి కోసం పోటీపడుతున్నారు. జైనథ్ మండలంలో 42 పంచాయతీలుండగా.. మారుగూడ గ్రామంలో యువకుడు వెలాది శ్రీరాం ఏకగ్రీవమయ్యే అవకాశాలున్నాయి. ఇదే మండలంలోని జైనథ్, నిరాల, లక్ష్మీపూర్, తరోడ, బాలాపూర్, బెల్లూరి, కాప్రి, ఆనంద్‌పూర్, పెండల్‌వాడ, సావాపూర్, గిమ్మ గ్రామాల్లో కూడా యువకులు పోటీలో ఉన్నారు.బేల మండలం పరిధిలోని డోక్సాల, జునోనిలో ముగ్గురు, పాతన్‌లో ఇద్దరు, శంషాబాద్, బేల, ఎకోరీ, భవానీగూడ, మణియార్‌పూర్‌లలో ఒక్కరు చొప్పున పోటీచేస్తున్నారు. భీంపూర్ మండలంలోని కరంజి (టీ), గోముత్రి, అంతర్గాం, అర్లి(టీ), వడూర్, గొల్లఘడ్, తాంసి(కే), పిప్పల్‌కోటిలో పలువురు యువకులు పోటీపడుతున్నారు. ధనోర, భీంపూర్, అందర్‌బంద్, గుబిడిపల్లి, గుంజాల, కామట్‌వాడలో యువకులే సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. తాంసి మండలంలో ఏకగ్రీవమవుతున్న తాంసి, అంబుగాం, లింగుగూడ, పాలోడి గ్రామాల్లో సర్పంచ్‌లుగా యువతే ఉన్నారు. అలాగే కప్పర్ల, పొన్నారి, వడ్డాడి, హస్నాపూర్, గిరిగాంలలో కూడా యువత బరిలో నిలిచారు.



యువత ఏదైనా సాధిస్తుంది

యువతలో పట్టుదల, అంకితభావం ఎక్కువగా ఉంటుంది. ఏ పనినైనా ఉత్సాహంగా, సమర్థంగా నిర్వహించగలుగుతారు. యువత సర్పంచ్‌లుగా ఎన్నికైతే గ్రామాలు బాగుపడటం ఖాయం. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొనిపోయి పరిష్కరించే అవకాశాలున్నాయి.

– కోడే విపిన్, శంషాబాద్



మంచి పరిణామం

రాజకీయాల్లోకి యువత రావడం మంచి పరిణామం. భర్త, అత్తామామల ప్రోత్సాహం ఉన్నది. పొదుపు సం ఘాల ఆర్థిక పరిపుష్టికి కృషిచేశా. కలెక్టర్‌కు పలు సమస్యలపై ఆర్జీలు ఇచ్చి పరిష్కారానికి కృషిచేశా. మా ఊరిని అభివృద్ధి చేయాలన్న ఆరాటంతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచాను.

– గుర్ల స్వాతిక, కరంజి(టీ)



యువకుడిగా ఎంతో సాధించా

పసుపుతోపాటు ఇతర పంటల్లో ఆదర్శంగా నిలిచిన మా గ్రామంలో పంటల పరిశీలనకు అంకాపూర్‌తోపాటు పలు జిల్లాల రైతులు వస్తుంటారు. ఓ యువకుడిగా ఇది సాధించా. సర్పంచ్‌గా ఎన్నికైతే మరింత ప్రగతి చేస్తా, ఖచ్చితంగా ఆదర్శ గ్రామంగా నిలుపుతా.

– బక్కి అజయ్‌యాదవ్, ధనోరా

గూడేలకు మహర్దశ

మారనున్న రూపురేఖలు

- ఏకగ్రీవమయ్యేందుకు సమాయత్తం
- రాష్ట్రప్రభుత్వ చొరువతో అభివృద్ధిదిశగా అడుగులు

ఇల్లెందు, నమస్తే తెలంగాణ: అభివృద్ధికి దూరంగా ఉన్న గూడెలు, తండాలకు కేసీఆర్ సర్కార్ జీవం పోసింది. ఉమ్మడి పంచాయతీల్లో నిర్లక్ష్యానికి గురైన గూడేలకు నేడు మహర్దశపట్టింది. ఒకప్పుడు గూడేలవాసులు పంచాయతీకేంద్రానికి వెళ్లాలంటే మైళ్లదూరం ప్రయాణించవలిసి వచ్చేది. అందుకోసం రవాణాసదుపాయం కూడా ఉండేదికాదు. వాగులు వంకలు దాటుకుంటూ వెళ్లాల్సి వచ్చేది. కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గూడేలను, తండాలను పంచాయతీలుగా ప్రకటించడంతో అభివృద్ధికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. త్వరలో జరుగుబోయే పంచాయతీఎన్నికల్లో తండావాసులు స్వయంపాలన చేసుకోనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని దొంగతోగు, అడవి రామవరం గూడేలే అందుకు ఉదాహరణ. ఒకప్పుడు దొంగతోగు గ్రామం గుండాల పంచాయతీలో ఉండేది. అడవి రామవరం గ్రామం సాయన్నపల్లి పంచాయతీపరిధిలో ఉండేది. ఈ గ్రామాలకు రహదారి కూడా ఉండేది కాదు. ఎడ్లబండ్లే వారికి రవాణా సదుపాయాలు. ప్రాణాప్రాయం మీదకు వచ్చినప్పుడే గుండాల మండల కేంద్రానికి అతికష్టం మీద చేరుకునేవారు. గర్భిణులు ప్రసవం కోసం ఎడ్లబండిపై వాగులు దాటుతూ గుండాల మండల కేంద్రానికి చేరుకొనేవారు.

కేసీఆర్ చొరువతో మారిన రూపురేఖలు

- కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక తండాలు, గూడేలపై ప్రత్యేకదృష్టి సారించి వాటిని పంచాయతీలుగా ఏర్పాటుచేశారు.
- దీంతో అందులో భాగంగా అటవీ అంచున ఉన్న గూడేలన్నింటినీ పంచాయతీలు చేశారు. జనాభాతో సంబంధం లేకుండా చట్ట సవరణ చేశారు. దీంతో 34 మంది ఓటర్లున్న దొంగతోగు గ్రామం, 61 మంది ఓటర్లున్న అడవిరామవరం గ్రామాలు పంచాయతీలుగా మారాయి.
- పంచాయితీలుగా అవతరించిన గూడేలాన్ని ఏకగ్రీవానికి మొగ్గు చూపుతున్నాయి. పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే ప్రత్యేకనిధులు రానుండటంతో గ్రామస్థులు ఏకగ్రీవం చేసుకోవడానికే ఇష్ట పడుతున్నారు.

ఏకగ్రీవం చేసుకుంటాం



మా గూడెం పంచాయతీ అయినందుకు ఆనందంగా ఉన్నది. ప్రభుత్వం మా మీదా దయచూపింది. అడవీలో ఉంటున్న మా గ్రామానికి వెలుగును నింపింది. బక్కచిక్కిన మా గ్రామానికి పునర్జీవం పోసింది. ఏకగ్రీవం చేసుకొనేందుకు మేమంతా తీర్మానించుకున్నాం. ప్రత్యేక నిధులతో గూడేన్ని అబివృద్ధి చేసుకుంటాం.

– బచ్చల బాలయ్య, దొంగతోగు గూడెం

వెలుగులోకి వచ్చాం



ఒకప్పుడు మేమున్నామని ఎవరికీ తెలియదు. అసలు మా దగ్గరికి ఎవరు వచ్చిపోయే వారు కాదు. ఇప్పుడు మేమున్నామని గుర్తించారు. నాడు మా దగ్గరికి అధికారులు వచ్చిన దాఖలాలు లేవు. కనీసం రేషన్ బియ్యం కూడా తీసుకోలేదు. ఇప్పుడిప్పుడే మా వద్దకు పథకాలు వస్తున్నాయి. ఇంతలోనే పట్టరాని సంతోషం వచ్చింది. మా గూడెం పంచాయతీ అయిందని తెలిసింది. అధికారులు వచ్చిపోతున్నారు. చాలా సంతోషంగా ఉన్నది.

– ఎట్టి లక్ష్మీ, అడవి రామవరం గూడెం

ఫుట్‌బాల్ దిగ్గజం అస్తమయం



హైదరాబాద్ ఫుట్‌బాలర్ జుల్ఫీకరుద్దీన్ ఇకలేరు

వృద్ధాప్య సమస్యలతో మృతి చెందిన ఒలింపియన్

జాతీయ జట్టుతోపాటు 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కెప్టెన్‌గా పన్నెండేండ్లపాటు సేవలు..

అద్భుతమైన కోచ్‌గా ప్రశంసలు దక్కించుకున్న మాజీ ఫుట్‌బాల్ స్టార్

హైదరాబాద్: మాజీ ఒలింపియన్, ఫుట్‌బాల్ దిగ్గజం మహ్మద్ జుల్ఫీకరుద్దీన్(83) ఆదివారం తెల్లవారు ఝామున ఈ లోకాన్ని వీడారు. గత కొన్నేండ్లుగా ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. 1936లో జన్మించిన జుల్ఫీకరుద్దీన్‌కు ముగ్గురు తనయులు, ఇద్దరు కూతుళ్లు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పద్మారావునగర్‌లో కూతురు నివాసంలో తుదిశ్వాస విడిచారు. విదేశాల్లో ఉన్న తనయులు తిరిగి వచ్చిన అనంతరం ఆయన పార్థివదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని ఆయన అల్లుడు బాసిత్ మొయినుద్దీన్ తెలిపారు. 1950వ దశకంలో భారత ఫుట్‌బాల్ జట్టులో ప్రాతినిధ్యం వహించిన ఆరుగురు ఆటగాళ్లలో జుల్ఫీకరుద్దీన్ ఒకరు. హైదరాబాద్ ఫుట్‌బాలర్ల ప్రతిభతో భారత జట్టు అంతర్జాతీయ టోర్నీలలో అదరగొట్టింది. ఈ కాలాన్ని భారత ఫుట్‌బాల్ స్వర్ణయుగంగా చెప్పుకోవడానికి హైదరాబాద్ ఫుట్‌బాల్ దిగ్గజాలే కారణం. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు సెమీస్ చేరుకుంది. అప్పటి జట్టు సాధించిన విజయాల్లో జుల్ఫీకరుద్దీన్‌ది కీలకపాత్ర. డ్రిబ్లింగ్‌లో అపార నైపుణ్యంతో ఎంతో ఒత్తిడిలోనూ గోల్ చేసేవాడని అప్పటి ఆయన సహచరులు చెప్పారు. బల్గేరియాతో జరిగిన సెమీస్ మ్యాచ్‌లో 0-3తో భారత్ ఓడి నాలుగోస్థానం సాధించింది. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రఫత్ హబీబ్, కార్యదర్శి జీ ఫల్గుణ, ఆసియా క్రీడల స్వర్ణపతక విజేత డీఎంకే అఫ్జల్, మాజీ ఒలింపియన్ ఎస్‌ఏ హకీం, మాజీ కెప్టెన్ విక్టర్ అమల్ రాజ్, శాఫ్ మాజీ కోచ్ అలీంఖాన్, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి రంగారావు, ఫుట్‌బాల్ బ్రదర్స్ మహ్మద్ అక్బర్, మహ్మద్ హబీబ్ తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

కెరీర్ సాగిందిలా..

1954లో హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్‌తో ఫుట్‌బాల్‌తో జుల్ఫీకరుద్దీన్ అనుబంధం మొదలైంది. అనంతరం అదే ఏడాదిలో ఆయన ఏపీ పోలీస్‌శాఖలో ప్రవేశించారు. 1956 నుంచి 1957 వరకు పోలీస్ ఫుట్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గావరుసగా జాతీయస్థాయి టోర్నీలో బంగారు పతకాలు సాధించి పెట్టారు. అంతేకాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జట్టుకు 1955 నుంచి పన్నేండ్లపాటు కెప్టెన్‌గా కొనసాగారు. ఫుట్‌బాల్‌లో అద్భుత ప్రదర్శనతో 19 ఏండ్ల వయసులోనే 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో ఆడే భారత జాతీయ జట్టులో చోటు సంపాదించుకున్నారు. అప్పటి ఒలింపిక్స్ జట్టులో ఆరుగురు హైదరాబాదీలే కావడం విశేషం. అంతకుముందుగా మలేషియాలో జరిగిన మెర్డెకా టోర్నీలోనూ జుల్ఫీకరుద్దీన్ ప్రాతినిధ్యం వహించారు. 1953-1963 కాలంలో రాష్ట్ర జట్టు తరపున సంతోష్ ట్రోఫీతోపాటు దేశంలోని ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ డ్యూరాండ్‌తోపాటు రోవర్ కప్‌లోనూ ఆయన ఆడాడు. ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కోచ్‌గానూ జుల్ఫికరుద్దీన్ రాణించారు. ఈ ఫుట్‌బాల్ దిగ్గజం కోచింగ్ నైపుణ్యాలను విమర్శకులూ ప్రశంసించడం విశేషం.



అభినవ్‌షా

పదేండ్లకే పతకం కొట్టాడు..

పుణె: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రికార్డుల పరంపర కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన 10మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంటులో మెహులీ ఘోష్‌తో కలిసి పదేండ్ల అభినవ్‌షా పసిడి పతకం కొల్లగొట్టాడు. ఫైనల్లో పశ్చిమబెంగాల్‌కు చెందిన మెహులీ, అభినవ్ ద్వయం 501.7 స్కోరుతో స్వర్ణ పతకాన్ని ఖాతాలో వేసుకుంది.

పీబీఎల్ - 4 చాంపియన్ బెంగళూరు రాప్టర్స్



బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సీజన్-4లో బెంగళూరు రాప్టర్స్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం ముంబై రాకెట్స్ జట్టుతో జరిగిన ఫైనల్లో 4-3 స్కోరుతో విజయం సాధించింది. బెంగళూరు రాప్టర్స్ జట్టు కెప్టెన్ కిడాంబి శ్రీకాంత్ పురుషుల సింగిల్స్‌లో 15-7,15-10 స్కోరుతో రాకెట్స్ ఐకాన్ షట్లర్ ఆంటోన్‌సెన్‌పై గెలిచి జట్టు చాంపియన్‌షిప్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఇరుజట్లు 3-3 స్కోరుతో సమంగా నిలిచిన దశలో చాంపియన్‌ను తేల్చే కీలక డబుల్స్ మ్యాచ్‌లో మహ్మద్ షాన్, సెతివన్ 15-13,15-10 స్కోరుతో లీయోంగ్ డే, కిమ్ జోంగ్ జోడీపై ఉత్కంఠ విజయంతో రాప్టర్స్ జట్టు సంబురాల్లో మునిగింది.

శుభ్‌మన్‌కు స్వాగతం..



ఆడు మగాడ్రా బుజ్జీ! ఈ తెలుగు సినిమా డైలాగ్‌కు పంజాబీ పుత్తర్ శుభ్‌మన్ గిల్ అతికినట్లు సరిపోతాడు. అవును పువ్వు పుట్టగానే పరిమళించిందన్నట్లు ఊహ తెలియని వయసులోనే క్రికెట్ బ్యాటు పట్టుకున్న గిల్ ఆటనే ప్రాణపదంగా భావించాడు. పరిస్థితులు అనుకూలించకపోయినా క్రికెట్‌పై కొడుకుకున్న మక్కువతో తండ్రి అన్నీతానై ముందుకు నడిపించాడు. తన కంటే పెద్దవారితో పోటీపడటం నేర్చుకున్న శుభ్‌మన్ అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ కల్గిన క్రికెటర్‌గా వెలుగులోకి వచ్చాడు. బరిలోకి దిగితే ప్రత్యర్థికి వణుకే అన్న రీతిలో పరుగుల వరద పారించాడు. రాహుల్ ద్రవిడ్ శిక్షణలో సానబట్టిన వజ్రంలా రాటుదేలిన గిల్.. అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌ను విజేతగా నిలిపాడు. సొగసైన షాట్లతో అలవోకగా పరుగులు కొల్లగొట్టే గిల్ జాతీయ జట్టులోకి దూసుకొచ్చాడు. దేశవాళీ టోర్నీల్లో ఈ పంజాబీ డాషింగ్ బ్యాట్స్‌మన్ ప్రతాపానికి ఫిదా అయిన సెలెక్టర్లు కివీస్‌తో సిరీస్‌కు అవకాశమిచ్చారు. భారత భవిష్యత్ తారగా మన్ననలు అందుకుంటున్న గిల్ అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి అడుగు ఘనంగా వేయాలని ఆశిద్దాం.

న్యూజిలాండ్ పర్యటనకు గిల్ ఎంపిక

భవిష్యత్ తారగా మన్ననలు

(నమస్తే తెలంగాణ క్రీడా విభాగం)

క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే భారత్‌లో ప్రతి వార్త అభిమానులకు ఆసక్తి కల్గించేదే. తమ అభిమాన ఆటకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు ఫ్యాన్స్ ఎప్పుడు మొగ్గుచూపుతూనే ఉంటారు. తాజాగా న్యూజిలాండ్ పర్యటన కోసం పంజాబ్ డాషింగ్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ వార్త కూడా అందరి నోళ్లలో నానుతున్నది. కచ్చితంగా ఏదో ఒక రోజు జాతీయజట్టులోకి వస్తాడనుకున్న ఈ 19 ఏండ్ల పంజాబ్ పుత్తర్ ఇంత తొందరగా తలుపు తట్టడంపై అందరూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. జట్టులోకి కొత్త రక్తాన్ని ఎక్కించేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తున్న సెలెక్షన్ కమిటీ నిర్ణయం మరోమారు అందరినీ ఆశ్చర్యపరిచింది. దేశ క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సుదీర్ఘ కాలం పాటు జట్టుకు సేవలందించగల అద్భుత ప్రతిభ కల్గిన క్రికెటర్లకు సెలెక్టర్లు పట్టం కడుతున్నారు. శుభ్‌మన్‌గిల్ ఎంపిక కూడా అదే కోవలోకి వస్తుందని చెప్పొచ్చు. అవును అండర్-19 ప్రపంచకప్‌తో వెలుగులోకి వచ్చిన గిల్..అనతికాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. 372 పరుగులతో వరల్డ్‌కప్‌లో మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన గిల్..ఐపీఎల్‌లోనూ కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున మెరుపులు మెరిపించాడు. మొత్తం 13 మ్యాచ్‌ల్లో 203 పరుగులు చేశాడు. అంతటితో ఆగకుండా తన సొంత రాష్ట్రం పంజాబ్ తరపున రంజీ ట్రోఫీలో ఐదు మ్యాచ్‌ల్లో 104 సగటుతో ఏకంగా 728 పరుగులు కొల్లగొట్టాడు. ఇందులో తమిళనాడుపై డబుల్ సెంచరీ(268)తో పాటు హైదరాబాద్‌పై(148) సూపర్ సెంచరీ ఉన్నాయి. దాదాపు ప్రతి మ్యాచ్‌లో అర్ధసెంచరీ చొప్పున గిల్ పరుగుల మోత మోగించాడు. ఈ మధ్య జరిగిన న్యూజిలాండ్ పర్యటనలో భారత్ 'ఎ' తరపున అదరగొట్టాడు. ఇప్పుడు అదే కివీస్‌తో పర్యటనకు ఎంపికైన శుభ్‌మన్..తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్నాడు. అద్భుతమైన క్రికెటింగ్ షాట్లతో ఆకట్టుకుంటున్న ఈ కుర్రాడి ఆటకు సీనియర్ క్రికెటర్లు యువరాజ్‌సింగ్, దినేశ్ కార్తీక్ ముగ్ధులవుతున్నారు.

శంకర్, శుభ్‌మన్‌కు పిలుపు

ఆసీస్, కివీస్ సిరీస్‌లకు ఎంపిక

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో మిగిలిన రెండు వన్డేలు, న్యూజిలాండ్‌తో ఐదు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో మార్పులు చోటు చేసుకున్నాయి. ఓ ప్రైవేట్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సస్పెన్షన్ ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ స్థానాలను సెలెక్టర్లు భర్తీ చేశారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు బదులుగా విజయ్ శంకర్‌కు అవకాశం కల్పించగా, ఈనెల 23న మొదలయ్యే కివీస్‌తో సిరీస్ కోసం పంజాబ్ యంగ్‌స్టర్ శుభ్‌మన్ గిల్‌కు తొలిసారి చాన్స్ ఇచ్చారు. 'వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో హార్దిక్, రాహుల్ ఆస్ట్రేలియా నుంచి స్వదేశానికి చేరుకున్నారు. వారి స్థానాల్లో శంకర్, శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశాం. అడిలైడ్‌లో జరిగే రెండో వన్డే కంటే ముందుగానే శంకర్ జట్టుతో కలుస్తాడు. కివీస్‌తో వన్డే, టీ20 సిరీస్ కోసం గిల్‌కు అవకాశం కల్పించాము' అని ఆదివారం అర్ధ రాత్రి బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉంటే తొలుత రాహుల్‌కు బదులుగా కర్ణాటకకే చెందిన మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు. అయితే అగర్వాల్ గాయంతో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ కోరిక మేరకు శంకర్‌తో ఆ స్థానాన్ని భర్తీ చేశారు. ఇక ఇటీవలి రంజీ ట్రోఫీతో పాటు న్యూజిలాండ్ పర్యటనలో భారత్ 'ఎ' తరపున మెరుగ్గా రాణించడం ద్వారా గిల్..సెలెక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు.

గెలిస్తే నేరుగా నాకౌట్‌కు

చివరి లీగ్ మ్యాచ్‌లో బహ్రెయిన్‌తో భారత్ ఢీ.. ఏఎఫ్‌సీ ఆసియా కప్



షార్జా: గత వైభవం దిశగా సాగుతున్న భారత ఫుట్‌బాల్ జట్టు ..ఏఎఫ్‌సీ ఆసియాకప్‌లో భాగంగా బహ్రెయిన్ జట్టుతో కీలక పోరుకు సిద్ధమైంది. 1964లో ఏఎఫ్‌సీ ఆసియాకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత ఫుట్‌బాల్ జట్టు మళ్లీ ఇప్పటి వరకు కనీసం నాకౌట్ రౌండ్‌కు చేరలేకపోయింది. స్టీఫెన్ కాన్‌స్టాంటైన్ శిక్షణలో రాటుదేలిన భారత ఫుట్‌బాల్ జట్టు ఇటీవలి కాలంలో అద్భుత విజయాలతో ఫిఫా ర్యాంకింగ్స్‌లో 97వ స్థానానికి చేరింది. తొలి లీగ్ మ్యాచ్‌లో థాయిలాండ్‌తో 4-1 తేడాతో గెలిచి శుభారంభం చేసినా..పటిష్ఠమైన ఆతిథ్య యూఏఈ జట్టుపై 2-0తో ఓడిపోయింది. 3 పాయింట్లతో గ్రూప్‌లో రెండోస్థానంలో కొనసాగుతున్న ఛెత్రిసేన బహ్రెయిన్‌తో జరిగే చివరిలీగ్ మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా నాకౌట్ రౌండ్ చేరనుంది. 1984, 2011లో వచ్చిన అవకాశాలను చేజార్చుకున్న భారత జట్టు నాకౌట్ చేరడంలో విఫలమైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ నాకౌట్ చేరే అవకాశముంది. ఆరు గ్రూప్‌ల నుంచి తొలిరెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా నాకౌట్ రౌండ్ చేరనుండగా.. మూడోస్థానంలో నిలిచే ఆరు జట్లు మిగిలిన నాలుగ బెర్త్‌ల కోసం పోటీ పడనున్నాయి. గ్రూప్ స్టేజ్‌లో థాయిలాండ్‌ను ఓడించిన భారత్ ..బహ్రెయిన్ చేతిలో ఓడినా మూడోస్థానంతో నాకౌట్ రేసులో నిలువనుంది. మరోవైపు బహ్రెయిన్ జట్టు గెలిస్తేనే నాకౌట్ చేరే అవకాశం ఉంది.

భుటియా రికార్డు సమం

107 మ్యాచ్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఫుట్‌బాల్ దిగ్గజం బైచుంగ్ భుటియా రికార్డును భారత సారథి సునీల్ ఛెత్రి సమం చేయనున్నాడు. బహ్రెయిన్‌తో జరిగే మ్యాచ్ సునీల్ ఛెత్రికి 107వ అంతర్జాతీయ మ్యాచ్. ఇప్పటికే (67 గోల్స్, 106 మ్యాచ్‌లు) అంతర్జాతీయ గోల్స్ సాధించిన జాబితాలో రెండోస్థానంలో కొనసాగుతున్న ఛెత్రి మరో రికార్డు ముంగిట నిలవడం విశేషం.



పుణె ఆతిథ్యమిస్తున్న ఖేలో ఇండియాఅండర్-17 విభాగం రెండోసీజన్‌లో తెలంగాణ రాష్ట్ర బాలిక దీప్తి పతకంతో మెరిసింది. ఆదివారం జరిగిన బాలికల 200మీ ఫైనల్లో రెండోస్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకుంది.

రాయుడు అనుమానాస్పద యాక్షన్

దుబాయ్: భారత క్రికెటర్ అంబటి రాయుడు అనుమానాస్పద బౌలింగ్ చేసినట్లు తేలింది. ఈనెల 12న సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేసిన రాయుడు యాక్షన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలింది. 'మ్యాచ్‌లో రాయుడు బౌలింగ్‌కు సంబంధించిన వీడియోను అధికారులు టీమ్ మేనేజ్‌మెంట్‌కు అందించారు. నిబంధనలకు అనుగుణంగా బౌలింగ్ చేశాడా లేదా అన్నది పరీక్షించాల్సి ఉంది. 14 రోజుల్లోపు రాయుడు పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. ఫలితం వచ్చే లోపు బౌలింగ్‌ను కొనసాగించే అవకాశం అతనికుంటుంది' అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. రాయుడు తన 46 వన్డేల కెరీర్‌లో 41.33 సగటుతో మూడు వికెట్లు పడగొట్టాడు.

కార్పొరేట్ పన్నును తగ్గించాలి

రాబోయే బడ్జెట్‌పై ఫిక్కీ డిమాండ్



న్యూఢిల్లీ, జనవరి 13: రాబోయే బడ్జెట్‌లో టర్నోవర్‌తో సంబంధం లేకుండా కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలని వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ డిమాండ్ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ వచ్చే నెల 1న పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత ఆదాయం పన్ను (ఐటీ) రేట్లనూ తగ్గించాలన్న ఫిక్కీ.. వార్షిక ఆదాయం రూ.20 లక్షలు దాటితేనే 30 శాతం రేటును వర్తింపజేయాలని కోరింది. ప్రస్తుతం అధిక పన్నులతో వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, ఉత్పాదక వ్యయం పెరుగుతున్నదని, వ్యాపార విస్తరణ నెమ్మదించి, పెట్టుబడులు గగనమైపోతున్నాయని ఓ ప్రకటనలో ఆదివారం ఫిక్కీ ఆందోళన వ్యక్తం చేసింది. ఐటీ మినహాయింపును కనీసం రూ.3 లక్షల వరకైనా ఇవ్వాలన్నది.

ఊగిసలాటకు తెర!

ఊగిసలాట ధోరణి ఇంకా మార్కెట్‌ను వీడలేదు. గత వారం అంతా నిఫ్టీ కేవలం 137 పాయింట్ల రేంజ్‌లోనే ట్రేడ్ అయింది. అక్టోబర్ కనీస, గరిష్ఠ స్థాయిలను రెండున్నర నెలలుగా ఛేదించలేకపోతున్నది. గత వారం మొదటి రెండు రోజులు లాభాల్లో, మిగతా మూడు రోజులు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. అయితే నిఫ్టీ నికరంగా 67.7 పాయింట్ల లాభంతోనూ, సెన్సెక్స్ 314.74 పాయింట్ల లాభంతోనూ ముగిసాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు కూడా చాలా స్వల్ప లాభాలకే పరిమితమైయ్యాయి. మెటల్ ఇండెక్స్ మాత్రం నష్టాలతో ముగిస్తే మిగతా ప్రధాన సెక్టోరియల్ ఇండెక్స్‌లు నికరంగా లాభాలతో స్థిరపడ్డాయి. ఇప్పటి వరకూ వెలువడిన మూడో త్రైమాసిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి.

ఈ వారం ప్రభావితం చేసే అంశాలు

ఆర్థిక ఫలితాల సీజన్ ఈ వారం నుంచి పుంజుకోనుంది. 80 కంపెనీలకు పైగా మూడో త్రైమాసికానికి ఫలితాలను ప్రకటించనున్నాయి. నిఫ్టీలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, హిందుస్థాన్ యూనీలీవర్, జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ వంటి ప్రధాన కంపెనీలు ఈ వారంలోనే ఫలితాలను ప్రకటించనున్నాయి. ఇండెక్స్ హెవీవెయిట్ షేర్లు రిలయన్స్, హిందుస్థాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ ఫలితాలు వెలువడుతున్నందున మార్కెట్‌లో భారీ కదలికలు రానున్నాయి. దీనికి తోడు శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడిన ఇన్ఫోసిస్ ఫలితాల ప్రభావం కూడా సోమవారం నాడు ఉండనుంది. అలాగే ఐఐపీ గణాంకాలు కూడా ప్రభావాన్ని చూపనున్నాయి. సోమవారం నాడు ద్రవ్యోల్బణం, మంగళవారం వాణిజ్య లోటు గణాంకాలు కూడా వెలువడనున్నాయి. 18వ తేదీన విదేశీ మారక నిల్వల డేటా రిజర్వ్ బ్యాంక్ వెల్లడించనున్నది. మరో వైపు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు సప్లయ్ తగ్గడంతో పెరుగుతున్నాయి. అమెరికా-చైనా మధ్య చర్చలు అసంపూర్తిగా ముగియడం, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ పరిణామాలు కూడా మార్కెట్లకు కీలకమే. కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరోసారి రూ. 70.49 కి చేరుకుంది. మిగతా వర్ధమాన దేశాల కరెన్సీతో పోల్చితే రూపాయి అధికంగా నష్టపోయింది. ఈ అంశాలన్నీ మార్కెట్‌పై నేరుగా ప్రభావాన్ని చూపించేవే.



టెక్నికల్స్ : నిఫ్టీ మరోసారి 200 డీఎంఏకు దిగువన ముగిసింది. వీక్లీ చార్ట్‌లో డోజీ లాంటి క్యాండిల్ ఏర్పడింది. వరుసగా నాలుగు వారాలుగా ఇలాంటి నెగటివ్, అనిశ్చితిని సూచించే క్యాండిల్స్ ఏర్పడుతూ వస్తున్నాయి. గత 20 రోజుల ఒడిదుడుకుల ఆధారంగా రూపొందించిన బోలింజర్ బ్యాండ్స్ కూడా చాలా దగ్గరగా వచ్చాయి. దీంతో త్వరలో పెద్ద కదలికకు సంకేతాలు కనిపిస్తున్నాయి. గత నాలుగు వారాలుగా 10,985 స్థాయిలో ఉన్న రెసిస్టెన్స్‌ను అధిగమించలేకపోతున్నది. ఇటీవలి ర్యాలీలో 23.6 రీట్రేస్‌మెంట్ స్థాయి 10,750 వద్ద తొలి మద్దతు కనిపిస్తున్నది. ఒకవేళ ఇది దిగిపోతే 10,610 వద్ద మరో మద్దతు స్థాయి ఉంది. ఎగువన 10,815 తొలుత రెసిస్టెన్స్ ఎదురవుతున్నది. ఎక్కువ కాలం సైడ్‌వేస్‌లో ట్రేడ్ అవుతూ బ్రేక్‌వుట్ జరిగితే చాలా వేగవంతమైన కదలికలు వస్తాయి. ప్రస్తుతానికి మార్కెట్ ట్రిగ్గర్ పాయింట్స్ కోసం ఎదురు చూస్తున్నది. ఇప్పటికైతే మార్కెట్ అప్‌ట్రెండ్ ఒత్తిడికి లోనవుతున్నది. మరో ఒకటి, రెండు రోజులు కనీసం పావు శాతం పతనమై గరిష్ఠ వాల్యూమ్స్ నమోదైతే డౌన్ ట్రెండ్‌లోకి ప్రవేశిస్తుంది. ప్రస్తుతానికి కనిపిస్తున్న టెక్నికల్ సంకేతాలను బట్టి బేరిష్‌గా మారడానికే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగా వెలువడకపోతే బేరిష్ కదలికలు వస్తాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు రాబడుల్లో వృద్ధిని సాధిస్తున్న షేర్లపైనే దృష్టిని సారించాలి.

నిఫ్టీ
మద్దతు స్థాయిలు : 10,750 - 10,610 - 10,494
నిరోధక స్థాయిలు : 10,815 - 10,885 - 10,935

కంపోజిషన్ డీలర్ల దోపిడి

- కస్టమర్ల నుంచి అధిక శాతంలో జీఎస్టీ వసూలు
- ప్రభుత్వానికి చెల్లించని వైనం
- గుర్తించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ
- కొనుగోలుదారులకు ఊరటనిచ్చే దిశగా యోచన



న్యూఢిల్లీ, జనవరి 13: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను మరింత సరళతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇప్పటికే వివిధ రకాల వస్తువులు, సేవలపై జీఎస్టీని తగ్గిస్తూ అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు ఉపశమనాన్ని కలిగిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఇప్పుడు కస్టమర్ల నుంచి జీఎస్టీ చార్జీలను వసూలు చేయకుండా కంపోజిషన్ డీలర్లను నిరోధించే చర్యలకు శ్రీకారం చుట్టాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగానే కొనుగోలుదారుల నుంచి ఏ పన్నునూ తీసుకోకుండా ఇన్వాయిస్‌ల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ స్టేటస్‌ను కంపోజిషన్ డీలర్లు, సర్వీస్ ప్రొవైడర్లు తప్పక పేర్కొనేలా నిర్ణయం తీసుకోవాలని రెవిన్యూ శాఖ భావిస్తున్నది. ఈ మేరకు పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సీబీఐసీ) కూడా ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నది. ఒక్కసారి గనుక ఇది అమల్లోకి వచ్చినట్లైతే కస్టమర్ల నుంచి కంపోజిషన్ డీలర్లు వసూలు చేస్తున్న జీఎస్టీకి అడ్డుకట్ట పడినట్లేనని ప్రభుత్వం అనుకుంటున్నది. ఇలా వసూలవుతున్న జీఎస్టీ ఖజానాకు రావడం లేదంటున్న ఓ అధికారి.. అదంతా కూడా అక్రమంగా కంపోజిషన్ డీలర్లకే ప్రయోజనకరంగా మారిందని చెబుతున్నారు. అందుకే కస్టమర్లకు లబ్ధి చేకూరేలా కంపోజిషన్ డీలర్ల జీఎస్టీ వసూళ్లకు చెక్ పెట్టాలని భావిస్తున్నట్లు సదరు అధికారి చెప్పారు. అలాగే వినియోగదారులకూ ఈ విషయంలో అవగాహన కల్పించాలని రెవిన్యూ శాఖ అనుకుంటున్నది. కొనుగోలుదారుల నుంచే జీఎస్టీని వసూలు చేయాల్సిన అవసరం డీలర్లకు లేదన్న దానిపై స్పష్టత వచ్చేలా ప్రచారం చేపట్టాలని చూస్తున్నది. జీఎస్టీ కంపోజిషన్ పథకం కింద ట్రేడర్లు, తయారీదారులు గూడ్స్‌పై ఒక్క శాతం మాత్రమే జీఎస్టీని చెల్లించాల్సి ఉన్నది. ఇందులోలేనివారు 5, 12, 18 శాతం పన్నులను చెల్లించాల్సి ఉంటున్నది. వీరికి కూడా కొనుగోలుదారుల నుంచి జీఎస్టీ చార్జీలను వసూలు చేయడానికి అనుమతి లేదు. అలాంటిది తక్కువ జీఎస్టీని చెల్లిస్తున్న కంపోజిషన్ డీలర్ల దోపిడి ఇటు వినియోగదారులకు ఇబ్బందికరంగా, అటు ప్రభుత్వానికి నష్టదాయకంగా పరిణమించింది. 'కస్టమర్ల నుంచి అధిక శాతంలో జీఎస్టీని వసూలు చేస్తున్న కంపోజిషన్ డీలర్లు.. అందుకు అనుగుణంగా మాత్రం ప్రభుత్వ ఖజానాకు డిపాజిట్ చేయడం లేదని ఓ అధికారి పీటీఐకి తెలిపారు. కాగా, జీఎస్టీ కింద 1.17 కోట్ల వ్యాపారులు నమోదై ఉన్నారు. వీరిలో దాదాపు 20 లక్షల మంది కంపోజిషన్ స్కీంను వర్తింపజేసుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి ఈ నెల 10న జరిపిన 32వ సమావేశంలో జీఎస్టీ కంపోజిషన్ స్కీం కింద టర్నోవర్ ఆధారంగా చిన్న వర్తకులు, వ్యాపారులు చెల్లిస్తున్న 1 శాతం పన్ను రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్ దాటినవారికే వర్తిస్తుందని నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ పన్ను వార్షిక టర్నోవర్ కోటి రూపాయలు దాటితే పడుతున్నది. ఏప్రిల్ 1 నుంచి మార్పు వర్తిస్తుందని నాడు జైట్లీ పేర్కొన్నారు. అలాగే రూ.50 లక్షలదాకా వార్షిక టర్నోవర్ ఉన్న సేవలు లేదా, వస్తు, సేవల కల్పనదారులు, సరఫరాదారులూ కంపోజిషన్ స్కీంను ఉపయోగించుకోవడానికి అర్హులని చెప్పిన సంగతీ విదితమే.

సుశీల్ మోదీ సారథ్యంలో కమిటీ

జీఎస్టీ అమలు తర్వాత ఆయా రాష్ర్టాలు ఆదాయాన్ని కోల్పోతున్న నేపథ్యంలో బీహార్ డిప్యూటీ సీఎం సుశీల్ మోదీ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఏర్పాటైన కమిటీ అందుకుగల కారణాలను పరిశీలించనున్నది. గత నెల 22న జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో ఈ కమిటీని మండలికి నాయకత్వం వహిస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నియమించారు. ముఖ్యంగా పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, ఒడిషా, గోవా, బీహార్, గుజరాత్, ఢిల్లీ రాష్ర్టాల ఆదాయం గణనీయంగా పడిపోయింది. గతేడాది ఏప్రిల్-నవంబర్ వ్యవధిలో కనిష్ఠంగా 14 శాతం నుంచి గరిష్ఠంగా 37 శాతం వరకు ఆదాయాన్ని ఈ రాష్ర్టాలు కోల్పోయినట్లు గణాంకాలు రుజువు చేస్తున్నాయి. పుదుచ్చేరి ఏకంగా 43 శాతం రెవిన్యూ నష్టాన్ని చవిచూసింది. ఈ రాష్ర్టాలకు జీఎస్టీ నష్టపరిహారం కింద రూ.48,202 కోట్లనూ కేంద్రం విడుదల చేసింది. అంతకుముందు ఏడాది ఇది రూ.48,178 కోట్లుగా ఉన్నది. దేశంలోని మొత్తం 31 రాష్ర్టాల్లో దక్షిణాది రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఈశాన్య రాష్ర్టాలైన మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, సిక్కిం, నాగాలాండ్‌లు మాత్రమే జీఎస్టీ వచ్చాక రికార్డు స్థాయిలో ఆదాయాన్ని అందుకోగలుగుతున్నాయి. ఈ క్రమంలో మిగతా రాష్ర్టాల ఆదాయాన్నీ పెంచి జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపులను తగ్గించుకోవాలని కేంద్రం భావిస్తున్నది. ఇప్పటికే వివిధ రకాల వస్తువులు, సేవలపై జీఎస్టీ రేట్లను తగ్గించడంతో నెలసరి వసూళ్లు పడిపోవడం, వ్యాపారుల అక్రమాలతో జీఎస్టీ చెల్లింపులు తగ్గిపోయిన నేపథ్యంలో నష్టపరిహారం భారాన్ని సర్కారు మోయలేకుండా ఉన్నది. 2017 జూలై 1న దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

బీమాలో తగ్గిన ఎల్ఐసీ వాటా



న్యూఢిల్లీ, జనవరి 13: ప్రైవేట్ రంగ జీవిత బీమా విస్తృత ప్రచారాలతో ప్రభుత్వ రంగ బీమా కంపెనీ ఎల్ఐసీ వాటా మార్చి 2018 నాటికి 70 శాతం కన్నా తక్కువకు పడిపోయింది. మొత్తం ప్రీమియం ఆదాయం ప్రాతిపదికన ఎల్ఐసీ వాటా 71.81 శాతం నుంచి 69.36 శాతానికి దిగజారింది. కాగా, ప్రైవేట్ బీమా కంపెనీల వాటా 28.19 శాతం నుంచి 30.64 శాతానికి పెరిగినట్టు ఐఆర్‌డీఏ వార్షిక నివేదిక వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో అన్ని బీమా కంపెనీలు కలిసి 281.97 లక్షల కొత్త పాలసీలను విక్రయించాయి. ఇందులో 213.38 లక్షల పాలసీలను ఎల్ఐసీ విక్రయించింది. కాగా, ప్రైవేట్ బీమా కంపెనీలు 68.59 లక్షల పాలసీలను విక్రయించగలిగాయి. కొత్త పాలసీలను విక్రయించడంలో ప్రైవేట్ కంపెనీలు 8.47 శాతం వృద్ధిని సాధిస్తే, ఎల్ఐసీ 5.99 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 2018 నాటికి దేశంలో మొత్తం 68 బీమా కంపెనీలు కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఇందులో 24 జీవిత బీమా కంపెనీలు, 27 జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలవగా, 6 హెల్త్ ఇన్సూరెన్స్ సేవలను అందిస్తున్నాయి. మరో 11 రీ ఇన్సూరన్స్ బిజినెస్‌ను నిర్వహిస్తున్నాయి. ఎనిమిది ప్రభుత్వ రంగ బీమా కంపెనీలైతే.. మిగిలినవన్నీ ప్రైవేట్ బీమా కంపెనీలే. 2017 జీవిత బీమా ప్రీమియం ఆదాయంలో 8 శాతం వృద్ధి నమోదు అయింది. ప్రపంచ బీమా మార్కెట్‌లో ఇండియా 2.76 శాతం వాటాను కలిగి ఉంది.

డాలర్లను అమ్మిన ఆర్బీఐ



ముంబై, జనవరి 13: నవంబర్ నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 644 మిలియన్ డాలర్లను స్పాట్ మార్కెట్‌లో అమ్మేసింది. రూపాయి మారకం విలువ పతనాన్ని అడ్డుకోవడానికి డాలర్లను విక్రయించినట్టు ఆర్బీఐ విడుదల చేసిన గణాంకాలు తెలుపుతున్నాయి. 2017లో రూపాయి విలువ స్థిరంగా ఉన్నందున 2.570 బిలియన్ డాలర్లను కొనుగోలు చేసి 1.706 బిలియన్ డాలర్లను విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూపాయి మారకం విలువ పతనం అవుతున్న నేపథ్యంలో కట్టడి చేసేందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఆర్బీఐ పేర్కొంది. అక్టోబర్ నెలలో కూడా 945 మిలియన్ డాలర్లను కొనుగోలు చేసి 8.149 బిలియన్ డాలర్లను విక్రయించింది. రూపాయి మారకంలో ఎదురయ్యే ఒడిదుడుకులను కట్టడి చేసేందుకు కరెన్సీ మార్కెట్‌లో ఆర్బీఐ జోక్యం చేసుకోవడం సాధారణమే. కాగా, రూపాయి మారకం విలువ రూ. 74 కనీస స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల కాలంలో 34 బిలియన్ డాలర్లను విక్రయించింది. 2018లో ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో స్పాట్ కరెన్సీ మార్కెట్‌లో 26.51 బిలియన్ డాలర్లను విక్రయించింది. 2017లో ఇదే కాలంలో 18.017 బిలియన్ డాలర్లను కొనుగోలు చేసింది. ఏప్రిల్13, 2018తో ముగిసిన వారంతంలో ఫారెక్స్ రిజర్వులు జీవితకాల రికార్డు స్థాయిలో 426.028 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, ఆ తర్వాత నుంచి వరుసగా ఎదురవుతున్న కరెన్సీ మార్కెట్ ఒడిదుడుకులతో రూపాయి మారకం విలువ మరింత పతనం కాకుండా ఉండేందుకుగాను రిజర్వ్ బ్యాంక్ డాలర్లను అమ్మడం ద్వారా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

ఎఫ్ఐఐల అమ్మకాలు

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు గత తొమ్మిది ట్రేడింగ్ సెషన్లలో రూ. 3,677 కోట్ల పెట్టుబడులను క్యాపిటల్ మార్కెట్ నుంచి విరమించుకున్నారు. దేశీయ ఆర్థిక గణాంకాలు, బడ్జెట్, సాధారణ ఎన్నికలున్న క్రమంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్త ధోరణిని అవలంభిస్తున్నారు. ఈ నెల 1-12 మధ్య కాలంలో మొత్త ం రూ. 3,677 కోట్ల పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్ నుంచి విరమించుకున్నారు. అయితే రుణ మార్కెట్లో మాత్రం రూ. 1,872 కోట్ల పెట్టుబడులను పెట్టారు. గత నవంబర్- డిసెంబర్ మధ్య కాలంలో నికరంగా రూ. 8,584 కోట్ల పెట్టుబడులను పెట్టిన ఎఫ్ఐఐలు.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తిరిగి అమ్మకాలను జరుపుతున్నారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై దృష్టి

కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు

ముంబై, జనవరి 13: దేశీయ ఎగుమతులను పెంచేందుకు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల దిశగా అడుగులు వేస్తున్నామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, విమానయాన శాఖల మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. మరింత సరళతర వాణిజ్య నిర్వహణలో భాగంగా స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఆయా దేశాలతో ఏర్పరచుకుంటామని ఆదివారం ఇక్కడ వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్పష్టం చేశారు. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాలతో వ్యాపార సంబంధాలను పటిష్ఠం చేస్తామని చెప్పారు.

ఇక జిల్లాలపై నజర్

జాతీయ స్థాయిలో వృద్ధిరేటుకు ఊతమిచ్చేందుకు జిల్లాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నది కేంద్ర ప్రభుత్వం. క్షేత్రస్థాయిలో వృద్ధిని బలోపేతం చేస్తే.. దేశ జీడీపీ పరుగులు పెట్టగలదని భావిస్తున్నది. ఏటా 3-4 పాయింట్లు జిల్లా వృద్ధిలో కనిపించినా.. స్థూల జీడీపీలో పురోగతి ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, బీహార్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ర్టాల్లోని జిల్లాలను ఎంచుకుంటున్నామని, ఇప్పటికే ఆరు జిల్లాలను గుర్తించామని ప్రభు తెలిపారు.

భగ్గుమన్న పెట్రో ధరలు

- ఆదివారం పెట్రోల్, డీజిల్‌పై భారీగా వడ్డన
- హైదరాబాద్‌లో 53 పైసలు పెరిగి రూ.74కు చేరిన పెట్రోల్
- 64 పైసలు ఎగిసి రూ.69.24 వద్దకు డీజిల్




హైదరాబాద్, జనవరి 13: శాంతిస్తున్నాయని సంబురపడుతున్న సమయంలో పెట్రో ధరలు మళ్లీ విజృంభిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పరుగులు పెడుతున్న నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఇంధన ధరలూ ఎగిసిపడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం లీటర్ పెట్రోల్ ధర హైదరాబాద్‌లో ఏకంగా 53 పైసలు ఎగిసి రూ.74ను చేరింది. డీజిల్ ధర కూడా 64 పైసలు ఎగబాకి రూ.69.24ను తాకింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ లీటర్ పెట్రోల్ ధర 49 పైసలు అందుకుని రూ.69.75 వద్దకు, డీజిల్ 59 పైసలు అందిపుచ్చుకుని రూ.63.69 వద్దకు చేరాయి. ఇక గడిచిన నాలుగు రోజుల్లో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.1.33 పైసలు, డీజిల్ రూ.1.58 పైసలు చొప్పున పెరిగాయి. ఢిల్లీలోనూ పెట్రోల్ రేటు ఈ నాలుగు రోజుల్లో రూ.1.25 పైసలు, డీజిల్ ధర రూ.1.45 పైసలు చొప్పున ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 60 డాలర్లను దాటేసింది. పీపా ధర 50 డాలర్లకు పడిపోవడంతో కలవరపాటుకు లోనైన చమురు ఉత్పాదక దేశాలు.. ఉత్పత్తిని తగ్గించిన విషయం తెలిసిందే. మార్కెట్‌లో డిమాండ్‌కు మించి సరఫరా ఉండటంతో ధరలు క్షీణించగా, చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్‌సహా అన్ని దేశాల్లోనూ ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే ఉత్పాదక దేశాలు తమ ఉత్పత్తికి కళ్లెం వేయడంతో మార్కెట్‌లోకి సరఫరా తగ్గి, డిమాండ్ పెరిగి ధరలూ పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశీయ ఇంధన అవసరాల్లో 80 శాతానికిపైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగితే.. భారతీయ మార్కెట్‌లోనూ ధరలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మళ్లీ పెట్రో ధరలు రికార్డు స్థాయిల వైపు వెళ్లకతప్పదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

జమ్ము కశ్మీర్ బ్యాంక్ లాభం 43 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 13: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి జమ్ము కశ్మీర్ బ్యాంక్ 43 శాతం వృద్ధితో రూ. 103.75 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ. 72.47 కోట్ల నికర లాభాన్ని పొందింది. కాగా, మొత్తం ఆదాయం రూ. 1,790.77 కోట్ల నుంచి రూ. 2,184.22 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు 10.08 శాతం నుంచి 9.94 శాతానికి తగ్గాయి. అయితే నికర ఎన్‌పీఏ మాత్రం స్వల్పంగా పెరిగి 4.29 నుంచి 4.59 శాతానికి చేరింది. 2022 సంవత్సరం నాటికి రూ. 2,000 కోట్ల లాభాన్ని ఆర్జించేందుకు నిపుణుల కమిటీ సలహాలను తీసుకోనున్నట్టు బ్యాంక్ తెలిపింది.

పెరిగిన డిస్కం బకాయిలు



న్యూఢిల్లీ, జనవరి 13: విద్యుదుత్పాదక సంస్థలకు దేశ వ్యాప్తంగా ఆయా రాష్ర్టాల పంపిణీ సంస్థల (డిస్కం) బకాయిలు పెరిగిపోయాయి. గతేడాది అక్టోబర్‌లో 24.7 శాతం ఎగిసి రూ.39,498 కోట్లకు చేరాయి. అంతకుముందు రెండు నెలల బకాయిలను కలిపితే ఇవి రూ.50,000 కోట్లపైనేనని ఓ థర్మల్ పవర్ కంపెనీ సీనియర్ అధికారి తెలిపారు. 2017 అక్టోబర్‌లో రూ.31,676 కోట్లుగానే ఉన్నాయని గుర్తు చేశారు. ఈ బకాయిల్లో 55 శాతానికిపైగా ప్రభుత్వ రంగ విద్యుదుత్పాక సంస్థలకు చెందినవే. ఎన్‌టీపీసీకి అత్యధికంగా రూ.15,661.31 కోట్లు రావాల్సి ఉన్నది. ప్రైవేట్ రంగ సంస్థల్లో అదానీ పవర్‌కు రూ.6,878.94 కోట్లు రావాల్సి ఉన్నట్లు ప్రాప్తీ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తున్నది. కాగా, ఈ బకాయిల కారణంగా ఇటీవల లలిత్‌పూర్ విద్యుదుత్పాదక సంస్థ దాదాపు 3,000 మంది సిబ్బందికి జీతాలను చెల్లించడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలుస్తున్నది.

ద్రవ్యలోటు లక్ష్యసాధన కష్టమే


నిపుణుల అంచనా



న్యూఢిల్లీ, జనవరి 13: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) దేశ జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతానికి కట్టడి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవచ్చని నిపుణులు అంటున్నారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు పడిపోతుండటం, ఖర్చులు పెరిగిపోతుండటం, పారిశ్రామికోత్పత్తి క్షీణిస్తుండటం మధ్య ఈసారి లక్ష్యసాధన సర్కారుకు సవాలేనని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ఫలాలను అందించే దిశగా మోదీ సర్కారు అడుగులు వేస్తుండటంతో ఈ దఫా ద్రవ్యలోటు నియంత్రణ గగనమేనన్న అభిప్రాయాలు దండిగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు నిపుణులు ఈసారి జీడీపీలో ద్రవ్యలోటు 3.5 శాతానికి పెరుగవచ్చునని అంచనాలు వేస్తున్నారు. 2018-19 జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతం లేదా రూ.6.24 లక్షల కోట్లకు కట్టడి చేస్తామని గతేడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్ ప్రకటన సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఏప్రిల్-నవంబర్ వ్యవధిలోనే ద్రవ్యలోటు రూ.7.16 లక్షల కోట్లకు చేరిపోయింది. మరో నాలుగు మిగిలి ఉండగానే లక్ష్యానికి దాదాపు లక్ష కోట్లు మించి ద్రవ్యలోటు నమోదు కావడం ప్రభుత్వ వర్గాల్లోనూ కలవరమే వ్యక్తమవుతున్నది. అందుకే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ వేగాన్ని పెంచుతున్న మోదీ సర్కారు. మధ్యంతర డివిడెండ్లనూ పెద్ద మొత్తంలో కోరుతున్నది. ఎన్నికల ఏడాది కావడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచీ భారీగా మధ్యంతర డివిడెండ్‌ను ఆశిస్తున్నది. ఈ క్రమంలో మూడీస్, ఇండియా రేటింగ్స్, క్రిసిల్, ఎల్‌అండ్‌టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి దిగ్గజాలు ద్రవ్యలోటు లక్ష్యసాధన కష్టమేనని అంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2017-18) జీడీపీలో ద్రవ్యలోటును 3.5 శాతానికి అదుపు చేసిన ప్రభుత్వం.. ఈసారి దాన్ని 3.3 శాతానికి కుదించి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. గత నెల ఆర్థిక మంత్రి జైట్లీ సైతం లక్ష్యాన్ని సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేయగా, తాజా పరిస్థితుల నడుమ అంత సులభం కాదన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి.

ఎస్‌యూయూటీఐ వాటాలపై ఆశ

యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూయూటీఐ) ద్వారా నిర్వహిస్తున్న వాటాలను కొంతమేర అమ్మేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ యోచిస్తున్నది. రాబోయే కొద్ది నెలల్లో విక్రయం ఉండొచ్చని ఓ అధికారి సంకేతాలిచ్చారు. కాగా, గతేడాది సెప్టెంబర్ 30 నాటికి యాక్సిస్ బ్యాంక్‌లో దాదాపు 9.63 శాతం, ఐటీసీలో 7.97 శాతం, ఎల్‌అండ్‌టీలో 1.80 శాతం చొప్పున వాటాలను ఎస్‌యూయూటీఐ కలిగి ఉన్నది. అయితే ఎల్‌అండ్‌టీ బైబ్యాక్ ఆఫర్‌కు వచ్చే వీలుండటంతో దానికోసం ఎదురుచూస్తున్న కేంద్రం.. యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో వాటాలను బల్క్ లేదా బ్లాక్ డీల్స్ ద్వారా అమ్మాలనుకుంటున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా ఖజానాకు రూ.80,000 కోట్ల నిధులను తరలించాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఇప్పటిదాకా రూ.34,000 కోట్లకుపైగానే సమీకరించింది.



బిహారీల మైథిలి సామాజిక సంస్థ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్

తెలంగాణ ఉద్యమంలో
బిహారీల పాత్ర ఉంది

పేద బిహారీలను ఆదుకుంటామని దేవీప్రసాద్ భరోసా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమంలో బిహారీలు కూడా మద్దతుగా నిలిచారని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. రాష్ట్రంలోని బిహారీల మైథిలి సామాజిక సంస్థ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు బిహారీలు కూడా తోడ్పాటునందించారని తెలిపారు. ఈ సందర్భంగా మైథిలి సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అహల్యామిశ్రా, రామ్‌వినోద్‌ఝా, మైథిలి సామాజిక మంచ్ అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి
ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **టీఎస్బీసీఎల్ ఉద్యోగులకు ఆరోగ్యకార్డుల పంపిణీలో కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్**



ఆదివారం జలవిహార్‌లో టీఎస్బీ సీఎల్ ఉద్యోగులకు ఆరోగ్యకార్డులను అందజేస్తున్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్. చిత్రంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సోమేశ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉద్యోగులకు మంచిరోజులు వచ్చాయని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. టీఎస్బీసీఎల్‌లో ఉద్యోగులకు ఆరోగ్యకార్డులను ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుతో కలిసి ఆదివారం జలవిహార్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా ఏండ్లుగా ఆరోగ్య కార్డుల కోసం అడుగుతున్న బేవరేజెస్ కార్పొరేషన్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వంలో అందించామని అన్నారు. ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష అని, అందులో భాగంగానే ఆరోగ్య పథకం వర్తింపజేశామని ఎక్సైజ్ కమిషనర్ సోమేశ్‌కుమార్ తెలిపారు. ఆరోగ్యకార్డులు ఇచ్చినందుకు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఉద్యోగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిషింగ్ కాల్స్‌తో జాగ్రత్త

- **పొంచివున్న సైబర్ నేరగాళ్ల ముప్పు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సైబర్ క్రిమినల్స్‌తో తస్మాత్ జాగ్రత్త అంటున్నారు పోలీసులు. ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా మాటల్లోపెట్టి వివరాలు రాబట్టి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ముకొల్లగొట్టే ప్రమాదం ఫిషింగ్ కాల్స్ పేరిట పొంచివున్నదని హెచ్చరిస్తున్నారు.



వరుస సెలవులు కావడంతో ఈ బెడద మరింత పెరిగే ప్రమాదం ఉన్నదని పోలీసులు అంటున్నారు. సెలవురోజుల్లో బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఇతర ఖాతాలకు మళ్లిస్తే ఫిర్యాదుచేసేందుకు పట్టే సమయాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ చీటర్లు మోసాలకు దిగుతున్నారు. ఖాతాను ఆధార్‌తో లింక్‌చేయాలని, కార్డు బ్లాక్ అయ్యిందని, కార్డు అప్‌డేట్ చేయాలని.. ఇలా ఏదో మాట చెప్తూ మనల్ని మాటల్లోపెట్టి వివరాలు లాగేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ఫిషింగ్‌కాల్స్ బారినపడిన చాలామంది సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకు అధికారులం అంటూ వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని, ఇలాంటివారికి ఏవిధమైన సమాచారం ఇవ్వవద్దని పోలీసులు సూచిస్తున్నారు. కార్డు నంబర్, పిన్, సీవీవీ నంబర్లను ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తపడాలంటున్నారు.



ఆదివారం చిన్నారుట్ల వద్ద బ్రేకులు ఫెయిల్ అయి లోయలోకి ఒరిగిన బస్సు

శ్రీశైలం ఘాట్‌లో బస్సుకు బ్రేకులు ఫెయిల్

- **మహారాష్ట్రకు చెందిన 36 మంది భక్తులు సురక్షితం**

కర్నూలు: ఏపీలోని కర్నూలు జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తున్న భక్తుల బస్సు బ్రేకులు ఫెయిల్‌కావడంతో అదుపుతప్పి ప్రహరీని ఢీకొట్టి.. లోయలోకి ఒరిగి నిలిచిపోయింది. శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని చిన్నారుట్ల మలుపు వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో మహారాష్ట్రలోని బీడు జిల్లా పెరళికి చెందిన 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న శ్రీశైలం, దోర్నాల పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు.

ఫైర్‌ఫైటర్లుగా సాధారణ పౌరులు

- **అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం**

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అడవుల్లో చెలరేగే మంటలను ఆర్పడంలో పౌరుల సహకారం తీసుకోవాలని అటవీశాఖ నిర్ణయించింది. 2019ని ఫ్రీ ఫైర్ ఇయర్‌గా ప్రకటించి దాదాపు 2,500 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసింది. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ ఏడాది ఒక్క అగ్నిప్రమాదం కూడా జరుగకుండా చర్యలు తీసుకొంటున్నది. పరిమిత సిబ్బంది కారణంగా అడవులకు దగ్గరగా ఉండే గ్రామాల నుంచి స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారిని ఫైర్‌ఫైటర్లుగా తీసుకొని వారి సేవల్ని వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం జియోమ్యాటిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ద్వారా గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి అడవుల్లో మంటలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఫైర్‌ఫైటర్లుగా సేవలందించేందుకు ఆసక్తి ఉన్నవారు www.tgfdgis.com వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవాలని అటవీశాఖ విజిలెన్స్, ఐటీ పీసీసీఎఫ్ రఘువీర్ సూచించారు.

మైనర్ బాలికపై దారుణం

నాలుగేండ్లుగా
సామూహిక లైంగికదాడి

- హైదరాబాద్ కామాటిపురాలో వెలుగుచూసిన ఉదంతం
- ముగ్గురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన
- సీసీఎస్‌కు కేసు బదిలీచేసిన పోలీస్ కమిషనర్



ఆదివారం కామాటిపురా పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బాధితురాలి బంధువులు

చార్మినార్: హైదరాబాద్ నగరంలోని కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకొన్నది. 16 ఏండ్ల మైనర్ బాలికపై పదకొండు మంది సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. నాలుగేండ్లుగా బెదిరిస్తూ దారుణాన్ని కొనసాగిస్తుండటంతో బాధితురాలు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి గత నెల 24న పోలీసులకు ఫిర్యాదుచేసింది. దాంతో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులు, బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మురళీధర్‌నగర్‌లో నివసించే ఓ మైనర్ బాలికపై.. అదే కాలనీకి చెందిన విజయ్ కన్నేశాడు. చాలారోజులుగా పరిచయమున్న విజయ్ కూల్‌డ్రింక్ ఇవ్వడంతో తాగింది. కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలుపడంతో బాలిక నిద్రలోకి జారుకోగానే లైంగికదాడికి పాల్పడ్డాడు. లైంగికదాడి దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి విజయ్ తన స్నేహితులకు పంపాడు. వీటిని చూపి భయపెట్టిన యువకుడు రాజేశ్ కూడా బాలికపై లైంగికదాడి జరిపాడు. అనంతరం మరో ఇద్దరు కూడా ఇదే తరహా బెదిరింపులకు పాల్పడి లైంగికదాడికి దిగారు. ఫొటోలను సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరిస్తూ పదకొండు మంది నాలుగేండ్లుగా లైంగికదాడికి పాల్పడుతున్నారు. చివరకు లైంగికదాడి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి కామాటిపురా పోలీసులకు ఫిర్యాదుచేసింది. దాంతో శుభం, రాజేశ్, అభిజిత్‌ను అరెస్టుచేసి రిమాండ్ తరలించారు. లైంగికదాడికి మూలకారకుడైన విజయ్‌ను పంచ్ పేరుతో పోలీసులు రక్షిస్తున్నారంటూ బాధితురాలి కుటుంబీకులు ఆదివారం కామాటిపురా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వేగంగా దర్యాప్తు జరిపి దోషులను శిక్షించేందుకు కేసు విచారణకు సీసీఎస్ మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీదేవిని దర్యాప్తు అధికారిగా నియమిస్తున్నట్టు పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ వెల్లడించారు.

ఎవరూ చూడటంలేదని.. నగల బ్యాగు ఎత్తుకెళ్లి..

- విక్రయించే యత్నంలో అడ్డంగా దొరికిన నిందితుడు
- నిందితుడు గచ్చిబౌలి డిపో లైజనింగ్ అధికారి



నిందితుడు సమ్మయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తన బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు పెట్టి మరిచిపోయిన బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలను అపహరించి విక్రయించేందుకు ప్రయత్నిస్తూ ఓ వ్యక్తి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అడ్డంగా బుక్కైపోయాడు. జగద్గిరిగుట్టకు చెందిన కే సమ్మయ్య హెచ్‌సీయూ, గచ్చిబౌలి ఆర్టీసీ డిపోలో లైజనింగ్ అధికారిగా పనిచేస్తున్నాడు. గతనెల 12న బల్కంపేట ఆలయం వద్ద ఓ ఫంక్షన్‌కు వచ్చాడు. ఇంటికి వెళ్లేందుకు బైక్ వద్దకు రాగా.. ఆయన బైక్‌పై నగలున్న బ్యాగ్ కనిపించింది. బ్యాగు తీసుకొని పరారయ్యాడు. సమ్మయ్య అమీర్‌పేట మైత్రివనం వద్ద విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా.. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం బయటపడింది. కేసు నమోదుచేసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఎస్సార్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

బాబు ఓ ఐరన్‌లెగ్

- **యూపీలో కాంగ్రెస్‌కు మిత్రపక్షాలు దూరం కావడంపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సెటైర్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ సీఎం చంద్రబాబు ఓ ఐరన్ లెగ్ అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎద్దేవాచేశారు. బాబు కలిసినప్పటినుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి కష్టాలు మొదలయ్యాయని ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'రాహుల్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకున్నప్పటి నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడికి కష్టాలు వచ్చిపడుతున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను దూరంపెట్టి అఖిలేశ్, మాయావతి కలిసి పోటీచేస్తున్నారు. వాళ్లిద్దరూ కాంగ్రెస్‌కు సంబంధంలేని ఫ్రంట్ ఏర్పాటుచేస్తారట. ఇంకెక్కడి యూపీఏ?.. బాబు ఐరన్‌లెగ్ మహిమ' అని ఎద్దేవా చేశారు.

శ్రీనివాసరావును ప్రశ్నించిన ఎన్‌ఐఏ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు విచారిస్తున్నారు. శ్రీనివాసరావును శనివారం కస్టడీలోకి తీసుకొని అత్యంత భద్రత మధ్య హైదరాబాద్ తరలించి పలు అంశాలపై ఆరా తీశారు. ఆదివారం తిరిగి విశాఖపట్నం తీసుకొచ్చారు. జగన్‌పై దాడి ఎలా జరిగిందన్నదానిపై క్రైం సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్టు సమాచారం. కోర్టు అనుమతితో శ్రీనివాసరావును విచారణ కోసం మరోసారి హైదరాబాద్ లేదా వేరే ప్రాంతానికి తరలిస్తారన్న ప్రచారం జరుగుతున్నది.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 14 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

గ్లిట్టర్ ఆర్టిస్ట్!

ఆర్టిస్ట్ ఒక రూపాన్ని మనసులో అనుకొని దానికి కాన్వాస్ షీట్‌పై అందమైన రూపమిస్తాడు. కానీ ఈమె మాత్రం గ్లిట్టర్‌తో అద్భుతాలు చేస్తున్నది. అది కూడా ఉద్యోగానికి స్వస్తి పలికి మరీ.



పాత ఫొటోలను తీసుకొని వాటికి గ్లిట్టర్ జోడించి అందంగా మెరిపిస్తున్నది పాకిస్తాన్‌కి చెందిన సారా షకీల్. తెల్లటి కాగితం మీద గ్లిటర్‌తో రాస్తేనే మిళమిళ మెరుస్తుంది. మరి వాటిని విమానం, ట్రాఫిక్ సిగ్నల్, రైలు, ప్యాలెస్, బ్రేక్‌ఫాస్ట్, సముద్రం, అందమైన అమ్మాయిల ఫొటోలు ఒకటి కాదు రెండు కాదు ఎన్నో వందల ఫొటోలకు గ్లిట్టర్ ఆర్ట్ వేస్తున్నది. ఫొటోల మీద ఎలాంటి డిజైన్ వేస్తే బాగుంటుందో ముందుగానే ఆలోచించుకుంటుంది. తర్వాత వేసి చూస్తుంది. చూడడానికి బాగుండలేదనిపిస్తే చెరిపేసి మరో డిజైన్ ప్రయత్నిస్తుంది. అలా ఆర్ట్ బాగా వచ్చేంత వరకు ఎన్నో ప్రయోగాలు చేస్తూనే ఉంటుంది. తను డిజైన్ చేసిన ప్రతి ఫొటోని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంది. ఈ ఆర్ట్స్‌కి చాలామందే ఫాలోవర్స్ ఉన్నారు. వీటిని చూస్తుంటే సారా మంచి ఆర్టిస్ట్ అనుకుంటారు. ముమ్మాటికి కానే కాదు. సారా డెంటిస్ట్‌గా సేవలందిస్తున్నది. కొద్దికాలం క్రితం సారా పాత ఫొటోలను చూసీ వాటికి కొత్త రూపం ఇవ్వాలనుకుంది. దానికి గ్లిట్టరే సరైందనుకున్నది. అనుకున్న వెంటనే ఫొటోలమీద గ్లిట్టర్‌తో ఆర్ట్ వేయడం మొదలెట్టింది. అంతేకాదు ఆర్ట్ కోసం సమయం సరిపోవట్లేదని ఉద్యోగాన్ని కూడా వదులుకుని మొత్తం సమయాన్ని దీనికే కేటాయిస్తున్నది. దీంతో ఆమె డెంటిస్ట్ నుంచి గ్లిట్టర్ ఆర్టిస్ట్‌గా మారింది.

సక్సెస్ మంత్ర





మహిళలదే పైచేయి

రంగసూత్ర లక్ష్యం ఒక్కటే.. గ్రామీణ ప్రాంత మహిళల అభ్యున్నతి. అందుకే చేతి వృత్తి నిపుణుల్లో ఆడా-మగా అనే బేధం ఇక్కడ లేదు. ఎవరికైనా పీస్ రేట్ ఒక్కటే. ఎంత ఎక్కువ కష్టపడితే అంత ప్రతిఫలం దక్కుతుంది. ఆశ్చర్యం ఏంటంటే సంఘంలో దాదాపు 70 శాతం మంది మహిళలే పనిచేస్తున్నారు. ఒకప్పుడు బీడీలు చుట్టుకుంటూనో లేక మట్టిపనులకు వెళ్తూనో యాభై, వంద సంపాదించేవారు ఇప్పుడు హుందాగా జీవించడం మొదలుపెట్టారు. నెలకు రూ. 3- 5వేలు సంపాదిస్తున్నారు. నిపుణత సాధించిన మగవాళ్లైతే నెలకు రూ. 10 వేల వరకూ సంపాదిస్తున్నారు. ఇప్పుడు రంగసూత్రకు ఐదు రాష్ర్టాల్లో దాదాపు 2000 మంది సభ్యులు ఉన్నారు. మొదట ముగ్గురితో మొదలైన సంస్థ ఇప్పుడు ముప్పై గ్రూపుల స్థాయికి విస్తరించింది.

అట్టడుగు వర్గాల్లో వెలుగులు నింపిన

సుమితా ఘోష్

గ్రామీణ ప్రాంతంలో ఉన్న అట్టడుగు వర్గాల వారి జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో రంగసూత్ర అనే సామాజిక సంస్థకు జీవం పోశారు సుమితా ఘోష్. ఆ సంస్థ వేలాదిమందికి ఉపయోగపడుతూ వాళ్ల కాళ్ల మీద వాళ్లే నిలబడేలా ఆత్మస్థైర్యాన్ని, అంతకు మించి మెరుగైన జీతాన్ని, జీవితాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రంగసూత్ర అంటే ఇప్పుడు ఆమె ఒక్కరే కాదు.. కొన్ని వందల మంది మహిళలు నిర్వహిస్తున్న కంపెనీ!! ఫ్యాబ్ ఇండియా, ఐకియా వంటి అగ్రగామి సంస్థలతో భాగస్వామ్యం పెట్టుకుని వాటికి వస్ర్తాల్ని సరఫరా చేస్తున్న ఈ సంస్థకు ప్రాణం పోసి.. మహిళలకు శిక్షణనిచ్చి, వారందరినీ వాటా దారులుగా చేసింది మాత్రం సుమితా ఘోష్. ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్న సుమితా ఘోష్ సక్సెస్‌మంత్ర.

సుమితా ఘోష్ కోల్‌కతాలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. ముంబైలో చదువుకున్నారు. చిన్నప్పటి నుంచి నలుగురికీ సాయపడాలనే తపన. అట్టడుగు వర్గాలను చూస్తే ఆపుకోలేనంత దుఃఖం, వాళ్లకు ఏదో చేయాలనే తాపత్రయమే నిత్యం ఆమెను వెంటాడేది. అదే సమయంలో సంజయ్ ఘోష్‌తో వివాహమైంది. ఇద్దరి భావాలు, ఆశయాలూ ఒక్కటే. ఎప్పుడూ నలుగురికి మేలు చేయాలని ఆలోచించేవారు. అప్పటికే సహకార సంఘాల హవా నడుస్తున్నది. అమూల్ లాంటి సంస్థలు నిలదొక్కుకుని నలుగురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సేవలో భాగంగా 1980 నుంచి 1990 మధ్య ఇద్దరూ రాజస్థాన్‌లోని ఉత్తరరాజస్థాన్ మిల్క్ యూనియన్ ట్రస్ట్‌తో కలిసి పనిచేశారు. కానీ దురదృష్టం వారిని వెంటాడింది. తీవ్ర కరువుతో పాడి పరిశ్రమ కునారిల్లింది. 1987లో వచ్చిన తీవ్ర కరువుతో వ్యాపారం మూతబడింది. ఆర్థికంగా నష్టపోయారే కానీ.. ఆలోచనల్లో మాత్రం వీళ్లిద్దరికీ కొదువ లేదు. స్థానికులకు చేతిపనులు నేర్పిస్తూ, వారికి జీవనోపాధి కల్పించాలని నిర్ణయించుకున్నారు.

భర్త దూరమై..

ఆ తర్వాత ఇద్దరూ అస్సాం చేరారు. అదే టైంలో మజౌలీ పరివాహక ప్రాంతాల్లో ఏదో సమస్య వచ్చింది. దీన్ని పరిష్కరించడానికి పోయిన సంజయ్‌ను ఉల్ఫా తీవ్రవాదులు 1997లో అపహరించారు. జీవితంలో ఆమెకు ఇది కోలుకోలేని ఎదురు దెబ్బ. సమాజాన్ని ఉద్ధరిస్తామని వచ్చి చివరకు భర్త సమాచారం కూడా తెలుసుకోలేని స్థితి ఎదురైంది. ఎందుకు తీసుకెళ్లారో తెలీదు, ఎప్పుడు వదిలేస్తారో తెలీదు.. ఇంతకూ బతికి ఉన్నాడో లేదో తెలియని భర్త గురించి ఆమెపడిన ఆరాటాన్ని వర్ణించలేం. బాధాకరమైన విషయం ఏంటంటే.. ఇంతవరకూ ఆయన జాడే తెలియరాలేదు. సుమితా ఘోష్ అక్కడితో ఆగిపోతే ఇప్పుడు మనందరికీ ఆదర్శంగా నిలిచేవారే కాదు. అదే ఆమె జీవితంలో టర్నింగ్ పాయింట్. ఆమె తీసుకున్న కఠినమైన, సాహసోపేతమైన నిర్ణయం ఇప్పుడు వేలాది మంది కుటుంబాలకు ఆసరా అయింది.

అట్టడుగు వర్గాల కోసం..

2005లో సుమితా ఘోష్ రంగసూత్ర అనే సంస్థకు ప్రాణం పోశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అట్టడుగు వర్గాల వారి జీవన ప్రమాణాలు పెంచడమే ఈ సంస్థ ఉద్దేశం. కొనుగోలుదార్లకు, వ్యాపారులకు, వృత్తి నిపుణులందరికీ కలిపి రూపొందిన ఒక వేదికే ఈ రంగసూత్ర. అయితే ఏదైనా ఒక సంస్థ నడవాలంటే గ్రాంట్ల రూపంలో నిధులైనా రావాలి, లేకపోతే సొంత డబ్బులైనా ఖర్చు చేయాలి. ఉదారంగా వచ్చే సొమ్ముతో ఎంత కష్టపడి పనిచేసినా పూర్తిస్థాయి సంతృప్తి ఉండదనేది ఆమె భావన. అందుకే ఒక కొత్త తరహా బిజినెస్ మోడల్‌కు రెండు దశాబ్దాల క్రితమే తెరతీశారు. సహకార సంఘాల స్థాయిని కార్పొరేట్ పబ్లిక్ ఇష్యూ స్థాయికి తీసుకెళ్లారు. నాణ్యమైన వస్తువులు, బట్టలు, బొమ్మలకు రంగసూత్రను కేరాఫ్ అడ్రస్ చేయాలనేది ఆమె సంకల్పం. పనిరాని వాళ్లకు పనినేర్పించాలి, వచ్చిన వాళ్లకు నైపుణ్యం పెంచి వాటికి మంచి విలువను జోడించాలి. అందుకోసం గ్రామగ్రామానికి తిరిగి విశేషమైన పరిశోధన చేశారు. ఆయా ప్రాంతాల్లో ఎప్పటి నుంచో చేస్తున్న వృత్తిపని వారితో ఒప్పించారు. మంచి నాణ్యమైన సరుకును సరైన సమయంలో తయారు చేసి ఇవ్వాలని మాట్లాడుకుని వచ్చారు.

సొంతపెట్టుబడి పెట్టి



రంగసూత్ర పేరుతో సంస్థను మొదలుపెట్టిన సుమితా ఘోష్ రూ.10 లక్షల సొంత పెట్టుబడి పెట్టారు. గతంలో ఆమెకు ఉన్న అనుభవం, కొత్త వ్యాపార ఆలోచనకు కొన్ని కంపెనీలు ముందుకొచ్చాయి. ఇది వ్యాపారం కాబట్టి ఆ కోణంలోనే ఆలోచించి ఇన్వెస్ట్ చేశాయి. అప్పట్లోనే ఆవిష్కార్ సంస్థ రూ. 23 లక్షలు, ఫ్యాబ్ ఇండియాకు చెందిన ఆర్టిసన్స్ ఫండ్ నుంచి రూ. 30 లక్షలు అందాయి. రెండు కంపెనీలకు యాభై శాతం వాటా వచ్చింది. స్థానికులు, చేతివృత్తుల వాళ్లను కూడా ఒప్పించి పెట్టుబడి పెట్టేలా చేశారు. ఇక్కడే ఘోష్ అద్భుత విజయం సాధించారని చెప్పాలి. 1200 మంది సభ్యుల్లో ఒక్కొక్కరి నుంచి రూ.1000 సమీకరించారు. ఇదో పన్నెండు లక్షల వరకూ పోగైంది. ఇప్పుడు సభ్యులంతా కంపెనీకి ఓనర్లైపోయారు. సుమితా ఘోష్ సహా ఇతర సభ్యులందరి వాటా కలిపి మరో యాభై శాతం ఉంది.

అందరి భాగస్వామ్యం

డబ్బులు సమీకరించగానే సరిపోదు. దాన్నుంచి పూర్తి స్థాయి ఉత్పాదకత రాబట్టినప్పుడే అందరికీ ప్రయోజనం. అందుకే వివిధ రాష్ర్టాల్లోని స్వచ్ఛంద సంస్థలు, చేతివృత్తి నిపుణులతో చర్చలు జరిపారు. నాణ్యతలో ఏ మాత్రం రాజీ పడకుండా సరుకును తయారు చేయడం అర్టిసన్స్ వంతు. దాన్ని మార్కెటింగ్ చేసి అమ్మడం ఫ్యాబ్ ఇండియా బాధ్యత. కాలానికి తగ్గట్టు ఫ్యాషన్లను మార్చుకుంటూ జనాలకు అభిరుచులకు నప్పేట్లు వస్తువులను రూపొందిస్తూ వచ్చారు చేతివృత్తుల వాళ్లు. ఈ యజ్ఞంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ నుంచి వచ్చిన ఇద్దరు డిజైనర్లు రితు సూరి, రుచి త్రిపాఠి కూడా మెళకువలు నేర్పుతూ వచ్చారు. పేరుకు స్వచ్ఛంద సంస్థ, సొసైటీ మోడలే అయినా ఇక్కడ భాగస్వామ్యులంతా ఒక రకంగా పెట్టుబడిదార్లే. నాలుగు డబ్బులు పెట్టారంటే ఎవరైనా లాభాలనే ఆశిస్తారు. రంగసూత్ర కూడా ఎవరి ఆశలనూ వమ్ము చేయలేదు. సంస్థ ఏర్పాటు చేసిన రెండు, మూడేళ్లలోనే లాభ-నష్టరహిత స్థాయికి (బ్రేక్ ఈవెన్)కు వచ్చేసింది. అప్పటి నుంచి ఎంతో కొంత లాభాలు కంపెనీకి వస్తూనే ఉన్నాయి. 2010లోనే రంగసూత్ర దాదాపు రూ.10 కోట్ల టర్నోవర్ స్థాయికి ఎగబాకి అందరినీ ఆశ్చర్యపరిచింది.

చేతుల శుభ్రానికి 'సోపెన్'

అతిసార వ్యాధితో బాధపడుతూ మరణిస్తున్న శిశువుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. వీరి ప్రాణాలను కాపాడేందుకు ఇద్దరు మహిళలు చాలెంజ్‌గా తీసుకున్నారు. వారి కోసం ఒక ఉత్పత్తిని తయారు చేశారు.



అతిసార వ్యాధి మన దేశంలోని చాలామంది శిశువుల ప్రాణాలు బలిగొంటున్నది. ఈ రకంగా యేడాదికి సుమారు 13 శాతం మంది చనిపోతున్నారు. వారు కూడా ఐదు సంవత్సరాల్లోపు బాలలే. వీరికి ఈ వ్యాధి రావడానికి కారణం వారి తల్లిదండ్రులేనంటున్నారు వైద్య నిపుణులు. ఎక్కువమంది పిల్లలు బహిరంగ ప్రదేశాల్లో తిరిగి, ఆడుకుంటూ చేతులు కడుక్కోకుండానే ఇంట్లోకి ప్రవేశిస్తారు. ఆకలి అవ్వడంతో చేతుల శుభ్రత గురించి పట్టించుకోకుండా భోజనం ఆరగించేస్తారు. సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోనందువల్ల అతిసార వ్యాధికి గురవుతున్నారని తెలిసింది. దీనికి పరిష్కారానికి ఇద్దరు మహిళలు నాంది పలికారు. శుభం, అమానత్ అనే మహిళలు యూఎస్‌ఏలోని పర్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో డిగ్రీ చేస్తుండగానే ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. మొత్తానికి ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి ఒక ప్రాడక్ట్‌ను తయారుచేశారు. దాని పేరే 'సోపెన్'. ఎలా అంటే ఆహారం తీసుకొనే ముందు సబ్బు అవసరం లేకుండా సోపెన్‌తో చేతులను శుభ్రపరుచుకోవాలి. సబ్బులో ఉండే సల్ఫేట్స్, పాథలెట్స్, పారాబెన్స్, ఈడీటీఏలాంటి హానికర పదార్థాలు ఇందులో ఉండవు. కాబట్టి ఇది ఆరోగ్యానికి కూడా హాని చేయదు. ఈ పెన్‌తో రాసి కొన్ని గోరువెచ్చని నీళ్లతో చేతిని కడిగితే సరిపోతుంది. ప్రస్తుతానికి అమెరికాలో ఇది దొరుకుతున్నది. త్వరలోనే భారతదేశంలోని అతిసార వ్యాధితో బాధపడే పిల్లలకు పంపిణీ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అంతేకాదు.. పేద కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకే అందుబాటులోకి తెచ్చారు. సోపెన్‌ని వాడితే పిల్లల ఆరోగ్యం సరిగా ఉంటుందని వారు పేద ప్రజలకి భరోసా కల్పిస్తున్నారు.

నల్లటి వలయాల నివారణ ఇలా?



అధిక ఒత్తిడి కారణంగా నల్లటి వలయాలు ఏర్పడుతాయి. కంటికి కొంత ఉపశమనం దొరికితే చాలు సమస్య తొలిగించవచ్చు. ఈ కింది చిట్కాలను పాటిస్తే కంటికి కావాల్సినంత ఉపశమనం దొరుకుతుంది.

- తాజా కొబ్బరినూనె తీసుకోవాలి. దీన్ని నిద్రించే ముందు కంటి కింద నల్లటి వలయాలకు రాస్తూ ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి. ఉదయం లేవగానే గోరువెచ్చని నీటితో కడుగాలి. రోజూ ఈ విధంగా పాటిస్తే నల్లటి వలయాలు తొలిగిపోతాయి.
- కీరదోసని ముక్కలుగా కట్‌చేసి నిమ్మరసంలో ఐదు నిమిషాల పాటు నానబెట్టాలి. తర్వాత ముక్కలను కంటిమీద పెట్టుకోవాలి. 20 నిమిషాల తర్వాత తీసేస్తే సరిపోతుంది. రోజూ ఇలా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి కళ్లకి ఉపశమనం లభిస్తుంది.
- టీ బ్యాగ్‌ను కొంచెంసేపు ఫ్రిడ్జ్‌లో పెట్టాలి. బాగా చల్లగా అయిన తర్వాత కంటిమీద 30 నిమిషాల పాటు పెట్టుకోవాలి. బ్యాగ్‌ని తొలిగిస్తే కంటి కింద నల్లటి మచ్చలు తగ్గడం చూడొచ్చు.
- కాటన్ బట్టను రోజ్‌వాటర్‌లో బాగా నానబెట్టాలి. బట్టను తీసి కంటిరెప్పల మీద పెట్టుకోవాలి. 15 నిమిషాల తర్వాత తీసేస్తే కొంతమేర ఉపశమనం లభిస్తుంది.
- పాలలో దూదిని ముంచాలి. కొంతసేపటి తర్వాత కంటి కింద నల్లటి వలయాల మీద పెట్టుకోవాలి. 20 నిమిషాల పాటు అలానే ఉంచితే పాలలోని లాక్టిక్ యాసిడ్ మచ్చలను తొలిగిస్తుంది.
- నిమ్మరసం, టమాట గుజ్జుని బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని కంటి కింద రాయాలి. 10 నిమిషాల తరువాత నీటితో కడుగాలి.

వంట చిట్కాలు



- ఆమ్లెట్ రుచిగా ఉండాలంటే కొద్దిగా కొబ్బరి తురుము కలుపుకోవాలి.
- బ్రెడ్ ప్యాకెట్‌లో ఆలూ ముక్కలు ఉంచితే బ్రెడ్ త్వరగా పాడవదు.
- ఇంగువ నిల్వచేసే డబ్బాలో పచ్చి మిరపకాయ వేస్తే తాజాగా ఉంటుంది.
- పచ్చికొబ్బరి చాలా కాలం నిలువ ఉండాలంటే లోపలి భాగంలో నిమ్మరసం పూసుకోవాలి.
- వంటలు రుచిగా రావాలంటే కారంతో పాటు చిటికెడు ఉసిరిపొడి వేసుకోవాలి.
- దొండకాయలు త్వరగా ఉడకాలంటే కొద్దిగా వంటసోడా కలుపుకోవాలి.

ఈ నడుం నొప్పికి సర్జరీ తప్పదా?

నా వయసు 45 సంవత్సరాలు. మూడు నెలలుగా నడుమునొప్పితో బాధపడుతున్నాను. పది రోజులుగా బాగా ఇబ్బంది పడుతున్నా. నొప్పి కారణంగా ఎటూ కదలలేకపోతున్నా. నడుం నుంచి పాదాల వరకు తిమ్మిర్లు వస్తున్నాయి. మూడు రోజులుగా మూత్రం కూడా ఆగి ఆగి వస్తున్నది. ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించాం. దానిని చూసిన వైద్యులు సర్జరీ అవసరం అంటున్నారు. కొంతమంది వద్దంటున్నారు. సర్జరీ చేయించుకుంటే కాలు పడిపోయే ప్రమాదం ఉందని మా కొలీగ్స్ అంటున్నారు. నాకు భయంగా ఉంది. సలహా ఇవ్వగలరు.

- కౌశిక్‌రావు, మెహదీపట్నం




మీరు L5/S1 రేడిక్యులోపతితో బాధపడుతున్నారు. అయితే నొప్పి మాత్రమే ఉన్నవారిలో, నడుముకి బెల్ట్ వేసుకోవడం, మందులు వాడడం, తగినంత రెస్ట్ తీసుకోవడంతో 80 శాతం మందికి నొప్పి తగ్గుతుంది. మిగిలిన వారికి సర్జరీ అవసరం అవుతుంది. కాళ్లకు సంబంధించిన నరాలు మల, మూత్ర విసర్జనకు అవసరమైన నరాలు అన్నీ నడుము నుంచే కిందకు వెళతాయి. అయితే నడుము బొక్కలు అరిగినప్పుడు డిస్కులు బయటికి జారి, నరాలు ఒత్తుకోవడం వల్ల నడుము నొప్పి, తిమ్మిర్లు, మూత్రంలో ఇబ్బంది ఏర్పడుతాయి. ఇలా జరుగుతుందంటే.. వెంటనే ఆపరేషన్ చేయించుకోవాల్సిన సమయం ఆసన్నమైనట్లే. సమయం వృథా చేసున్న కొద్దీ పరిస్థితి మరింత జఠిలమవుతుంది. మీరు చెబుతున్నదానిని బట్టి చూస్తే.. మీకు కచ్చితంగా సర్జరీ చేయాలి. సరైన న్యూరో సర్జన్‌తో ఆపరేషన్ చేయించుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఇప్పుడు మైక్రోస్కోప్ ద్వారా కేవలం గంటకన్నా తక్కువ సమయంలోనే సర్జరీ చేసే సదుపాయాలు ఉన్నాయి. మూడు రోజుల్లో నడుచుకుంటూ ఇంటికి వెళ్లొచ్చు. అయితే మంచి ఆస్పత్రిలో న్యూరో సర్జరీ లేదా స్పైన్ సర్జన్‌తో ఆపరేషన్ చేయించుకోవాలి.



డాక్టర్ మురళీధర్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్.

సిరిముగ్గు

21 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు





జి. శ్రీనిధి,
కూకట్‌పల్లి,
హైదరాబాద్

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 14 జనవరి 2019



ఇంటర్న్‌షిప్ పని అనుభవానికే పట్టం

మన చదువుకు సంబంధించిన రంగంలో లేదా విభాగంలో, కెరీర్ డెవలప్‌మెంట్ అవకాశాలకు అవసరమైన ప్రాక్టికల్ అనుభవాన్ని ఇచ్చేదే 'ఇంటర్న్‌షిప్'. ఇటు విద్యార్థికి అటు సంస్థకు అర్థవంతమైన, పరస్పర ఉపయుక్తమైన ప్రక్రియగా ఇంటర్న్‌షిప్‌ను అభివర్ణించవచ్చు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను సమకూర్చుకునేందుకు వీలుగా కొత్త ఇంటర్న్‌షిప్ విధానం అమల్లోకి రానున్నది. నూతన ఇంటర్న్‌షిప్ విధానంపై సంక్షిప్తంగా...

- **లక్ష్యాలు:** విద్యార్థులకు వాస్తవ పరిశ్రమ అనుభవాన్ని, ప్రొఫెషనలిజానికి కావాల్సిన అనుభవాన్ని ఇస్తుంది. సంబంధిత బ్రాంచీలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత ద్వారా శిక్షణ ఉంటుంది. దీంతో ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్‌లో గడించిన అనుభవాన్ని తరగతి గదుల్లో చర్చించడం, తరగతిగదిలో చదివిన అంశాలకు ప్రాక్టికల్ అనుభవాన్ని జోడించడం సాధ్యపడుతుంది. దీని ద్వారా భవిష్యత్‌లో పరిశ్రమలకు కావాల్సిన నిపుణుల కొరత తీరుతుంది.

ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు లాభాలు
- ఇండస్ట్రీ/ఆర్గనైజేషన్ హైరింగ్‌కు అవకాశాలు
- ప్రాక్టికల్ అనుభవం
- తరగతిగదిలో నేర్చుకున్న థియరీని ప్రాక్టికల్ ద్వారా అనుభవంలోకి తెచ్చుకోవడం
- విద్యార్థులు భవిష్యత్తులో వృత్తి ఎంపిక, కెరీర్‌ను తీర్చిదిద్దుకునే క్రమంలో ఉపయోగపడుతుంది
- కొత్త నైపుణ్యాలను, జ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం
- టీం వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవచ్చు.
- టైం మేనేజ్‌మెంట్, మల్టీటాస్కింగ్ స్ట్రాటజీలను నేర్చుకునే అవకాశం
- కొత్త వ్యక్తులను కలవడం, నెట్‌వర్కింగ్ నైపుణ్యాలను అభ్యసించడం

విద్యాసంస్థలకు ఉపయోగాలు
- పరిశ్రమతో విద్యాసంస్థలకు సంబంధాలు మెరుగుపడటం
- సంస్థల క్రెడిబిలిటీ, బ్రాండింగ్ పెరుగుతుంది
- పరిశ్రమ/విద్యార్థుల ఫీడ్‌బ్యాక్‌తో కరిక్యులంలో మార్పులు చేర్పులకు అవకాశం
- బోధన, అభ్యసన పద్ధతిలో అభివృద్ధి.

ఏఐసీటీఈ కొత్త నిబంధనలు
- దేశంలోని ఇంజినీరింగ్/పాలిటెక్నిక్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంతోపాటు పరిశ్రమలకు అవసరమయ్యే విధంగా విద్యార్థులను తయారుచేయడానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) కొత్త నిబంధనలను రూపొందించింది. దీనిలో భాగంగా ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న పద్ధతికి భిన్నంగా రెండో సెమిస్టర్ నుంచే ఇంటర్న్‌షిప్ చేయడానికి మార్గదర్శకాలను రూపొందించింది. కొత్త నిబంధనల ప్రకారం..
- **ఇంజినీరింగ్ (బీఈ/బీటెక్) విద్యార్థులు:** కనీసం 14-20 క్రెడిట్స్ ఇంటర్న్‌షిప్/ఎంట్రప్రెన్యూరియల్ యాక్టివిటీస్ లేదా ప్రాజెక్ట్ వర్క్ లేదా సెమినార్ అండ్ ఇంటర్ లేదా ఇంట్రా ఇన్‌స్టిట్యూషనల్ ట్రెయినింగ్ చేయాల్సి ఉంటుంది.
- **డిప్లొమా విద్యార్థులు:** మూడేండ్లలో కనీసం 10-14 క్రెడిట్స్ ఇంటర్న్‌షిప్ చేయాలి.

నోట్: 1 క్రెడిట్ అంటే కనీసం 40-45 గంటల పని. ఫుల్‌టైం ఇంటర్న్‌షిప్‌లో వారంలో కనీసం 40-45 గంటలు ఇంటర్న్‌షిప్/ట్రెయినింగ్ లేదా ప్రాజెక్ట్ వర్క్ చేసే అవకాశం ఉంటుంది. ఈ అంచనా ప్రకారం బీఈ/బీటెక్ పూర్తయ్యేలోగా కనీసం 600-700 గంటల ఇంటర్న్‌షిప్, డిప్లొమా విద్యార్థులు అయితే 450-500 గంటల ఇంటర్న్‌షిప్ చేయాలి.

- ఇంటర్న్‌షిప్ పార్ట్‌టైం/ఫుల్‌టైంలో చేయవచ్చు. వేసవి సెలవులు అయితే ఫుల్‌టైం, అకడమిక్ సెషన్‌లో అయితే పార్ట్‌టైం చేసుకునే విధంగా ఏఐసీటీఈ కరిక్యులాన్ని రూపొందించింది.
- 4, 6వ సెమిస్టర్ తర్వాత వేసవి సెలవుల్లో ఇంటర్న్‌షిప్/ఇన్నోవేషన్ లేదా ఎంట్రప్రెన్యూర్‌షిప్ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనాలి.

ఇంటర్న్‌షిప్ ఎక్కడ
- పరిశ్రమల్లో లేదా ఎన్‌జీవోలు, ప్రభుత్వ సంస్థలు, చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయవచ్చు. 8వ సెమిస్టర్ చివరలో ప్రాజెక్టు వర్క్, సెమినార్ లాంటివి ఆయా సంస్థ/కాలేజీల్లో పేర్కొన్న ప్రకారం చేయాలి.
- ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తాను చేసిన ప్రతి పనికి సంబంధించిన డాక్యుమెంటరీ ప్రూఫ్స్‌ను ధృవీకరించే విధంగా ఫైల్‌ను తయారుచేసుకోవాలి. దాన్ని కాలేజీలో సమర్పించాలి.

కాలేజీలు ఏం చేయాలి?
- ఏఐసీటీఈ కొత్త నిబంధన ప్రకారం ప్రతి కాలేజీలో ట్రెయినింగ్ ప్లేస్‌మెంట్ సెల్‌ను, దానిలో ట్రెయినింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ (టీపీవో)ను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి. టీపీవో విద్యార్థి కెరీర్ విషయంలో కీలకంగా వ్యవహరించాలి. అకడమిక్/కెరీర్ పరంగా విద్యార్థికి సలహాలు, సూచనలు ఇస్తుండాలి. పరిశ్రమకు, విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేయాలి. టీపీసీ విద్యార్థుల పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, వొకాబులరీ, రెజ్యూమే తయారీ, ఈమెయిల్ రైటింగ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, ఆప్టిట్యూడ్ ట్రెయినింగ్, ప్రాక్టీస్ టెస్ట్‌లు, టెక్నికల్ రిపోర్ట్ రైటింగ్, ప్రజంటేషన్ స్కిల్స్, విదేశీ భాషల్లో ప్రావీణ్యం వంటివాటిని పర్యవేక్షించాలి.

గైడ్‌లైన్స్
- టీ&పీ సెల్ విద్యార్థులకు పరిశ్రమలు/సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌ను ఏర్పాటుచేయాలి. 2,4,6,7వ సెమిస్టర్ లేదా ఏఐసీటీఈ/సంబంధిత విశ్వవిద్యాలయ నిబంధన ప్రకారం ఇంటర్న్‌షిప్‌పై కార్యక్రమాలను రూపొందించాలి.

ఏఐసీటీఈ అసిస్టెన్స్/ఫెసిలిటేషన్:
- దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల కోసం ఏఐసీటీఈ వివిధ సంస్థలు/మంత్రిత్వశాఖలతో, విదేశీ సంస్థలతో ఎంవోయూలను కుదుర్చుకుంది.

ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు
- ఇంటర్న్‌శాల, NETiit for internships in Taiwan, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్, సీసీఈఐ-కొరియా, ఐఐడబ్ల్యూఎం-బెంగళూరు, ఈసీఐ, ఫోర్త్ ఆంబిట్, లింక్‌డ్ ఇన్, టీఎస్ఎస్‌సీ, స్కాలర్స్‌మెరిట్, ఎంఎస్ఎంఈ.
- **మూల్యాంకనం:** విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌పై సంస్థలు/పరిశ్రమలు, సైట్ విజిట్ చేసే ఫ్యాకల్టీ సూపర్‌వైజర్‌లు మూల్యాంకనం చేస్తారు. సంస్థలో సెమినార్, వైవా ద్వారా ఇంటర్న్‌షిప్ తీరును మదింపు చేస్తారు.

అదనపు అకడమిక్ గ్రేడ్‌లు
- అకడమిక్ గ్రేడ్‌లకు అదనంగా ఇంటర్న్‌షిప్‌లకు ఏఐసీటీఈ 100 పాయింట్లను కేటాయించనుంది. దేశవ్యాప్తంగా ఒకే పద్ధతిలో పాయింట్లు కేటాయిస్తారు. లేటరల్ ఎంట్రీ ఇంజినీరింగ్ విద్యార్థులకు 75 పాయింట్లు నిర్దేశించారు. సామాజిక సేవ, తదితర కార్యాక్రమాలను ఇంజినీరింగ్ విద్యార్థులు 300-400 గంటలు. డిప్లొమా విద్యార్థులు 200 నుంచి 250 గంటలు చేపట్టాల్సి ఉంటుంది. ఇది నాన్ క్రెడిట్ కార్యక్రమంగా ఉంటుంది. ప్రతి విద్యార్థి దీనికి సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలు సమర్పించాలి. స్థానిక పాఠశాలలో సేవలందించడం, గ్రామాల ఆర్థిక వనరులు పెంపొందించేందుకు ప్రణాళికలు సూచించడం, మంచినీటి సదుపాయాలు, టూరిజం ప్రమోషన్, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రచారం చేయడం తదితర అంశాలను చేపట్టాలి.

కొత్త విధానంలో
- విద్యార్థులు కేవలం కాలేజీలకే పరిమితం కాకుండా థియరీకి సంబంధించి ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపుదల, సంక్లిష్ట సమస్యల శోధన, సాధన, సామాజిక బాధ్యతలను చేపట్టడం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, లైఫ్ లాంగ్ లెర్నింగ్ తదితరాలను నేర్చుకోవడం కొత్త ఇంటర్న్‌షిప్ లక్ష్యాలు.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

ఇంటర్న్‌షిప్ నుంచి ప్లేస్‌మెంట్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్‌లో ఇంటర్న్‌షిప్ గురించి ఆ సంస్థ డైరెక్టర్ మాటల్లో...



ఎన్‌వీ రమణారావు
నిట్ (వరంగల్) డైరెక్టర్

- విద్యార్థులకు ప్రత్యేకంగా ఇంటర్న్‌షిప్‌నకు సంబంధించి సంస్థ ఏ కార్యక్రమం చేపట్టదు. ఇక్కడ విద్యార్థులే స్వతహాగా ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకుని వారికి ఇష్టమున్న ఏరియాలు, కంపెనీలు, ప్రాంతాల్లో ఇంటర్న్‌షిప్ చేస్తుంటారు. తర్వాత దాన్నే ఎక్కువ మంది ప్రాజెక్ట్‌గా చేసి రిపోర్ట్ సబ్‌మిట్ చేస్తారు. ఇక్కడ చదివే విద్యార్థుల్లో ఎక్కువమందికి ఇంటర్న్‌షిప్-ప్రాజెక్ట్ అనంతరం ఆయా కంపెనీలే అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇటీవలికాలంలో ఒక ప్రముఖ కంపెనీలో రూ.47లక్షల సీటీసీకి నిట్ విద్యార్థికి అవకాశం కల్పించింది. నిట్‌లలో వేసవి సెలవుల్లో ఇంటర్న్‌షిప్ చేస్తుంటారు. ఆరో సెమిస్టర్ నుంచి ఇంటర్న్‌షిప్ చేస్తారు. ఐఐటీల్లో కూడా ఇదే పద్ధతి ఉంది. నిట్‌లో చదివే విద్యార్థులకు ఆయా విషయాలపై సందేహాలు ఉన్నా, సహాయం కావాలన్నా సంబంధిత బ్రాంచీ లేదా ప్లేస్‌మెంట్ సెల్ వారు సహాయం చేస్తుంటారు.

ఉస్మానియాలో ఇంటర్న్‌షిప్...



వి.కుమార్
ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, ఓయూ

- ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆరో సెమిస్టర్ తర్వాత ఇంటర్న్‌షిప్ ఉంటుంది. అంటే విద్యార్థి దాదాపు 60 శాతం సబ్జెక్టు నేర్చుకుని ఉంటాడు. ఈ సమయంలో విద్యార్థి సంబంధిత సబ్జెక్టుపై పరిశ్రమ/సంస్థలో ఇంటర్న్‌షిప్‌నకు వెళ్తాడు. దీని వలన ఇప్పటివరకు చదివిన థియరీకి ప్రాక్టికల్ నాలెడ్జ్ తెలుస్తుంది. ఆయా పరిశ్రమల్లో రియల్‌టైం వర్క్, టీమ్‌వర్క్‌తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వర్క్ ఎన్విరాన్‌మెంట్, సంస్థల్లో నియమ నిబంధనలు తదితరాలన్నీ తెలుస్తాయి. ప్రస్తుతం యూసీఈలో ఆరో సెమిస్టర్ తర్వాత 8 వారాలు ఇంటర్న్‌షిప్ చేస్తారు. దీనికి 50 మార్కులు. 2 క్రెడిట్స్+వైవాను సంబంధిత డిపార్ట్‌మెంట్ ఇస్తుంది. 8వ సెమిస్టర్‌లో ప్రాజెక్ట్ కమ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ సమయంలో విద్యార్థులు ఎన్‌పీటీఈఎల్ ద్వారా ఆన్‌లైన్‌లో రెండు కోర్సులను తప్పనిసరిగా చేయాలి. ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ సమయంలో ఆయా కంపెనీలు విద్యార్థులకు రూ. 10 వేల నుంచి రూ. 25 వేల వరకు స్టయిఫండ్ ఇస్తున్నాయి. ఈ 5 నెలలు విద్యార్థులు కాలేజీకి రానవసరం లేదు. చివరి సెమిస్టర్‌లో విద్యార్థులు చేసే ప్రాజెక్ట్/ఇంటర్న్‌షిప్‌కు 200 మార్కులు- 8 క్రెడిట్స్ ఇస్తారు. ఇక్కడి విద్యార్థులు ప్రముఖ ఎంఎన్‌సీలు, కార్పొరేట్ కంపెనీలు, ఐఐటీ, నిట్, విదేశాల్లో సైతం ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు.

'సోషల్ వెల్ఫేర్'లో ఇంటర్ ప్రవేశాలు

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమసంత్సరం ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.



- తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఈ) పరిధిలోని కాలేజీల్లో ప్రవేశాలు.
- **కోర్సు:** ఇంటర్ (మొదటి సంవత్సరంలో ప్రవేశాలు)
- **అర్హత:** మార్చి-2019లో పదోతరగతి పరీక్షలు రాస్తున్నవారు లేదా తత్సమాన కోర్సు అభ్యర్థులు. పదోతరగతిలో ఏ1-బీ2 జీపీఏ సాధించిన అభ్యర్థులు సైనిక్/ఐఐటీ, సీవోఈల్లో ప్రవేశాలకు అర్హులు. మిగిలినవారు జనరల్, వొకేషనల్ కాలేజీల్లో ప్రవేశానికి అర్హులు.
- పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రెండులక్షలు, గ్రామీణ ప్రాంత విద్యార్థుల వార్షికాదాయం లక్షాయాభైవేలు మించరాదు. ఎంఆర్‌వో ధృవీకరించిన సర్టిఫికెట్ సమర్పించాలి.
- తెలుగు/ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అర్హులు.
- 2019, ఆగస్టు 31 నాటికి 17 ఏండ్లు మించరాదు. ఎస్సీ, క్రిస్టియన్స్‌గా కన్వర్టెడ్ అయిన ఎస్సీలకు వయస్సులో రెండేండ్లు సడలింపు ఉంటుంది.
- **రిజర్వేషన్లు:** ఎస్సీ-75, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్-2, ఎస్టీ-6, బీసీ-12, మైనార్టీలు-3, ఓసీ/ఈబీసీ-2 శాతం సీట్ల చొప్పున కేటాయిస్తారు. మొత్తం మీద 3 శాతం సీట్లను పీహెచ్‌సీలకు కేటాయిస్తారు. పీహెచ్‌సీ విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశాలకు అర్హులు కారు.

నోట్: మెరిట్, కమ్యూనిటీ రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తారు.

- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా. పేపర్ బేస్డ్ ఓఎంఆర్ టెస్ట్ మొత్తం 160 మార్కులకు ఉంటుంది.

సీవోఈ, ఐఐటీ గౌలిదొడ్డి (సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్)
- ఐఐటీ గౌలిదొడ్డి (బాలురు), సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (కరీంనగర్, కో ఎడ్యుకేషన్), గౌలిదొడ్డి (బాలికలు) కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి 45 ప్రశ్నల చొప్పున ఇస్తారు. బైపీసీ వారికి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి 45 ప్రశ్నల చొప్పున ఇస్తారు. సీఈసీ గ్రూప్ వారికి మ్యాథ్స్-45, సోషల్-55, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్-15, జీకే&కరెంట్ అఫైర్స్-15 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు.

- ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. ప్రతి సరైన జవాబుకు ఒక మార్కు ఇస్తారు. తప్పు జవాబుకు 1/4 మార్కులు కోతవిధిస్తారు. జంబ్లింగ్ విధానంలో పరీక్ష ఉంటుంది.
- **పరీక్ష విధానం:** పరీక్షలో మ్యాథ్స్-30, ఫిజికల్ సైన్స్-30, బయోసైన్స్-30, సోషల్ స్టడీస్-30, ఇంగ్లిష్ (కాంప్రహెన్షన్, గ్రామర్)-20, జీకే, కరెంట్ అఫైర్స్-20 ప్రశ్నల చొప్పున మొత్తం 160 ప్రశ్నలు ఇస్తారు.

నోట్: ఐఐటీ, సీవోఈ, సైనిక్ స్కూల్ ప్రవేశాల కోసం సెకండ్ లెవల్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. నాన్-స్పెషలైజ్డ్ కాలేజీల్లో ప్రవేశాలకు స్క్రీనింగ్ టెస్ట్-1 ఒక్కటే సరిపోతుంది.

- **సైనిక్ స్కూల్:** కరీంనగర్, రుక్మాపూర్‌లోని రాష్ట్రస్థాయి సైనిక్ స్కూల్. కేవలం బాలురు (పీహెచ్‌సీ కాకుండా) మాత్రమే అర్హులు. ఇక్కడ ఎంపీసీ గ్రూప్ ఒక్కటే ఉంటుంది.
- ఈ స్కూల్‌లో ప్రవేశాల కోసం రెండో స్క్రీనింగ్ టెస్ట్ తర్వాత మూడోదైన ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ తప్పనిసరిగా నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు.

సైనిక్ స్కూల్ (సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్)
- ఈ పరీక్షలో మ్యాథ్స్-45, ఫిజిక్స్-45, కెమిస్ట్రీ-45, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్-15 ప్రశ్నల చొప్పున ఇస్తారు. మొత్తం 150 ప్రశ్నలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/తెలుగు మీడియంలలో ఇస్తారు. ఇది డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది.

నోట్: ఇంటర్‌లో బోధన ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది.

కాలేజీలు
- **బాలుర కాలేజీలు:** మంచిర్యాల, కరీంనగర్, జనగామ, భద్రాది/కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి (చిలుకూరు, ఇబ్రహీంపట్నం, హిమాయత్‌నగర్), హైదరాబాద్(షేక్‌పేట), సంగారెడ్డి (హత్నూర్, కొండాపూర్), కామారెడ్డి (బిక్నూర్), యాదాద్రిభువనగిరిలో ఉన్నాయి.

బాలికల కళాశాలలు:
- ఆదిలాబాద్, వరంగల్ అర్బన్, ఖమ్మం (ఖమ్మం, దానవాయిగూడెం), రంగారెడ్డి (కమ్మదానం, నార్సింగి, నల్లకంచె), మేడ్చల్, హైదరాబాద్ (మహేంద్రహిల్స్), సంగారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ.
- వీటితోపాటు 38 ఐపీఈ బాలుర కళాశాలలు, 82 బాలికల కళాశాలలు, రెండు బాలుర వొకేషనల్ కాలేజీలు, తొమ్మిది బాలికల కళాశాలలు ఉన్నాయి.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 23
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** ఫిబ్రవరి 11 నుంచి 16 వరకు
- **మొదటి స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 17
- వివరాల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 180042545678లో సంప్రదించవచ్చు.
- **వెబ్‌సైట్:** http://tsswreisjc.cgg.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఐఏటీఎస్ఎల్‌లో సెక్యూరిటీ ఏజెంట్లు

కోల్‌కతాలోని ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏటీఎస్ఎల్) ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మొత్తం పోస్టులు:101
- **పోస్టు పేరు:** హ్యాండీమెన్
- **అర్హత:** ఎస్ఎస్‌సీ/పదోతరగతి ఉత్తీర్ణత. టెర్మినల్ విధులు, బ్యాగేజ్, కార్గో, లోడింగ్/అన్‌లోడింగ్ ఎయిర్ క్రాఫ్ట్ క్లీనింగ్, గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెన్సీలో ఏడాదిపాటు అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 28 ఏండ్లలోపు వారై ఉండాలి.
- **ఎత్తు:** 160 సెం.మీ. ఎస్సీ/ఎస్టీలు 2.5 సెం.మీ వరకు ఎత్తులో మినహాయింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 16,590/-
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ఫిజికల్ ఎడ్యూరెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 19
- **వెబ్‌సైట్:** www.airindia.in/careers.htm

దూరవిద్యలో బీఈడీ

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లెర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (ఎస్‌డీఎల్‌సీఈ) బీఈడీ (డీఎం) ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సు:** బీఈడీ (డిస్టెన్స్ మోడ్)
- **విద్యాసంవత్సరం:** 2018-20 (ఇది రెండేండ్ల (వేసవి సెలవుల్లో) కాలవ్యవధిగల కోర్సు).
- **స్టడీ సెంటర్లు:** వరంగల్ (ఎస్‌డీఎల్‌సీఈ, కేయూ, వరంగల్), ఏకశిల కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్-జనగామ, అనిబీసెంట్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్-ఖమ్మం, ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్-పెద్దపల్లి, పంచశీల కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్-నిర్మల్.

అర్హతలు:
- బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసి ప్రభుత్వ/ఎయిడెడ్ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో కనీసం రెండేండ్లు బోధనా అనుభవం (2019, జనవరి 31 నాటికి) తప్పనిసరి. తెలంగాణ ప్రాంత పరిధిలోని పాఠశాలల్లో పనిచేసినవారికి మాత్రమే. బీఏ/బీకాం లేదా బీఎస్సీతోపాటు టీటీసీ ఉత్తీర్ణులై ఉండాలి. కేయూ నిర్వహించే బీఈడీ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించాలి. 85 శాతం సీట్లను కేయూ పరిధిలోని లోకల్ అభ్యర్థులకు కేటాయిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను లోకల్/నాన్‌లోకల్‌కు కేటాయిస్తారు.
- **ప్రవేశాలు కల్పించే పద్ధతి:** ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత, సర్వీస్ సీనియారిటీ ఆధారంగా మొత్తం 500 సీట్లను భర్తీ చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు ఉంటాయి.
- **మెథడాలజీలు:** మ్యాథ్స్, ఫిజికల్ సైన్సెస్, బయాలజికల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్.
- **కౌన్సెలింగ్ తేదీలు:**
- మ్యాథ్స్, ఫిజిక్స్- ఫిబ్రవరి 26
- బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్- ఫిబ్రవరి 27

నోట్: కౌన్సెలింగ్‌కు హాజరయ్యేవారు ఒరిజినల్, జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలి.

- **ఫీజు:** కౌన్సెలింగ్ సమయంలో రూ. 25వేల డీడీని డైరెక్టర్, ఎస్‌డీఎస్‌సీఈ, కేయూ పేరిట తీయాలి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- **చివరితేదీ:** జనవరి 25
- రూ.200 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 2లోగా దరఖాస్తులు దాఖలు చేయాలి.
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 18
- పూర్తి వివరాలకు 0870-2438877, 2438899లో సంప్రదించవచ్చు.
- **వెబ్‌సైట్:** http://www.sdlceku.co.in

టీహెచ్‌డీసీఎల్‌లో అప్రెంటిస్‌లు

ఉత్తరాఖండ్‌లోని టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్ వివిధ ట్రేడ్ విభాగాల్లో అప్రెంటిస్‌ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు పేరు:** ట్రేడ్ అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 30
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఎలక్ట్రీషియన్-8, వైర్‌మెన్-2, సెక్రటేరియల్ అసిస్టెంట్-5, ఫిట్టర్/ప్లంబర్-2, మెకానిక్ కమ్ ఆపరేటర్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ సిస్టమ్-3, ఎలక్ట్రికల్ మెకానిక్-2, మెకానిక్ (రిపేర్ అండ్ మెయింటెనెన్స్)-2, స్టెనోగ్రాఫర్ (ఇంగ్లిష్-3, హిందీ-3)
- **అర్హత:** పదోతరగతి/ఇంటర్‌తోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. వైర్‌మెన్‌కు ఎనిమిదో తరగతి+ఐటీఐ ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 20
- **వెబ్‌సైట్:** http://thdc.gov.in

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ (రెగ్యులర్/కాంట్రాక్టు ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **మొత్తం పోస్టులు:** 31
- **విభాగాలవారీగా:** డిప్యూటీ మేనేజర్ (స్టాటిస్టీషియన్)-2, ప్రాజెక్టు డెవలప్‌మెంట్ మేనేజర్(డిజిటల్ ఇనీషియేటివ్)-3, మేనేజర్ (సర్వీసింగ్ డిజిటల్ ఇనీషియేటివ్స్)-3, మేనేజర్ (బిజినెస్ అనలిస్ట్/కస్టమర్ సర్వీస్ అనలిస్ట్)-2, మేనేజర్(ఆన్‌లైన్ ఫుల్‌ఫిల్‌మెంట్ ఇంటిగ్రేషన్)-3, మేనేజర్ (డిజిటల్ మార్కెటింగ్)-4, హెడ్ (లీగల్)-1, డీజీఎం(ఎన్‌సీఎల్‌టీ-1, లా-1), ఎగ్జిక్యూటివ్ (క్రెడిట్ మానిటరింగ్-10, హెడ్ (ప్రొడక్ట్ ఇన్వెస్టిమెంట్ & రిసెర్చ్)-1
- **అర్హత:** పీజీ (స్టాటిస్టిక్స్/డాటా అనలిస్ట్), బీఈ/బీటెక్ (కంప్యూటర్‌సైన్స్/ఐటీ), లా బ్యాచిలర్ డిగ్రీ/పీజీ, చార్టెర్డ్ అకౌంటెంట్, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు. పోస్టులను బట్టి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 600/-, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీలకు రూ.100/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.statebankofindia.com

వరంగల్ నిట్‌లో జేఆర్ఎఫ్

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో జేఆర్ఎఫ్ భర్తీకి ప్రకటన విడుదలైంది.



- **పోస్టు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ (ఎలక్ట్రికల్) లేదా ఎంటెక్ (పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ డివైజెస్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ సిస్టమ్స్)తోపాటు గేట్/గేట్ స్కోర్‌తో ఎంటెక్ చేసిన వారు అర్హులు.
- **కాలవ్యవధి:** ఏడాదిన్నర (మరో ఆరునెలలు పొడిగించవచ్చు)
- **కన్సాలిడేటెడ్ సాలరీ:** రూ.25,000+హెచ్ఆర్ఏ

నోట్: ఎంపికైన అభ్యర్థి నిట్ వరంగల్‌లో పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవడానికి అర్హుడు.

- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 8
- **వెబ్‌సైట్:** www.nitw.ac.in

సుడోకు

డైలీ సుడోకు 36 సమాధానం

1	4	6	2	9	5	8	3	7
7	5	8	3	6	1	4	9	2
9	2	3	4	7	8	1	6	5
2	1	7	8	4	9	3	5	6
5	3	4	1	2	6	9	7	8
6	8	9	5	3	7	2	1	4
8	7	2	6	1	3	5	4	9
4	6	1	9	5	2	7	8	3
3	9	5	7	8	4	6	2	1

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -37

	7		8	4			9	
8								1
			6	1				
					9		1	7
5	6	2			8	3		
					5	8	6	
1		5						8
							7	4
				9				

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 14 జనవరి 2019

గొప్పలు పోయే చదువుకన్నా కూడు పెట్టే చదువే ముద్దు.. నేటి విద్యార్థిలోకం ఆలోచన ఇదే. సాధారణ డిగ్రీలకు చాలాకాలం కిందటే ప్రధాన్యం తగ్గిపోయి ఇంజినీరింగ్‌కు నిన్నమొన్నటివరకు విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. కానీ ఇప్పుడు ఇంజినీరింగుకు కూడా క్రమంగా డిమాండ్ పడిపోతూ వస్తున్నది. త్వరగా జీవితంలో స్థిరపడాలన్న విద్యార్థుల ఆలోచనే అందుకు కారణం. అందువల్లనే చాలామంది విద్యార్థులు సంప్రదాయేతర కోర్సుల్లో చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. అలాంటివారికి సువర్ణావకాశం చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ). ఈ కోర్సు పూర్తిచేస్తే మంచి ఆదాయంతోపాటు సమాజంలో గొప్ప పేరు కూడా సంపాదించుకునే వీలుంది. అందుకే నిపుణ పాఠకులకోసం ఈ వారం సీఏ స్పెషల్ అందిస్తున్నాం..



ఘనమైన భవిష్యత్తుకు..

సీఏ

- సరైన కామర్స్ కోర్సు ఎంపికతోపాటు నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకుంటే కామర్స్ కింగ్స్‌గా ఎదగవచ్చు.
- ఒకప్పుడు కామర్స్ కోర్సులు అంటే చిన్నచూపు ఉండేది. కానీ ఇప్పుడు కామర్స్ కోర్సుల పట్ల సమాజంలో అవగాహన పెరిగింది. సీఏ కోర్సులు చదవడానికి అత్యధిక శాతం విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు.
- ప్రస్తుతం యువ వ్యాపారవేత్తల అవసరం పెరుగుతున్నది. దీనికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సంస్థలను నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలను ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానించడమే. ప్రభుత్వం మేకిన్ ఇన్ ఇండియాలో భాగంగా స్టార్టప్ కంపెనీలకు అత్యంత ప్రాముఖ్యం ఇస్తున్నది. పెరుగుతున్న ఆర్థిక అవసరాల దృష్ట్యా సీఏ వంటి కామర్స్ నిపుణులు, ఆర్థిక నిపుణులు, యువ పారిశ్రామికవేత్తల ప్రాధాన్యం పెరుగుతున్నది.
- ప్రస్తుత సమాజంలో మార్కెట్ అవసరాలకు సరిపడే కోర్సులు చదివిన కామర్స్ విద్యార్థులకు గిరాకీ ఉంది. వీరిలో సీఏలకు అవకాశాలు కోకొల్లలు. సీఏ పూర్తిచేసినవారు ఉద్యోగం చేయవచ్చు లేదంటే సొంతంగా ప్రాక్టీస్‌గానీ, వ్యాపారంగానీ ప్రారంభించవచ్చు.
- అత్యున్నత వేతనాలు, అపార గౌరవ మర్యాదలతో ఆర్థిక కార్యకలాపాలు ముందుండి నడిపే సీఏలకు రాబోయే రోజుల్లో అవకాశాలు విస్తృతం కానున్నాయి.
- భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎన్నో రెట్లు పెరుగనున్నాయి. బ్యాంకులో జరిగే లావాదేవీల పట్ల సీఏ చేసినవారికి అవగాహన ఉంటుంది. కాబట్టి బ్యాంకింగ్ రంగంలోని ఉపాధి అవకాశాలను చేజిక్కించుకోవడంలో కామర్స్ విద్యార్థులు అందరికంటే ముందుంటారు.
- ఎంపీ కవిత ఇటీవల ఒక సమావేశంలో మాట్లాడుతూ.. 'దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం. సీఏలు మరింత కృషి చేయాలి. నోట్లరద్దు కారణంగా సీఏలు రాక్‌స్టార్స్‌గా మారారు' అన్నారు.
- ఇటీవల సీఏ 'డే'ను పురస్కరించుకుని సీఏ ఇన్‌స్టిట్యూట్‌వారు నిర్వహించిన సభలో ప్రధాని నరేంద్రమోదీ.. 'దేశ ప్రధాని సంతకం కంటే ఒక సీఏ సంతకానికే ప్రాముఖ్యత ఎక్కువ' అని సీఏల గురించి తెలిపారు.
- దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చినందున పరిశ్రమ లావాదేవీలు పెరిగి చార్టర్డ్ అకౌంటెంట్లకు డిమాండ్ పెరగనున్నదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.
- నోట్లరద్దు, డిజిటల్ ట్రాన్సాక్షన్స్ వంటి నిర్ణయాల వల్ల బ్యాంకింగ్ రంగం ప్రాముఖ్యం పెరిగి, ఉద్యోగ అవకాశాలు విరివిరిగా పెరిగాయి.

సీఏలకు అవకాశాలు

- పన్ను గణన, అకౌంటింగ్, డేటా విశ్లేషణ విభాగాల్లో సీఏలకు లక్షకుపైగా కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, జీఎస్టీ అమలువల్ల నగదు చెలామణి లాభదాయకత, పారదర్శకత మెరుగుపడి పన్ను ఎగవేతలు తగ్గిపోయాయని, ఫలితంగా సంభవించే ఆర్థిక అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అంచనాను వ్యక్తం చేస్తున్నారు.
- గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఆదాయపు పన్ను రిటర్న్‌లు 50 శాతానికి పైగా నమోదయ్యాయి. ఇప్పటివరకు 6.08 కోట్ల ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు దాఖలయ్యాయి. ఇలా ఆదాయపు పన్ను రిటర్నుల సంఖ్య పెరగడంవల్ల సీఏలకు అవకాశాలు మరింత పెరిగాయి.
- 100 శాతం ప్లేస్‌మెంట్ ఉండే కోర్సు సీఏ.
- దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా సీఏలకు ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో త్వరలో జీఎస్టీ అమలు కానుంది. దీనివల్ల సీఏలకు యూఏఈలో అవకాశాలు విస్తృతం కానున్నాయి.

సీఏ ఎలా చదవాలి?

- సీఏ కోర్సును నిర్వహించే సంస్థ ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ).
- సీఏ కోర్సు సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ అనే మూడు దశలుగా ఉంటుంది.



- **ఐసీఏఐకి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.18,000.
- **ఐసీఏఐ పరీక్ష ఫీజు:** రెండు గ్రూపులకు రూ.2,700, ఒక్క గ్రూపునకు రూ.1,500.
- **పరీక్ష ఫీజు ఎప్పుడు చెల్లించాలి:** మేలో పరీక్ష రాయాలంటే ఫిబ్రవరిలోగా, నవంబర్‌లో పరీక్ష రాయాలంటే ఆగస్ట్ చివరిలోగా ఫీజు చెల్లించాలి.

గమనిక: పరీక్షల తేదీలు మారితే అందుకు అనుగుణంగా ఫీజు చెల్లించాల్సిన తేదీలు కూడా మారవచ్చు.

- సీఏ ఇంటర్మీడియట్ పరీక్ష ఏడాదికి రెండు సార్లు మే, నవంబర్ నెలల్లో నిర్వహిస్తారు.
- సీఏ ఇంటర్మీడియట్ పరీక్ష 8 పేపర్లు రెండు గ్రూపులుగా (గ్రూపునకు 4 పేపర్లు) ఒక్కో పేపర్ 100 మార్కులకు నిర్వహిస్తారు.
- విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులను సాధించాలి.
- నూతన విధానంలో విద్యార్థి వీలునుబట్టి రెండు గ్రూపుల పరీక్షలు ఒకేసారి లేదా విడివిడిగా ఒక్కో గ్రూపు 6 నెలల వ్యత్యాసంతో రాయవచ్చు.
- సీఏ ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారు మూడేండ్ల ఆర్టికల్‌షిప్ చేయాలి.

ప్రాక్టికల్ ట్రెయినింగ్

- సీఏ ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారు ఒక ప్రాక్టీసింగ్ సీఏ వద్దగాని, ఆడిట్ సంస్థలోగాని మూడేండ్ల పాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందాలి.
- సీఏ ఇంటర్మీడియట్‌లో రెండు గ్రూపులు లేదా ఏదైనా ఒక గ్రూపు (గ్రూప్-1గానీ, గ్రూప్-2గానీ) పూర్తిచేసినవారు ప్రాక్టికల్ ట్రెయినింగ్ చేయడానికి అర్హులు. ఇది నిజంగా సీఏ విద్యార్థులకు కలిసొచ్చే అంశం.
- ప్రాక్టికల్ ట్రెయినింగ్ సమయంలోనే ఒక ఏడాది ప్రాక్టికల్ ట్రెయినింగ్ ముగిశాక, సీఏ ఫైనల్ పరీక్ష రాసేలోగా సీఏ ఇన్‌స్టిట్యూట్ వారి నాలుగు ఏఐసీఐటీఎస్‌ఎస్ (అడ్వాన్స్‌డ్ ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్‌స్కిల్స్) శిక్షణ కూడా తీసుకోవాలి.
- ప్రాక్టికల్ ట్రెయినింగ్ చేస్తున్న సమయంలోనే విద్యార్థికి తాను ట్రెయినింగ్ తీసుకుంటున్న ప్రాంతాన్ని బట్టి రూ.2000 నుంచి రూ.7000 వరకు స్టయిఫండ్ లభిస్తుంది.

మొదటి దశ

సీఏ ఫౌండేషన్

- **అర్హత:** ఇంటర్ ఎంఈసీ/ఎంపీసీ/బైపీసీ/సీఈసీ/హెచ్ఈసీ ఇలా ఏ గ్రూప్ వారైనా సీఏ కోర్సు చదువవచ్చు. అయితే సీఏ చేయాలనుకునే చాలామంది విద్యార్థులు ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపుతోపాటే సీఏ ఫౌండేషన్ కూడా ఏకకాలంలో చదవడానికి సుముఖత చూపిస్తున్నారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్ష రాసిన ఎవరైనా సీఏ ఫౌండేషన్ కోర్సుకు ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వద్ద నమోదు చేసుకోవాలి. నమోదు చేయించుకున్న నాలుగు నెలలకు సీఏ ఫౌండేషన్ పరీక్ష రాయవచ్చు.

రిజిస్ట్రేషన్

- మేలో పరీక్ష రాయాలంటే ముందు ఏడాది డిసెంబర్ 31లోగా నమోదు చేసుకోవాలి.
- నవంబర్‌లో పరీక్ష రాయాలంటే అదే ఏడాదిలో జూన్ 30లోగా నమోదు చేసుకోవాలి.
- **ఐసీఏఐకి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు :** రూ.9,200/- (ప్రాస్పెక్టస్‌తో కలిపి)
- **ఐసీఏఐ పరీక్ష ఫీజు:** రూ.1500/-

పరీక్ష ఫీజు ఎప్పుడు చెల్లించాలి?

- మేలో పరీక్ష రాయాలంటే ఫిబ్రవరి నెలాఖరులోగా, నవంబర్‌లో పరీక్ష రాయాలంటే ఆగస్టు చివరిలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి.

గమనిక: పరీక్ష ఫీజు చెల్లించాల్సిన తేదీలు పరీక్షల తేదీలకు అనుగుణంగా మారవచ్చు.

- సహజంగా ప్రతి ప్రవేశపరీక్షను మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల రూపంలో నిర్వహిస్తారు. గతంలో ఇప్పటి సీఏ ఫౌండేషన్ స్థానంలో నిర్వహించిన సీపీటీ పరీక్ష కూడా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల రూపంలోనే నిర్వహించారు. కానీ, సీఏ ఫౌండేషన్ పరీక్ష 50 శాతం మార్కులకు డిస్క్రిప్టివ్ పద్ధతిలో, మరో 50 శాతం మార్కులకు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది.
- సీఏ ఫౌండేషన్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉండటంవల్ల విద్యార్థులకు విశ్లేషణాత్మకత పెరుగుతుంది. అలాగే డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఉండటంవల్ల భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెరిగే అవకాశం ఉంది.

సీఏ ఫౌండేషన్ - సబ్జెక్టులు, మార్కులు

పేపర్	సబ్జెక్టులు	మార్కులు	వ్యవధి
పేపర్-1	ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ అకౌంటింగ్	100	3 గంటలు
పేపర్-2	బిజినెస్ లాస్ (60 మా.) బిజినెస్ కరస్పాండెన్స్ అండ్ రిపోర్టింగ్ (40 మా.)	100	3 గంటలు
పేపర్-3	బిజినెస్ మ్యాథమెటిక్స్ (40 మా.) లాజికల్ రీజనింగ్ (20 మా.) స్టాటిస్టిక్స్ (40 మా.)	100	2 గంటలు
పేపర్-4	బిజినెస్ ఎకనామిక్స్ (60) బిజినెస్ అండ్ కమర్షియల్ నాలెడ్జ్ (40)	100	2 గంటలు

- నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా, పారిశ్రామిక అవసరాల దృష్ట్యా సీఏ విద్యార్థికి అన్ని రకాల నైపుణ్యాలు ఉండాలన్న ఉద్దేశంతో సిలబస్ ఇలా రూపొందించారు.
- ఇప్పటి సీఏ ఫౌండేషన్ విధానంలో మొదటి నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్‌కు పెద్దపీట వేశారు. కాబట్టి భవిష్యత్తులోని దశలైన సీఏ ఇంటర్, ఫైనల్ వంటి దశల్లో ఉత్తీర్ణత సాధించే అవకాశాలు మెరుగయ్యాయని చెప్పవచ్చు. సీఏ ఫౌండేషన్ సిలబస్‌లోని పేపర్-2లో ఇంగ్లిష్ గ్రామర్, రైటింగ్ స్కిల్స్, లెటర్ రైటింగ్, నోట్ మేకింగ్ వంటి కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన అనేక అంశాలను పొందుపర్చారు. దీనివల్ల విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించవచ్చు. డ్రాఫ్టింగ్ స్కిల్స్ కూడా పెరుగుతాయి.
- సీఏ ఫౌండేషన్ పరీక్ష 4 పేపర్లుగా, ఒక్కో పేపర్‌కు 100 మార్కుల చొప్పున మొత్తం 400 మార్కులకు ఉంటుంది. ఒక్కో పేపర్‌కు ఒక్కో రోజు చొప్పున నాలుగు రోజులు పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1, పేపర్-2 పరీక్షలు డిస్క్రిప్టివ్ పద్ధతిలో, పేపర్-3, పేపర్-4 పరీక్షలు ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరుగుతాయి.
- సీఏ ఫౌండేషన్ పరీక్షలు ప్రతి ఏడాది మే, నవంబర్‌లో నిర్వహిస్తారు.
- సీఏ ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. అదేవిధంగా నాలుగు పేపర్లు కలిపి 400 మార్కులకుగాను 50 శాతం మార్కులు అంటే 200 మార్కులు సాధించాలి.
- సీఏ కోర్సుకు సీఏ ఫౌండేషన్ అనేది ప్రవేశపరీక్ష అని చెప్పవచ్చు. సీఏ ఫౌండేషన్ పూర్తిచేసినవారే సీఏ చదవడానికి అర్హులు.
- ఇంజినీరింగ్, మెడిసిన్ చదవాలనుకునేవారికి ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షల వలెనే సీఏ చదవాలనుకునేవారికి సీఏ ఫౌండేషన్ అనేది ప్రవేశపరీక్ష.

రెండో దశ

సీఏ ఇంటర్మీడియట్

- ఈ సీఏ ఇంటర్మీడియట్ కోర్సును గతంలో సీఏ-ఐపీసీసీ అని పిలిచేవారు.
- సీఏ ఫౌండేషన్ పూర్తిచేసినవారు సీఏ ఇంటర్మీడియట్ చదవడానికి అర్హులు.
- సీఏ ఇంటర్మీడియట్ గ్రూపు-1, గ్రూపు-2లలో నాలుగు పేపర్ల చొప్పున ఎనిమిది పేపర్లు ఉంటాయి.

అర్హత

- డిగ్రీ పూర్తిచేసినవారు (కామర్స్ గ్రాడ్యుయేట్స్/పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అయితే 55 శాతం మార్కులు, ఇతర గ్రాడ్యుయేట్స్/పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ అయితే 60 శాతం మార్కులు సాధించి ఉండాలి) కూడా సీఏ ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా సీఏ ఇంటర్మీడియట్‌కు నేరుగా నమోదు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్

- మేలో పరీక్ష రాయాలంటే ముందు ఏడాది సెప్టెంబర్ 31లోగా నమోదు చేసుకోవాలి.
- నవంబర్‌లో పరీక్ష రాయాలంటే అదే ఏడాది మార్చి 1లోగా నమోదు చేయించుకోవాలి.

సీఏ ఇంటర్ - సబ్జెక్టులు, మార్కులు

పేపర్	సబ్జెక్టులు	మార్కులు	వ్యవధి
	గ్రూప్-1		
పేపర్-1	అకౌంటింగ్	100	3 గంటలు
పేపర్-2	కార్పొరేట్ లాస్ (60 మా.), అదర్ లాస్ (40 మా.)	100	3 గంటలు
పేపర్-3	కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్	100	3 గంటలు
పేపర్-4	ట్యాక్సేషన్ ఇన్‌కం ట్యాక్స్ (60 మా.), ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ (40 మా.)	100	3 గంటలు
	గ్రూప్-2		
పేపర్-5	అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్	100	3 గంటలు
పేపర్-6	ఆడిటింగ్ అండ్ అస్యూరెన్స్	100	3 గంటలు
పేపర్-7	ఎంటర్‌ప్రైజెస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (50 మా.), స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ (50 మా.)	100	3 గంటలు
పేపర్-8	ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (60 మా.), ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్ (40 మా.)	100	3 గంటలు

మూడో దశ

సీఏ ఫైనల్

- **అర్హత:** సీఏ ఇంటర్, రెండున్నరేండ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్ పూర్తిచేసినవారు సీఏ ఫైనల్ పరీక్ష రాయడానికి అర్హులు.
- **రిజిస్ట్రేషన్:** మే నెలలోగానీ, నవంబర్‌లో కానీ సీఏ ఫైనల్ పరీక్ష రాయాలంటే పరీక్షలకు ముందు ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- **ఐసీఏఐకి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు :** రూ.22,000
- సీఏ ఫైనల్లో రెండు గ్రూపులు ఉంటాయి.
- సీఏ ఫైనల్ పరీక్ష ఏడాదికి రెండుసార్లు మే, నవంబర్ నెలల్లో నిర్వహిస్తారు.
- సీఏ ఫైనల్ పరీక్ష మొత్తం 8 పేపర్లు, 2 గ్రూపులుగా (గ్రూపునకు 4 పేపర్ల చొప్పున) ఒక్కో పేపర్ 100 మార్కులకు మొత్తం 800 మార్కులకు నిర్వహిస్తారు.
- విద్యార్థి వీలునుబట్టి 8 పేపర్లు ఒకేసారి లేదా ఒక్కో గ్రూపు విడివిడిగా రాయవచ్చు.
- విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తంమీద 50 శాతం మార్కులు సాధించాలి.
- **ఐసీఏఐవారి పరీక్ష ఫీజు :** రెండు గ్రూపులకు రూ.3,300, ఒక్క గ్రూపునకు రూ.1800
- **పరీక్ష ఫీజు ఎప్పుడు చెల్లించాలి:** మేలో పరీక్ష రాయాలంటే ఫిబ్రవరి నెలాఖరులోగా, నవంబర్‌లో పరీక్ష రాయాలంటే ఆగస్ట్ చివరిలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి.



నోట్: పరీక్ష ఫీజు చెల్లించాల్సిన తేదీలు పరీక్షల తేదీలకు అనుగుణంగా మారవచ్చు.

- సీఏ ఇంటర్మీడియట్, రెండున్నరేండ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్ పూర్తిచేసినవారు సీఏ ఫైనల్ పరీక్షకు నమోదు చేసుకుని సీఏ ఫైనల్ పరీక్ష రాయవచ్చు.
- సీఏ ఫైనల్ పరీక్ష 8 పేపర్లు రెండు గ్రూపులుగా (గ్రూపునకు 4 పేపర్లు) ఒక్కో పేపర్ 100 మార్కులకు నిర్వహిస్తారు.
- విద్యార్థి వీలునుబట్టి 8 పేపర్లు ఒకేసారి లేదా ఒక్కో గ్రూపు విడివిడిగా రాయవచ్చు.
- విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తంమీద 50 శాతం మార్కులు సాధించాలి.

సీఏ ఫైనల్ - సబ్జెక్టులు, మార్కులు

పేపర్	సబ్జెక్టులు	మార్కులు	వ్యవధి
	గ్రూప్-1		
పేపర్-1	ఫైనాన్షియల్ అకౌంటింగ్	100	3 గంటలు
పేపర్-2	స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్	100	3 గంటలు
పేపర్-3	అడ్వాన్స్‌డ్ ఆడిటింగ్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్	100	3 గంటలు
పేపర్-4	కార్పొరేట్ లాస్ (60 మా.), ఎకనామిక్స్ లాస్ (40 మా.)	100	3 గంటలు
	గ్రూప్-2		
పేపర్-5	స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పర్ఫామెన్స్ ఎవల్యూషన్	100	3 గంటలు
పేపర్-6	ఎలక్టివ్ పేపర్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్ ఎకనామిక్ లాస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్ గ్లోబల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ మల్టీ డిసిప్లీనరీ కేస్ స్టడీ	100	3 గంటలు
పేపర్-7	డైరెక్ట్ ట్యాక్స్ లాస్ (70 మా.), ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్ (30 మా.)	100	3 గంటలు
పేపర్-8	ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ లాస్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (75 మా.), కస్టమ్స్ అండ్ ఎఫ్‌టీపీ (25 మా.)	100	3 గంటలు


- కంపెనీలకు మేనేజింగ్ డైరెక్టర్లుగా, ఫైనాన్స్ కంట్రోలర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, మార్కెటింగ్ మేనేజర్, ఫైనాన్స్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ప్లాంట్ అకౌంటెంట్స్, సిస్టమ్ ఇంప్లిమెంటర్స్, టెక్నో ఫంక్షనిస్టులుగా అవకాశాలు పొందవచ్చు. అంతేకాకుండా ట్రస్టీగా, అడ్మినిస్ట్రేటర్‌గా, వ్యాల్యూయర్‌గా, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా, ట్యాక్స్ కన్సల్టెంట్లుగా ఉద్యోగాలు లభిస్తాయి.



మట్టుపల్లి ప్రకాశ్
మాస్టర్ మైండ్స్
హైదరాబాద్
9248733323

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 14 జనవరి 2019

ప్రేమలోక విహారి


అఖిల్

అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ మజ్ను'. వెంకీ అట్లూరి దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 25న ప్రేక్షకులముందుకురానుంది. 'ఈ సినిమా పాటలకు, టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్ర గీతాల్ని నేడు ఆన్‌లైన్‌లో విడుదల చేయబోతున్నాం. ప్రేమలోక విహారి అందమైన కథ ఇది. నచ్చిన నెచ్చెలి కోసం అభినవ మజ్ను ఏం చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది' అని చిత్ర బృందం తెలిపింది. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జార్జ్ సి విలియమ్స్, సంగీతం: తమన్, ఎడిటింగ్: నవీన్ నూలి.

అనూహ్య నిర్ణయం


సమంత

వివాహానంతరం పాత్రల ఎంపికలో తన పంథా మార్చుకుంది సమంత. వినూత్న ఇతివృత్తాల్ని ఎంచుకుంటూ పాత్రల పరంగా వైవిధ్యాన్ని కనబరుస్తున్నది. నందినిరెడ్డి దర్శకత్వంలో సమంత ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. కొరియన్ చిత్రం 'మిస్ గ్రానీ' ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో సమంత 20ఏళ్ల యువతిగా, 70 ఏళ్ల వృద్ధురాలి పాత్రలో కనిపించనుంది. తాజా సమాచారం ప్రకారం వృద్ధురాలి పాత్రలో నటించడానికి సమంత విముఖంగా ఉన్నట్లు తెలిసింది. కెరీర్ జోరుమీదున్న ప్రస్తుత తరుణంలో బామ్మ పాత్రలో నటించడం అంత శ్రేయస్కరం కాదనే సన్నిహితుల సలహాతో సమంత వృద్ధురాలి పాత్రకు నో చెప్పిందని అంటున్నారు. ఈ పాత్ర కోసం సీనియర్ నటి లక్ష్మిని ఎంపిక చేసినట్లు సమాచారం. డెబ్బైఏళ్ల వృద్ధురాలు అనూహ్య పరిస్థితుల్లో 20ఏళ్ల యువతిగా మారితే ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథాంశం.

పెళ్లి తర్వాత 'ఎఫ్-2' కథ రాసుకున్నా!

'జంధ్యాల, ఈవీవీ సత్యనారాయణ, ఎస్వీ కృష్ణారెడ్డి సినిమాలు ఆద్యంతం ప్రేక్షకులకు వినోదాల్ని పంచుతాయి. దర్శకుడిగా అలాంటి సినిమాలు చేయాలనే కోరిక నాలో బలంగా ఉండేది. ఆ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది' అని అన్నారు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఎఫ్-2'. వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ నాయకానాయికలుగా నటించారు. దిల్‌రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో అనిల్ రావిపూడి పాత్రికేయులతో సంభాషించారు.

'దర్శకుడిగా ఇదివరకు వాణిజ్య హంగులతో కూడిన యాక్షన్ సినిమాలు చేశాను. వాటికి భిన్నంగా పూర్తిస్థాయి వినోదభరిత కథాంశంతో ఓ సినిమా చేస్తే బాగుండునని అనిపించింది. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' లాంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తెలుగులో వచ్చి చాలా కాలమైంది. ఆ లోటును భర్తీచేస్తూ భార్యాభర్తల అనుబంధానికి కామెడీని జోడించి ఈ సినిమా చేశాను. మాస్‌తో పాటు క్లాస్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నది. వెంకటేష్ పాత్ర, ఆయన మేనరిజమ్స్‌కు మంచి స్పందన లభిస్తున్నది. అలాగే బోరబండ కుర్రాడిగా వరుణ్‌తేజ్ సహజమైన అభినయాన్ని కనబరిచాడు. బాలీవుడ్‌లో గోల్‌మాల్, హౌస్‌ఫుల్ సినిమాల సీక్వెల్స్ ట్రెండ్‌ను సృష్టించాయి. వాటి తరహాలో 'ఎఫ్-2' కు సీక్వెల్ చేయాలనుంది. ఈ సీక్వెల్‌లో నటించడానికి వెంకటేష్, వరుణ్ తేజ్ సంసిద్ధతను వ్యక్తంచేశారు.


అనిల్ రావిపూడి

కాపీ కొట్టను..

ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలు చేసేటప్పుడు ప్రతి కథలో వైవిధ్యత ఉండాలి. సన్నివేశాల్లో కొత్తదనం కనిపించాలి. సినిమా చేస్తున్నప్పుడు ఆ తరహా కథాంశాలతో గతంలో వచ్చిన చిత్రాలన్నీ చూస్తాను. వాటికి భిన్నంగా నా శైలి హంగులతో తెరకెక్కించడానికి ప్రాధాన్యతనిస్తాను. దర్శకుడిగా, రచయితగా జంధ్యాల ప్రభావం నాపై ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికీ బోర్ కొట్టినప్పుడల్లా జంధ్యాల సినిమాలే చూస్తాను. ఆయన తర్వాత ఈవీవీ, కృష్ణారెడ్డి సినిమాలు నచ్చుతాయి. వారి శైలిని అనుసరిస్తాను కానీ కాపీ కొట్టను. పెళ్లయిన తర్వాత 'ఎఫ్-2' కథ రాసుకున్నాను. నా భార్య ఈ సినిమా చూసి ఏమనుకుంటుందోనని భయపడ్డాను. కానీ చాలా స్పోర్టివ్‌గా తీసుకుంది.

హద్దులు దాటకుండా

నా గత సినిమాల్లో గ్లామర్ కనిపించలేదని కొందరు తిట్టారు. ఆ ఆలోచనతోనే ఇందులో హద్దులు దాటకుండా కథానాయికల్ని గ్లామరస్‌గా ఆవిష్కరించే ప్రయత్నం చేశాను. కామెడీ సినిమా కాకుండా భిన్నమైన కథాంశంతో తదుపరి సినిమా చేయాలనుంది.